

బాబ్బాబ్బాబు... మీరే దిక్కు!

వలంటీర్ల చుట్టూ వైసీపీ రాజకీయం ▪ ఇటు తాయిలాలు.. అటు హామీలు

ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున పంపిణీ

ఆరోగ్య బీమా పాలసీలు.. ఎమ్మెల్యే అయితే వచ్చే జీతం మీకేనంటూ మరో నేత హామీ

వారికి ఇవ్వండంటూ నియోజకవర్గానికి రూ.కోటి ప్రకారం పంపిన ఎంపీ అభ్యర్థి

వైసీపీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి

కిందిస్థాయి నాయకుల్లో తిరుగుబాటు

వైసీపీ ఎన్నికల రాజకీయం అంతా వలంటీర్ల చుట్టూ తిరుగుతోంది. వారికి ప్రోత్సాహక బహుమతుల పేరుతో ప్రభుత్వం చెల్లిస్తున్న నగదు పారితోషికంతోపాటు వైసీపీ తరపున పోటీ చేయబోతున్న అభ్యర్థులు భారీ తాయిలాలు ఇస్తున్నారు. కొందరు ఇప్పటికే డబ్బు పంపిణీ చేయగా, మరికొందరు అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకొందరైతే మీ కుటుంబాలకు ఆరోగ్య బీమా పాలసీలు చేయిస్తామని, ఎమ్మెల్యే అయిన తర్వాత వచ్చే జీతం అంతా మీకే ఇస్తామని ఆశ చూపుతున్నారు. ఒంగోలు లోక్‌సభ పరిధిలో ఈ వ్యవహారం జోరుగా నడుస్తోంది. ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తున్న నేత సహకారం, ప్రోత్సాహం ఇందుకు ముఖ్యకారణంగా చెబుతున్నారు. అయితే 'పార్టీ కోసం కష్టపడిన తమను పట్టించుకోకుండా వలంటీర్లపైనే అధారపడతారా! కానీయండి చూస్తాం!' అంటూ వైసీపీ శ్రేణులు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలపై ఆధారపడి ముందుకు సాగడం గతం నుంచి జరుగుతోంది. అయితే ప్రస్తుతం అధికార వైసీపీ అందుకు భిన్నంగా వలంటీర్లను నమ్ముకుంది. నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎన్నికల్లో పోటీ చేయబోతున్న అభ్యర్థులు వలంటీర్లను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో ఏ నియోజకవర్గంలో చూసినా వారితో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమ కోసం పని చేసేలా తాయిలాల ఎరచూపుతున్నారు.

ఎక్కువ మంది అభ్యర్థులు స్థానికేతరులే!

జిల్లాలోని ఎక్కువ నియోజకవర్గాల్లో స్థానికేతరులను అభ్యర్థులుగా వైసీపీ రంగంలోకి దించింది. దీంతో వారు తూతూమంత్రంగా స్థానిక వైసీపీ శ్రేణులతో పరిచయ కార్యక్రమాలు నిర్వహించి వెంటనే వలంటీర్ల వైపు దృష్టి సారించారు. గతంలో ఒక ఊరికి వెళ్లాలన్నా, ఒక వార్డుకు వెళ్లాలన్నా ముందుగా ఆ ప్రాంత నాయకులతో సంప్రదించే అభ్యర్థులు ఇప్పుడు ముందుగా వలంటీర్లను కలుస్తున్నారు. ముఖ్యమంత్రి జగనే ఈ విధానాన్ని ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వపరంగా అధికారికంగా వలంటీర్లతో సమావేశాలు ఏర్పాటు చేయించి వారిని సన్మానించడం, అవార్డుల పేరుతో నగదు బహుమతులు ఇవ్వడం చేయించారు. అంతటితో ఆగకుండా రాజకీయపరమైన సమావేశాలకు కూడా శ్రీకారం పలికారు. వలంటీర్లు వారి పరిధిలోని ఓటర్ల సమాచారం తెలుసుకునేందుకే పరిమితం కాకుండా మీరే అంతా చూడాలంటూ వారిపై భారం వేశా పడం ప్రారంభించారు. అందుకు అనుగుణంగా వారికి తాయిలాలు కూడా పంచుతున్నారు.

నియోజకవర్గానికి రూ.75 లక్షల పైమాటే

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కేవలం వలంటీర్లకు ఇస్తున్న నగదే సరాసరి రూ.75 లక్షల వరకూ ఉంటుందని అంచనా. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్ చొప్పున నియోజకవర్గంలో 1,500 నుంచి 2వేల మంది వరకు వలంటీర్లు ఉన్నారు. సరాసరిన 1,500 మందికి ఒక్కొక్కరికి రూ.5వేల ప్రకారం ఇచ్చినా రూ.75 లక్షలు అందుకోసమే వినియోగిస్తున్నారు. ఒంగోలు లోక్‌సభ పరిధిలో ఈ వ్యవహారం అధికంగా జరగడానికి పార్టీ తరఫున ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థి ఆర్థిక ప్రోత్సాహమే కారణంగా భావిస్తున్నారు. ఇప్పటికీ రెండు మినహా ఐదు నియోజకవర్గాల అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.కోటి ప్రకారం ఆయన పంపినట్లు తెలుస్తోంది. ఆ డబ్బులు వలంటీర్లకు తాయిలాలుగా ఇవ్వాలని ఆయన సూచించినట్లు వినికిడి.

ఒక్కో వలంటీర్‌కు రూ.5వేలు

వైసీపీ తరఫున పోటీలోకి దిగనున్న పార్టీ ఇన్‌చార్జిలు ప్రతి వలంటీర్‌కు రూ.5వేల ప్రకారం పంపిణీకి శ్రీకారం పలికారు. ఈ వ్యవహారం ఒంగోలు లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇప్పటికే కొండపి, మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో పంపిణీ పూర్తయ్యింది. కొండపిలో ఒక్కో వలంటీర్‌కు రూ.5వేల ప్రకారం ఇవ్వడంతోపాటు ఇదే తరహాలో సచివాలయ ఉద్యోగులను కూడా గౌరవిస్తామంటూ సంకేతం పంపినట్లు తెలిసింది. ఒకట్రెండు గ్రామాల్లో వారికి కూడా నగదు అందించినట్లు కూడా తెలిసింది. మార్కాపురంలో అయితే పోటీ చేయబోతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు బొమ్మతో ఇచ్చిన గిఫ్ట్ ప్యాకెట్‌లో స్వీట్‌తోపాటు డబ్బులు పంపిణీ చేశారు. ఈ తంతు మిగిలిన నియోజకవర్గాల్లో దాదాపు పూర్తయ్యింది. దర్శి నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ప్రతి వలంటీర్ కుటుంబానికి ఆరోగ్య బీమా పథకం అమలుకు అవసరమైన ప్రీమియంను తానే చెల్లిస్తానని బహిరంగంగానే ప్రకటించారు. అంతేకాక తాను ఎమ్మెల్యే అయిన తర్వాత ప్రభుత్వం నుంచి వచ్చే జీతాన్ని నెలకు ఒక మండలంలోని వలంటీర్లకు కేటాయిస్తానని ప్రకటించినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఒంగోలులో అయితే వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డ్వాక్రా మహిళలకు చీరలు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. కాగా ఆదివారం జరిగిన వలంటీర్ల సమావేశంలో ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థల పట్టాతోపాటు శుభసూచకంగా ఒక చీర, ప్యాంటు, షర్టు ఇస్తానని ప్రకటించారు. కొంతకాలం క్రితం ఆయన వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు వార్డుల వారీ విందు కార్యక్రమాలు ఏర్పాటు చేసి బహుమతులు కూడా ఇచ్చారు. ఇప్పుడు వైసీపీ అభ్యర్థులుగా మంత్రి సురేష్, ఎమ్మెల్యేలు నాగార్జునరెడ్డి, రాంబాబు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో వలంటీర్లకు డబ్బుల పంపిణీ పూర్తయ్యింది. కనిగిరి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల్లో రంగంలో కొచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థులు వలంటీర్లతో సమావేశాలు నిర్వహిస్తూ తాము చేయబోయే సహకారం గురించి వారికి చెప్పి తదనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది.

రగిలిపోతున్న వైసీపీ శ్రేణులు

అనునిత్యం పార్టీ జెండా మోయడమే కాక పోలింగ్ సమయంలో కీలకపాత్ర పోషించే మమ్మల్ని పట్టించుకోకుండా వలంటీర్ల చుట్టూ తిరగడాన్ని చూసి వైసీపీలోని కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు రగిలిపోతున్నారు. 'వారికి నెలవారీ ఎంతో కొంత జీతం ఇస్తున్నారు. అన్నింటికీ మించి వలంటీర్లకు ఉద్యోగాలు మా సిఫార్సు మేరకే ఇచ్చారు. ఇప్పటికీ వారు మా పరిధిలోనే, మా అడుగుజాడల్లోనే ఉంటారు. అలాంటి వారికి మాతో సంబంధం లేకుండా తాయిలాలు ఇవ్వడం, అతిథి మర్యాదలు చేయడం, ఎన్నికల్లో మీరే బాధ్యులంటూ నాయకులు మాట్లాడటం మేము జీర్ణించుకోలేకపోతున్నాం' అని గ్రామస్థాయిలోని వైసీపీ నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. 'గత నాలుగున్నర సంవత్సరాలుగా మా బాగోగులు పట్టించుకోని నాయకులు వస్తే నిలదీద్దామనుకున్నాం. కానీ జగన్ తెలివిగా వేరే వారిని పంపారు. అయినా వారితో మా సంగతేంటి చెప్పండని కోరాలనుకున్నాం. కానీ మమ్మల్ని కాదని వారు నేరుగా వలంటీర్లతో మమేకమయిపోయారు. రేపు మాసత్తా చూపిస్తాం' అని కిందిస్థాయిలోని వైసీపీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

పది రోజుల తర్వాతే లోకేష్ పర్యటన

చంద్రబాబు కార్యక్రమం కూడా వాయిదా పడే అవకాశం



ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లాలోని ఆయా నియోజకవర్గాల టీడీపీ నేతలు వ్యక్తం చేసిన అభిప్రాయాలకు అనుగుణంగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటన వాయిదా పడింది. ఈనెల 7వ తేదీ నుంచే ఆయన జిల్లాలో శంఖారావం కార్యక్రమం ప్రారంభించాలనుకున్న విషయం విదితమే. అయితే 8వ తేదీ శివరాత్రి కావడంతో పదో తేదీ తర్వాత జిల్లాకు రావాలని టీడీపీ నేతలు సూచించారు. దీంతో జిల్లాలో పర్యటనను లోకేష్ మార్చుకున్నారు. రాయలసీమ నుంచి శంఖారావంను ప్రారంభించి ఆ వరుస క్రమంలో జిల్లాకు వస్తారని సమాచారం. దీంతో లోకేష్ శంఖారావం సభలు జిల్లాలో పది రోజుల తర్వాతే జరిగే అవకాశం ఉంది. ఈనెల 10వ తేదీన మార్కాపురంలో నిర్వహించాల్సిన చంద్రబాబు సభ కూడా వాయిదా పడే అవకాశం ఉంది. ఒంగోలు ఎంపీ మాగుంట, ఆయన కుమారుడు, ఇతర అనుచరులు పార్టీలో చేరేందుకు చంద్రబాబును జిల్లాకు రావాలని మాగుంట ఆహ్వానించారు. అయితే అందుకు తేదీ ఖరారు కాకపోవడంతో మార్కాపుం కార్యక్రమం కూడా పదో తేదీ కాకుండా ఆ తర్వాత నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిసింది.

చుక్కల మందుకు చక్కని స్పందన

99.01శాతం పల్స్ పోలియో

ఒంగోలులో ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్, బాలినేని

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 3 : జిల్లావ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఐదేళ్లలోపు ఉన్న 2,40,958 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా తొలిరోజైన ఆదివారం 2,38,580 (99.01శాతం) మందికి వేశారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేయనున్నారు. ఒంగోలులోని మంగమూరు రోడ్డులో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, వైద్యశాఖ జేడీ డాక్టర్ కామేశ్వరప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజ్యలక్ష్మి, డీఐవో డాక్టర్ పద్మజ, డీపీఎంవో డాక్టర్ వాణిశ్రీ, ఏవో హిమబిందు పాల్గొన్నారు.



డీసీఎంఎస్ కుంభకోణంపై బిగుస్తున్న ఉచ్చు

▪ రంగంలోకి పొగాకు బోర్డు ఈడీ ▪ నివేదిక కోరిన కమిషనర్

ఒంగోలు (విద్య), మార్చి 3 : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో జరిగిన ఎరువుల నిధుల గోల్‌మాల్‌పై ఉచ్చుబిగుస్తోంది. ఈ కుంభకోణంపై జిల్లా సహకారాధికారి రాజశేఖర్ ఇప్పటికే విచారణకు ఆదేశించారు. తాజాగా పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు విషయాన్ని సీరియస్‌గా తీసుకొని రాష్ట్ర మార్కెటింగ్, సహకారశాఖల ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరికి ఫిర్యాదు చేశారు. 'డీసీఎంఎస్'లో భారీ కుంభకోణం శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్త క్లిప్పింగ్‌ను కూడా ఆయనకు పంపించారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని సహకారశాఖ రాష్ట్ర కమిషనర్ అహ్మద్‌బాబును చిరంజీవిచౌదరి ఆదేశించారు. దీంతో అహ్మద్‌బాబు డీసీవోకు ఫోన్ చేసి నిధుల గోల్‌మాల్‌పై ఆరా తీశారు. ఆయన ఆదేశాల మేరకు డీసీవో ప్రాథమిక నివేదికను పంపారు. సమగ్రంగా విచారణ చేసి 4వతేదీకి నివేదిక సమర్పించాలని డీసీవోను కమిషనర్ ఆదేశించారు.

పొగాకు బోర్డు ఈడీ ఫిర్యాదు

డీసీఎంఎస్‌లో ఎరువుల నిధుల గోల్‌మాల్‌పై పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) అద్దంకి శ్రీధర్‌బాబు ప్రభుత్వ మార్కెటింగ్, సహకారశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరికి ఫిర్యాదు చేశారు. పొగాకు రైతులకు ఎరువులు సరఫరా చేసేందుకు ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్), రైతుల కమిటీ, డీసీఎంఎస్‌లు త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నాయి. డీసీఎంఎస్‌కు ఐపీఎల్ ఎరువులు సరఫరా చేస్తుంది. వాటిని పొగాకు బోర్డు ద్వారా డీసీఎంఎస్ రైతులకు ఇస్తుంది. బోర్డు రైతుల నుంచి ఆ మొత్తాలు వసూలు చేసి డీసీఎంఎస్‌కు జమ చేస్తోంది. డీసీఎంఎస్ ఆ మొత్తాలను ఒకట్రెండురోజుల్లోనే ఐపీఎల్ బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాల్సి ఉంటుంది. అయితే పొగాకు బోర్డు రైతులు చెల్లించాల్సిన మొత్తం నిధులు డీసీఎంఎస్‌కు జమ చేసి రెండు నెలలవుతున్నా ఇప్పటికీ ఇంకా రూ.72 లక్షలు ఐపీఎల్‌కు చేరలేదు. ఈ మొత్తం గోల్‌మాల్ అయిందని ఈడీ అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంలో జోక్యం చేసుకొని ఐపీఎల్‌కు రూ.72 లక్షలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని శ్రీధర్‌బాబు తన ఫిర్యాదులో చిరంజీవి చౌదరిని కోరారు.

ప్రారంభమైన విచారణ

డీసీఎంఎస్‌లో ఎరువుల నిధుల గోల్‌మాల్‌పై డీసీవో నియమించిన విచారణాధికారి అయిన ఒంగోలు సబ్ డివిజన్ సహకారాధికారి జె.రామచంద్రనాథ్ విచారణ ప్రారంభించారు. సొసైటీ రికార్డులు స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు. సొసైటీ బ్యాంకు ఖాతాల నుంచి భారీ మొత్తంలో నగదు అకౌంటెంట్ వ్యక్తిగత ఖాతాకు బదిలీ కావడాన్ని విచారణాధికారి గుర్తించారు. ఈ విషయంలో సొసైటీ బిజినెస్ మేనేజర్, అకౌంటెంట్, గుమస్తా, పాలకవర్గాన్ని ఆయన విచారించనున్నారు.



గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టు

ముగ్గురు అరెస్టు

రూ.34 లక్షల విలువైన 56 కేజీలు స్వాధీనం

వివరాలు వెల్లడించిన డీఎస్పీ కిషోర్‌బాబు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కిషోర్‌బాబు, పక్కన సీఐ రంగనాథ్, ఎస్సై నాగేశ్వరరావు

సింగరాయకొండ, మార్చి 3 : గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను వేర్వేరు సమయాల్లో పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ.34 లక్షల విలువైన 56 కేజీల గంజాయిని పట్టుకొని సీజ్ చేశారు. ఈ సంఘటనలు శనివారం టంగుటూరు వద్ద జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద చోటుచేసుకున్నాయి. వివరాలను ఒంగోలు డీఎస్పీ కిషోర్‌కుమార్ ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. ఒడిసా నుంచి కర్నాటక రాష్ట్రానికి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఒంగోలు జేడీ టీం సీఐ కె. వంశీధర్ టంగుటూరు జాతీయ రహదారిపై శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో జూనో బేకరీ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో బెంగళూరుకు చెందిన ముబారక్ గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు తేలింది. ఇతనితోపాటు నరేంద్రనాయక్, లక్ష్మణ్‌నాయక్, భరత్‌సాహుల ద్వారా ఒడిసా నుంచి బెంగళూరుకు బస్సుల్లో గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో సీఐ రంగనాథ్, జేడీ టీం సీఐ వంశీధర్, టంగుటూరు ఎస్సై నాగేశ్వరరావులు టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద కాపు కాశారు. బస్సులను, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్సులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నరేంద్రనాయక్, లక్ష్మణ్‌నాయక్‌ను పట్టుకున్నారు. వారి వద్ద 48 కేజీల గంజాయిను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. శనివారం మరో సంఘటనలో టంగుటూరు టోల్ ప్లాజ్ సమీపంలోని బాపూజీ కాలనీ రిక్వెస్ట్ బస్సు స్టాప్ సమీపంలో ఓ వ్యక్తి వద్ద గంజాయి ఉందనే సమాచారంతో అతడిని జేడీ టీం సీఐ వంశీధర్ అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ విచారణలో సలీం, కుట్టప్పన్ అనే వ్యక్తులు రాజమండ్రి నుంచి కేరళకు అక్రమంగా గంజాయి సరఫరా చేస్తున్నట్లు చెప్పాడు. దీంతో పోలీసులు టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. ఆర్టీసీ బస్సులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న కుట్టప్పన్‌ను సీఐ రంగ్‌నాథ్ అరెస్ట్ చేశారు. అతని వద్ద 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరుకు చెందిన ముబారక్, కేరళకు చెందిన సలీం కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. పక్క రాష్ట్రాల నుంచి గంజాయిను అక్రమ రవాణా చేస్తున్న ముఠాను పట్టుకున్న సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై వంశీధర్, నాగేశ్వరరావులను ఎస్పీ పరమేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారని డీఎస్పీ వెల్లడించారు.

టీడీపీలోకి వలసల వెల్లువ



కనిగిరిలో ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరిన యువత



యడవల్లి గ్రామస్థులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు



గిద్దలూరులో పార్టీలోకి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

వైసీపీని వీడి సైకిలెక్కుతున్న వివిధ వర్గాలు

జిల్లావ్యాప్తంగా భారీగా చేరికలు

సాదరంగా ఆహ్వానిస్తున్న నేతలు

పార్టీ అభ్యర్థులు, ఇన్‌చార్జిల నివాసాలు, కార్యాలయాల వద్ద సందడి

ఒంగోలు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తెలుగుదేశం పార్టీలోకి వలసలు వెల్లువలా కొనసాగుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా అన్నిచోట్లా వివిధ వర్గాల వారు వైసీపీని వీడి పెద్దసంఖ్యలో సైకిలెక్కుతున్నారు. దీన్నిబట్టి వైసీపీ ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత ఆయా వర్గాల ప్రజల్లో ఉన్నదన్న విషయం స్పష్టమవుతోంది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో ఇప్పటికే ఐదింటిలో టీడీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. దీంతో ఆయా నియోజకవర్గాలలో అభ్యర్థిత్వం ఖరారైన వారి సమక్షంలో పార్టీలో చేరేందుకు వివిధ వర్గాల వారు ఉత్సాహం చూపుతున్నారు. ఇతర నియోజకవర్గాల్లోనూ అక్కడి ఇన్‌చార్జిల సమక్షంలో వలసలు భారీగా జరుగుతున్నాయి. వీరిలో ప్రధానంగా ఎస్సీఎస్టీ, మైనారిటీలతోపాటు ఆర్యవైశ్యులు, బీసీల్లోని వివిధ వర్గాలకు చెందిన వారు ఎక్కువగా ఉంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం ఇలాంటి చేరికలు అధికంగా కనిపించాయి. దీంతో ఆయా ప్రాంతాల్లోని టీడీపీ అభ్యర్థులు, ఇన్‌చార్జిల నివాసాలు, కార్యాలయాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

భారీగా చేరికలు

ఆయా ప్రాంతాల్లో ఆదివారం చేరికలను పరిశీలిస్తే ఒంగోలులోని టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నివాసంలో ఉదయం కేశవరాజుకుంట ప్రాంతానికి చెందిన పలు కుటుంబాల వారితోపాటు 47, 57 డివిజన్లకు చెందిన వారు చేరారు. నగరంలోని రిక్షాల బజారులో ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన దాదాపు వంద కుటుంబాల వారు ప్రత్యేకంగా ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని దామచర్లను అక్కడికి ఆహ్వానించి టీడీపీ తీర్థంపుచ్చుకున్నారు. కొండపి నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి వద్ద సింగరాయకొండ మండలం సోమరాజుపల్లికి చెందిన పలు కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సమక్షంలో సంతనూతలపాడు మండలం వేములపాడుకు చెందిన పలు కుటుంబాల వారు వైసీపీని వీడి సైకిలెక్కారు. కనిగిరి నియోజకవర్గంలో చేరికల జోరు కొనసాగుతోంది. మునిసిపాలిటీ పరిధిలోని పలు కుటుంబాలతోపాటు పలువురు వలంటీర్లు ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు సమక్షంలో దోర్నాల మండలం యడవల్లిలో వైసీపీకి చెందిన వార్డు సభ్యుడు, పలు దళిత కుటుంబాలతోపాటు వై.పాలెం మండలం మురారిపల్లికి చెందిన వైసీపీ సీనియర్ నేత లక్ష్మిరెడ్డి పార్టీలో చేరారు. మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి సమక్షంలో పొదిలి మండలంలోని మూగచింతల ఎస్సీ కాలనీకి చెందిన సుమారు 70 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి సమక్షంలో కంభం ప్రాంతానికి చెందిన పలువురు మైనారిటీలు పార్టీలో చేరారు.

ఒంగోలులో జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న మహిళలు, యువకులు





పార్టీలో చేరిన చిన కనుమళ్ల, సోమరాజుపల్లి యువకులతో ఎమ్మెల్యే స్వామి



చీమకుర్తిలో బీఎన్, జనసేన నేతల సమక్షంలో పార్టీలో చేరుతున్న వైసీపీ వారు

రేపు టీడీపీ జయహో బీసీ సభ

సంతనూతలపాడు, మార్చి 3: గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా ఈనెల 5న జరిగే టీడీపీ జయహో బీసీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ పార్టీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. ఆదివారం ఒంగోలులోని తన కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షులు, బీసీ సెల్ నాయకులతో విజయ్‌కుమార్ సమీక్షించారు. జయహో బీసీ సభకు పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు హాజరైయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, గొట్టిపాటి రాఘవరావు, మండవ జయంత్‌బాబు, వేల్పుల శ్రీనివాసరావు, నర్రా నాగరాజు, కంకణాలబుజ్జి, పి.శ్రీనివాసరావు, అనీల్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐను కలిసిన జనసేన నాయకులు



ఎస్ఐ బ్రహ్మనాయుడుకు బొకే ఇస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, మార్చి 3 : నాగులుప్పలపాడు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన బ్రహ్మనాయుడును ఆదివారం జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు భూపతిమురళీ, పందిటి మధుబాబు, తాడి దానమూర్తి, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయకులు

ఒంగోలు(కల్చరల్),మార్చి 3: సెవెన్ హిల్స్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై ఆదివారం రాత్రి స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. సంస్థ అధ్యక్షుడు ఆర్.ఏడుకొండలు ఆధ్వర్యంలో ముందుగా గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొనసాగిన సంగీత విభావరిలో గాయకులు ఏడుకొండలు, హరిబాబు, గుమ్మడి శ్రీనివాసరావు, అన్నంరాజు రమేష్, డాక్టర్ మల్లిఖార్జునరావు, అంజుస్వామి, శైలజ, భారతి, పూర్ణిమ తదితరులు పాత కొత్త చిత్రాలలోని పలు గీతాలను రసరమ్యంగా ఆలపించారు.

పల్స్ పోలియోకు విశేష స్పందన



బట్టీల వద్ద చుక్కల మందు వేస్తున్న డాక్టర్ సుందరప్రసాద్

ఒంగోలు(రూరల్), మార్చి3: ఒంగోలు మండలం కరవది పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో 97.6 శాతం పూర్తి చేసినట్లు డాక్టర్ సుందర్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటుక బట్టీల దగ్గర 166 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు. డాక్టర్ ఎస్.వాణి, హెచ్ఈవో కృష్ణారెడ్డి, సూపర్‌వైజర్ మాధవి పర్యవేక్షించారు.

మద్దిపాడులో 97 శాతం..

మద్దిపాడు: మండలంలో 97 శాతం చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఆనంద్‌మోహన్ తెలిపారు. ఆదివారం ఇనమనమెళ్లూరులో ఎంపీపీ వాకా అరుణ, వెల్లంపల్లిలో సర్పంచ్ అనిల్, ఎంపీటీసీ అద్దేపల్లి దుర్గాభవాని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైసీపీ నాయకులు ఉప్పలపాటి పిచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో 98.43 శాతం



సంతనూతలపాడులో చుక్కల మందు వేస్తున్న వైద్యులు

సంతనూతలపాడు: జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం సంతనూతలపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 20 పల్స్ పోలియో కేంద్రాలు, ఒక మొబైల్ టీంను ఏర్పాటుచేసి 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియోచుక్కలను వేశారు. 1775 మంది పిల్లలు లక్ష్యం కాగా 1747 మందికి వేసి 98.43 శాతం లక్ష్యం సాధించినట్లు వైద్యురాలు పమిడి హరిణి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

అద్దంకి, మార్చి 3: అద్దంకి పట్టణంలోని గాజులపాలెంకు తంగా విజయ్(28)ను లారీ ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన ఒంగోలు సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం బైక్‌పై అద్దంకిలోని పాత పెట్రోల్ బంక్ సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



టీడీపీలోకి చేరిన 16వ డివిజన్ నాయకులు



దామచర్లకు మద్దతు తెలుపుతున్న కేశవరాజుకుంటవాసులు

వైసీపీ వద్దు..టీడీపీ ముద్దు..!

రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల సమక్షంలో భారీగా చేరికలు ● ఎన్నికల్లో తెలుగుదేశాన్ని గెలిపించాలని పిలుపు

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 3 : వైసీపీ ప్రభుత్వం అరాచకాలకు విసుగెత్తిన ఆ పార్టీ యువత తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు. ఈ మేరకు ఆదివారం ఒంగోలు నగరంలోని పలు డివిజన్ల నుంచి పలువురు వైసీపీ వద్దు.. టీడీపీ ముద్దు అంటూ పార్టీలో చేరారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ నేతృత్వంలో వైసీపీలో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని టీడీపీలో చేరడం సంతోషంగా ఉందని దామచర్ల తెలిపారు. తాను అన్ని వేళలా అండగా ఉంటానని, రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక 47వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు వేమూరి కొండలరావు ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరగా, స్థానిక 5, 6 డివిజన్ గోపాలనగరం నుంచి వైసీపీ నాయకులు ఎండేటి వెంకట సుబ్బారావు, మరో 25మంది టీడీపీలో చేరారు. అలాగే స్థానిక 16వ డివిజన్ నుంచి వైసీపీకి చెందిన మరో 40మంది టీడీపీలో చేరారు. అలాగే నగరలోని 2వ డివిజన్ కేశవరాజుకుంట నుంచి వైసీపీకి చెందిన సైకం మార్కు, పాదర్తి వాసు, మరో 50 మంది దామచర్ల సమక్షంలో ఆయన నివాసంలో టీడీపీలో చేరారు.

ఆర్యవైశ్యులు చేరిక

నగరంలోని 4వ డివిజన్‌లోని రిక్షాలుబజారులో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో దామచర్ల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే రోజులు తెలుగుదేశం పార్టీవే అన్నారు. ప్రజలందరూ వైసీపీని ఓడించడానికి సిద్ధంగా ఉన్నారని, ప్రతి ఒక్కరూ కష్టపడి టీడీపీ గెలుపు కోసం పనిచేయాలన్నారు. తాను అన్ని వేళలా అండగా ఉంటానని, అందరి జెండా, అజెండా, తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా సుమారు 40 కుటుంబాలకు చెందిన ఆర్యవైశ్యులు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోచేరగా, దామచర్ల పార్టీ కండువాలు కప్పి సాదరగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దొంగ పట్టాలని నిరూపిస్తే..పోటీ నుంచి తప్పుకుంటా..

నేటి నుంచి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు ● ఇచ్చిన మాటకు కట్టుబడి చీర, ప్యాంటు, షర్టు ఇస్తా ● ఎమ్మెల్యే బాలినేని



సభలో మాట్లాడుతున్న బాలినేని

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 3: ఒంగోలులో పేదలకు దొంగ పట్టాలు ఇచ్చినట్లు నిరూపిస్తే తాను ఎన్నికల్లో పోటీ చేయకుండా విరమించుకుంటానని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. అర్హులైన పేదలకు ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోనే భూములు కొనుగోలు చేసి పట్టాలు ఇచ్చామన్నారు. స్థానిక ఎ1 కన్వెన్షన్ హాలులో ఆదివారం ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ వలంటీర్లకు వందనం కార్యక్రమంలో బాలినేని మాట్లాడారు. నగరంలోని పేదలకు పూరిగుడిసెలు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి నిధులు మంజూరు చేయించి భూములు కొనుగోలు చేసినట్లు చెప్పారు. నిన్నటి వరకు పేదలకు పట్టాలు ఇవ్వలేదని మాట్లాడిన టీడీపీ నాయకులు ఇప్పుడు దొంగ పట్టాలు అని మాట్లాడటం దుర్మార్గంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదలకు పంపిణీ చేసిన పట్టాలు దొంగపట్టాలు అవుతాయా అని ఆయన ప్రశ్నించారు. అర్హులైన పేదలను సచివాలయ అధికారులే ఎంపిక చేశారని, ఇందులో పార్టీలను కూడా చూడలేదని, ఎవరి ప్రమేయం లేకుండానే పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. మాట తప్పి వెనుకడుగు వేసే రాజకీయాలను ఎప్పుడు చేయనన్నారు. మీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోనేది లేదని హెచ్చరించారు. టీడీపీ ప్రభుత్వ హయంలో టిడ్కో ఇళ్ళు కొత్తపట్నం మండలం ఆల్లూరులో కట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గతంలో తాను ఇచ్చిన మాట మేరకు సోమవారం పట్టాలు పొందిన లబ్దిదారులకు ఇంటి పట్టా రిజిస్ట్రేషన్‌తో పాటు చీర, ప్యాంటు, చొక్కాను ప్రతి ఇంటికి వెళ్ళి అందిస్తామని తెలిపారు. వలంటీర్లపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు దారుణంగా ఉన్నాయన్నారు. అనంతరం వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్లు వేమూరి బుజ్జి, వెలనాటి మాధవరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, వైసీపీ నాయకులు కఠారి శంకర్, గంటా రామానాయుడు, గోలి తిరుపతిరావు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన కూటమి విజయం తథ్యం

తెలుగుదేశం అభ్యర్థి బీఎన్

జనసేన పార్టీ నాయకుల పాదయాత్ర



జనసేన పాదయాత్రను ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, మార్చి 3: ప్రజల భవిష్యత్తు కోసం తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉమ్మడి కార్యచరణతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నాగులుప్పలపాడు నుంచి చదలవాడ వరకు చేపట్టిన ప్రజా జన చైతన్య పాదయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ జనసేన పార్టీ నాయకులు ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ప్రజా జనచైతన్య పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి ముప్పవరపు వీరయ్య చౌదరి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. అనంతరం చదలవాడలో పలు కారణాలతో మృతి చెందిన పేద జన సైనికుల కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. జన సైనికుల విరాళాలు రూ.1.50లక్షలతో ఎస్సీకాలనీలో నిర్మించిన తాగునీటి పైపులైను, ఎస్సీకాలనీలో గ్రావెల్ రోడ్డును విజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు.తొలుత నాగులుప్పలపాడులోని అంకమ్మ తల్లి దేవాలయం వద్ద పూజలు నిర్వహించిన టీడీపీ, జనసేన నాయకులు అక్కడి నుంచి పాదయాత్రగా చదలవాడ వరకు కొనసాగించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్, నియోజకవర్గ సమన్వయకర్త కందుకూరి బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ళ మనోజ్‌కుమార్, మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, ఇంటూరి శ్రీనివాసరావు, చాట్ల నారాయణ, తెలగతోటి జాన్సన్, జనసేన పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పెంట్యాల కోటేశ్వరరావు, మండల అధ్యక్షులు భూపతి మురళి, ఉపాధ్యక్షులు కొంజేటి ధనూష్, సాయి, చదలవాడ ఎంపీటీసీ పమిడిముక్కల శివకృష్ణ, మద్దిపాడు మండల అధ్యక్షులు నున్నా బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కూటమిలో చేరికల జోష్

చీమకుర్తి: చీమకుర్తి పట్టణంలో టీడీపీ-జనసేన కూటమిలో జోష్ నెలకొంది. ఆదివారం సాయంత్రంబాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా స్థానిక సూర్యానగర్, తోపుబజార్, శిద్దావారి వీధిలో టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్ కుమార్‌తో కలిసి జనసేన నాయకులు రాయపాటి అరుణ, కందుకూరి బాబు తదితరులు ఇంటింటా తిరుగుతూ విజయ్‌కుమార్‌ని గెలిపించాలని కోరారు. కాగా జనసేనలోకి చందు, పవన్, శివారెడ్డి, వెంకీ, పవన్, పండు, రితీష్, తేజ, భగీనాయుడు, రాము, పవన్, సలీమ్‌లు చేరారు. అలాగే టీడీపీలోకి సాదిక్, నజీర్‌బాష, రజాక్, సూరి, శివ, బాలబ్రహ్మం, షాకిర్, వెంకటేష్, సాయిసూర్యలు చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, కాట్రగడ్డ రమణయ్య, జనసేన నాయకులు పల్లపు శివప్రసాద్, తాతినేని శ్రీరాం, దరిమడుగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

12 కుటుంబాలు టీడీపీలోకి చేరిక

సంతనూతలపాడు: ఒంగోలులోని బీఎస్ కార్యాలయంలో మండలపరిధిలోని ఎమ్.వేములపాడుకు చెందిన 12 కుటుంబాలు వైసీపీని వీడి ఆదివారం విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు ఎం.శ్రీనివాసరావు, బి.రంగనాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీకి ఓటు వేయాలి



23వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



గుమ్మళంపాడులో ప్రచారం చేస్తున్న తెలుగుమహిళలు

● తెలుగుదేశం పార్టీ శ్రేణుల ప్రచారం

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 3: రాష్ట్ర అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం కోసం రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్ల వెంకటరత్నం కోరారు. ఆదివారం ఒంగోలు నగరం 23వ డివిజన్‌లో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాతమార్కెట్ సెంటర్, గానుగపాలెం, కోటవీధి తదితర ప్రాంతాల్లో సూపర్‌సిక్స్ పథకాల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. సైకో సీఎం జగన్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, దోచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ప్రజల నెత్తిన ధరల భారం మోపారన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. సందర్భంగా టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్కే.అన్వర్‌బాషా, వలేటి పవన్‌కుమార్, ఎస్‌కే.అక్బర్‌బాషా, బూదాటి భద్రి, చిట్టెంశెట్టి హరిబాబు, చెంచయ్య పాల్గొన్నారు.

గుమ్మళంపాడులో..

సంతనూతలపాడు: చంద్రబాబు వస్తేనే సంక్షేమ పాలన వస్తుందని తెలుగు మహిళలు పేర్కొన్నారు. ఆదివారం గుమ్మళంపాడు గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీపై ప్రజలకు అవగాహన కల్పించారు. బీఎన్.విజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాధవి, మీరమ్మ, అంజమ్మ, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి



కార్డులను పంపిణీ చేస్తున్న కోఆర్డినేటర్ శ్రీను

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 3: కిసాన్‌కార్డులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కిసాన్ సభ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీను తెలిపారు. ఆదివారం ఒంగోలులోని కాపు కళ్యాణమండపంలో జరిగిన రైతు వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కిసాన్ కార్డ్ ద్వారా రైతులు పొందే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్డుల ద్వారా రైతులు తమ పంటను ఎక్కడైనా ఎక్కువ మద్దతు ధరకు అమ్ముకునే వీలుంటుందని చెప్పారు. కార్డులను ఆర్‌బీకేల్లో రైతులు నేరుగా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

టెట్‌కు 135 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), మార్చి 3: జిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం జరిగిన ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు 135 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ తెలిపారు. ఉదయం సెషన్ పరీక్షకు 781 మందికి గాను 722 మంది హాజరు కాగా 59 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కు 780 మందికి 704 మంది హాజరు కాగా 76 మంది గైర్హాజరయ్యారు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పూర్తి



మాట్లాడుతున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 3: ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పూర్తయిందని ఆర్డీవో విశ్వేశ్వరరావు తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తపట్నం మండలం ఆల్లూరు మండల పరిషత్ పాఠశాలలో ఉన్న 234, 235 పోలింగ్ కేంద్రాలను అక్కడి సచివాలయం-2కు మార్చినట్లు చెప్పారు. ఒంగోలు నగరం, మండలంలో 10 పోలింగ్ కేంద్రాల గదుల నెంబర్లను మార్పు చేశామన్నారు. ఓట్ల చేర్పులు, మార్పుల కోసం వచ్చిన దరఖాస్తుల ప్రక్రియ చివరి దశకు చేరిందన్నారు. అనంతరం అంశాల వారీగా వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సృజన్‌కుమార్, డీటీలు అజయ్‌కుమార్, రఫీ, కొత్తపట్నం డీటీ అర్జున్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు డీఎస్.క్రాంతి కుమార్, రసూల్, గుర్రం సత్యనారాయణ, స్వరూప్, కట్టా శ్రీదేవి పాల్గొన్నారు.

'జూనియర్ ఎన్టీఆర్ స్ఫూర్తితో మిషన్ 2029'

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 3 : సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ ఇచ్చిన స్ఫూర్తితో మిషన్ 2029 పేరుతో పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు రాఎన్టీఆర్ ఫౌండర్ నల్లూరి సాయిరూప్ తెలిపారు. ఒంగోలులోని కేవీ కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో నిత్యాన్నదాన కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. మిషన్ 2029 పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను చేపట్టనున్నట్లు చెప్పారు. భావితరానికి బాట, యువతరానికి తోడు, యుద్ధానికి ఆయుధం, చేసే వ్యవసానికి తీసే కలుపు అనే నినాదంతో ఫౌండేషన్ ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో దుర్గా ప్రసాద్, శివ, కిషోర్, మణి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

1,590 మందికి వైద్య సేవలు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 3 : దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలు ఆవరణలో జరిగిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. గత ఎనిమిదేళ్ళ నుంచి ప్రతి రెండు నెలలకు ఒకసారి ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వైద్యులు గోపాళం శివన్నారాయణ, బి.హరిబాబు, జి.చైతన్య, ఎం.శరత్, రవితేజ, చాపల వంశీకృష్ణ, ఎస్.ధీరజ్‌బాబు పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారని క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు తెలిపారు. మెడికల్ క్యాంపు నిర్వహణ కోసం చీమకుర్తికి చెందిన డాక్టర్ జవహర్ రూ.10వేలు, ఢాకా సుబ్బారెడ్డి రూ.20 వేలు అందించారన్నారు. 1590మందికి వైద్య సేవలు అందించినట్లు పేర్కొన్నారు.

జగన్ పాలనలో వ్యవస్థలన్నీ నాశనం : టీడీపీ

మద్దిపాడు, మార్చి 3: జగన్ పాలనలో వ్యవస్థలన్నీ సర్వనాశనం అయ్యాయని టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు విమర్శించారు. ఆదివారం మద్దిపాడులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాటాడారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు సమష్టిగా పనిచేసి వైసీపీ అరాచకాలను ఎండకట్టాలన్నారు. వైసీపీ పాలనలో అన్నిరంగాలు కుదేలు అయ్యాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని ఆయన కోరారు. శ్రేణులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో దేవబత్తిన ప్రసాద్, మండవ గోపీనాథ్, రెబ్బవరపు ప్రభాకర్ పాల్గొన్నారు.

ఐడల్ గంధర్వలో జిల్లా గాయిని



పాటలు పాడుతున్న ఉషారాణి

ఒంగోలు(కల్చరల్), మార్చి 3: ప్రఖ్యాత గాయకుడు డాక్టర్ శ్రీశరత్‌చంద్ర రెండు తెలుగు రాష్ట్రాలలో గాయకుల ఎంపిక కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఐడల్ గంధర్వలో జిల్లాకు చెందిన గాయిని దావల ఉషారాణి పాల్గొని తన గానంతో న్యాయనిర్ణేతల అభినందనలు అందుకున్నారు. ఒంగోలు జిల్లా న్యాయస్థానంలో ఉద్యోగిని అయిన ఉషారాణి అనేక సంగీత విభావరిలలో తన గానంతో ప్రేక్షకుల మన్ననలు పొందారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాలలో జరుగుతున్న ఎంపిక ప్రక్రియలో భాగంగా ఆదివారం వైజాగ్ అల్లూరి విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన పోటీలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐడల్ గంధర్వ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం రావటం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు.

నేడు ఓటర్ల చైతన్య కళాయాత్ర

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 3: సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పదిన్నర గంటలకు స్థానిక రంగా భవన్‌లో ఓటు వేద్దాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అనే అంశంపై కళాయాత్రను నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ జిల్లా కన్వీనర్ కొల్లా మధు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, రిటైర్డ్ ఏఎస్పీ సుంకర సాయిబాబు, ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ మాగులూరి నాగేశ్వరరావు, సుపరిపాలన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఆళ్ల వెంకటేశ్వరరావు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా ప్రజా సాంస్కృతిక వేదిక కళాబృందం ఆటాపాటలతో ఓటర్ల చైతన్య గీతాలను, నృత్య నాటికలను, జానపదాలను నిర్వహిస్తారని పేర్కొన్నారు.

6న కలెక్టరేట్ ఎదుట సర్పంచ్‌ల ధర్నా

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 3: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేస్తూ ఆర్థిక సంఘం నిధులను దోపిడీ చేస్తున్న తీరుకు నిరసనగా ఈనెల 6వతేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి తెలిపారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండేళ్ళుగా సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణంగా ఉందన్నారు. వేలాది కోట్లు ఆర్థిక సంఘం నిధులను దారిమళ్ళించడమే కాకుండా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పంచాయతీలకు సమాంతర వ్యవస్థలను ఏర్పాటు చేసి పంచాయతీలను నిర్జీవం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా చేస్తున్న ఈ ధర్నాలో జిల్లాలోని సర్పంచ్‌లందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పగడాల రమేష్, రావెళ్ళ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీలలో పోలీసుల తనిఖీలు

ఒంగోల ్రకైం, మార్చి 2: ఒంగోలు నగరంలో అసాంఘీక కార్యక్రమాలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆదివారం డీఎస్పీ కిషోర్‌బాబు నేతృత్వంలో లాడ్జీలలో విస్తృతమైన తనిఖీలు చేశారు. అనుమానాస్పద వ్యక్తుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

9న దివ్యాంగుల మహాగర్జనకు తరలిరావాలి

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 3: దివ్యాంగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ నాయకులు ఆనాల సురేష్ కోరారు. ఆదివారం ఒంగోలులోని సమితి కార్యాలయంలో జరిగిన సమావేశలో ఆయన మాట్లాడుతూ గడచిన కొన్నేళ్ళుగా దివ్యాంగుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. తమ న్యాయమైన డిమాండ్‌ల పరిష్కారం కోసం ఈనెల 9 చలో అమరావతి, మహా గర్జనకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గ్రౌండ్‌లో మధ్యాహ్నం 12 గంటలకు జరిగే గర్జనకు ముఖ్యఅతిథిగా వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. ఈ గర్జనకు జిల్లావ్యాప్తంగా దివ్యాంగులు పెద్దసంఖ్యలో తరలి రావాలని కోరారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు అన్నెం చినసుబ్బయ్యయాదవ్, అందె రాంబాబు పాల్గొన్నారు.

వేగం కన్నా ప్రాణం మిన్న

మద్దిపాడు, మార్చి 3: వాహన చోదకులు వేగం కన్నా ప్రాణం మిన్న అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఎస్ఐ మహేష్ పేర్కొన్నారు. ఆదివారం గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ వద్ద వాహనాలను తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై నిబంధనలు తప్పక పాటించాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని ఆయన సూచించారు.



ప్రచారంలో పాల్గొన్న దామచర్ల

టీడీపీ గెలుపుతోనే మంచిరోజులు

● పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 3: రాబోచే ఎన్నికల్లోతెలుగుదేశంపార్టీ గెలుపుతో రాష్ట్రానికి మంచిరోజులు రాబోతున్నాయని, ప్రజలు ఆశీర్వదించి టీడీపీకి అండగా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ తెలిపారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని ఆదివారం నగర పరిధిలోని పెళ్ళూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలను కలుసుకుని మాట్లాడారు. నాలుగున్నరేళ్ళ వైసీపీ పాలనలో రాష్ట్రం మరో ఇరవై సంవత్సరాలు వెనక్కు వెళ్ళిందన్నారు. అభివృద్ధి చేయడం చేతకాని ప్రభుత్వం ఇష్టారాజ్యంగా ధరలు పెంచి ప్రజల నెత్తిన భారం మోపిందని ఆరోపించారు. ప్రజలందరూ తెలుగుదేశం పార్టీకి అండగా ఉండాలని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని దామచర్ల కోరారు. ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. చంద్రబాబు సీటు ఇచ్చారని, రాబోయే ఎన్నికలలో తనను ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుంచి దామచర్లకు ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో నాయకులు కొఠారి నాగేశ్వరరావు, మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, రాచగర్ల వెంకట్రావు, బండారు మదన్, సన్నిబోయిన జాలయ్య, చిరుమాళ్ళ శ్రీను, కృష్ణ, చంద్రశేఖర్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే స్వామి

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

● ఎమ్మెల్యే స్వామి సమక్షంలో 30 కుటుంబాలు చేరిక

సింగరాయకొండ, మార్చి 3 : మండలంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల జోరు కొనసాగుతూనే ఉంది. ఆదివారం చినకనుమళ్ల గ్రామానికి చెందిన 20 కుటుంబాలు, సోమరాజుపల్లికి చెందిన 10 కుటుంబాల వారు టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఆధర్యంలో టీడీపీలో చేరారు. ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. అధికారపార్టీ నాయకుల అరాచకాలు, బెదిరింపుల వల్ల ఉన్న పరిశ్రమలు కూడా పక్క రాష్ట్రాలకు పరారయ్యాయని విమర్శించారు. పార్టీలో చేరిన వారిలో చిరుతోటి సిద్ధార్థ, మెండా సుబ్రమణ్యం, ఉపేంద్ర, నవీన్, గుంటక రవీందర్, చొప్పర సందీప్, శ్రీకాంత్, కసుకుర్తి రాజేష్, దుగ్గిరాల వినీల్, చందు చొప్పర వెంకటేష్, సోమరాజుపల్లికి చెందిన ఖాదర్‌బీ, రౌతుంబీ, బీబీజాన్, రత్తమ్మ, పుష్ప షానూ, ఫాతిమా రాజమ్మ, విజయలక్ష్మి, చక్రవర్తి ఉన్నారు.



ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు

ఘనంగా మ్యూజిక్ ప్లాజా ప్రారంభం

ఒంగోలు (కల్చరల్),మార్చి 3: ఒంగోలులో తొలిసారిగా ఏర్పాటు చేసిన శ్రీభాస్కర్ మ్యూజిక్ ప్లాజా ప్రారంభోత్సవం ఆదివారం ఉదయం ఘనంగా జరిగింది. స్థానిక తాతా బిల్డింగ్స్ ఎదురు ఏర్పాటుచేసిన ఈ ప్లాజా ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీనియర్ గాయకులు అప్పిశెట్టి రత్తయ్య, పెండ్యాల సాయిమాస్టర్, డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ, స్వర్ణలత, బి.శేషారత్నం, శ్రీదేవి, డి.కోటేశ్వర రావు, అశోక్, బాలాజీ తదితరులు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్లాజాను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఔత్సాహిక గాయకులకు ఉపయోగపడేవిధంగా మ్యూజిక్ ప్లాజాను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. నిర్వాహకులు స్వర్ణలత, డి.కోటేశ్వరరావులు మాట్లాడుతూ తమ మ్యూజిక్ ప్లాజాలో గాయకులు నిత్యం ట్రాక్స్‌పై పాటలు సాధన చేయటానికి, కార్యక్రమాల సమయంలో రిహార్సల్స్ చేసుకోవటానికి అనువుగా మంచి సౌండ్ సిస్టమ్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. కనుక గాయకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లిఖార్జునరావు, ఐ.నరసింహారావు, యశోద, తులసీ, కోటేశ్వరరావు, వైవీ. రావు, బి.జెర్మియా తదితరులు పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ పథకాల ప్రచారంలో కొండయ్య, టీడీపీ శ్రేణులు

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్

చీరాల, మార్చి 3: వైసీపీ పాలనలో రాష్ట్ర భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించుకుని చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుంటేనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. మండలంలోని రామకృష్ణాపురంలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ, సూపర్ సిక్స్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడు చంద్ర బాబు అని అన్నారు. అలాంటి నాయకత్వం ప్రస్తుతం రాష్ట్రానికి అవసరమన్నారు. అన్నివర్గాలు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నాయన్నారు. రాష్ట్ర సచివాలయాన్ని తా కట్టు పెట్టి రూ.370 కోట్లు అప్పు తేవటం సీఎం జగన్ వికృత పాలనకు పరాకాష్టని మండిపడ్డారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నాతాని ఉమామహేశ్వర రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈనెల 5న మంగళగిరిలో జరగనున్న జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కొండయ్య పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జయహో బీసీ సభ విజయవంతం కోసం పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు కౌతవరపు జనార్దనరావు, నాసిక వీరభద్రయ్య, కావేటి వేణుగోపాల్, గుత్తి వీరప్రసాదరావు, అవ్వారు సాంబయ్య, కారంపూడి పద్మిని, తదితరులు పాల్గొన్నారు.

శంఖారావం సభకు శరవేగంగా ఏర్పాట్లు

పరిశీలించిన ఎమ్మెల్యే స్వామి, సత్య

టంగుటూరు, మార్చి 3 : టంగుటూరులో త్వరలో జరగనున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ శంఖారావం సభకు ఏర్పాట్లు శరవేగంగా చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఆ పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య చెప్పారు. టంగుటూరులోని జాతీయ రహదారిలో దక్షిణ బైపాస్ ఫ్లైఓవర్ సర్వీస్‌రోడ్డులో శంఖారావం బహిరంగ సభ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే స్వామి, సత్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏర్పాట్లు కొలిక్కి వచ్చాయన్నారు. వేదికకు రెండు వైపులా జాతీయ రహదారుల సర్వీస్ రోడ్లల్లో నుంచి పొలాల్లోకి పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైసీపీ, ముఖ్యమంత్రి జగన్‌పై ఉన్న ప్రజావ్యతిరేకతే శంఖారావం సభకు ప్రజలను రప్పిస్తుందన్నారు. నియోజకవర్గం నుంచి 20వేలకు తగ్గకుండా జన సమీకరణ చేయనున్నట్లు చెప్పారు.

శంఖారావం సభ శివరాత్రి తరువాతే

టంగుటూరులో జరగనున్న శంఖారావం సభ శివరాత్రి తరువాతే జరిగే అవకాశం ఉందని స్వామి, సత్య చెప్పారు. శివరాత్రికి జనమంతా దేవాలయాలను సందర్శించి జాగారం చేసే అవకాశం ఉందని, ప్రజల మనోభావాలను గౌరవిస్తూ శంఖారావం సభను వాయిదా వేసుకున్నామని తెలిపారు. ముందుగా శంఖారావం సభ టంగుటూరులో ఈనెల 4న అనుకున్నాం అని, అది 8కి వాయిదా పడ్డదని, ఇప్పుడు శివరాత్రి తరువాతే అని నిర్ధారించామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, నాగశ్రీను, అబ్బూరి అభిషేక్, బెజవాడ వెంకటేశ్వర్లు, దయానందం, జక్కుల శ్రీను, కసుకుర్తి భాస్కర్, గొర్రెపాటి రామయ్య, మొలకలపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు.



శంఖారావం వేదిక పరిశీలనలో ఎమ్మెల్యే స్వామి, సత్య

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం కల్పించాలి

● బీజేపీ అధికార ప్రతినిధి ఆంజనేయులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 3 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి ఇంటికి వెళ్ళి విస్తృత ప్రచారం నిర్వహించాలని బీజేపీ అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఒంగోలులోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం అసెంబ్లీ కన్వీనర్లు, మండల పార్టీ అధ్యక్షులు, కో కన్వీనర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఆయా పథకాల లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని కోరారు. ప్రతి గ్రామంలోని బూత్‌లో లబ్ధిదారుల ఇంటికి వెళ్ళి వివరించడంతో పాటు వచ్చే ఎన్నికల్లో బీజేపీ పట్ల ఆకర్షితులయ్యేలా చూడాలన్నారు. జన్‌ధన్ ఖాతాలు, గ్యాస్ కనెక్షన్లు, ముద్ర రుణాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్‌లో, ఇన్సూరెన్స్ ఆరోగ్య కార్డులు, ఉపాధి పథకం ఇలా సుమారు 160 పథకాలను ప్రధానమంత్రి ప్రవేశపెట్టారని తెలిపారు. తద్వారా జిల్లాలో పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ దామోదర్, అసెంబ్లీ కన్వీనర్లు యోగయ్యయాదవ్, మంచాల బ్రహ్మేశ్వరప్రసాద్, ఎనుముల నాగేశ్వరరావు, బాలకోటయ్య, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, అయినాబత్తిని సుబ్బారావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొద్దులూరి ఆంజనేయులు

నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 3 : ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం ఒంగోలులోని పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జరిగిన ఎన్నికలకు కె.మంజేష్ ఎన్నికల అధికారిగా ఎంఎస్.షరీఫ్ సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా కె.విద్యాసాగర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.నరేంద్రదేవ్, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కే.కరీముల్లా, కార్యదర్శిగా ఎం.కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా జేవీఎస్ఎల్‌వీ.ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా యు.లాలపరెడ్డి, ఎం.వినయ్‌బాబు, ఎంవీ.కృష్ణంరాజు, కోశాధికారిగా బి.బాపూజీ, జేసీసీ సభ్యునిగా సీహెచ్.ఖాదర్‌మస్తాన్‌తో పాటు రాష్ట్ర కౌన్సిలర్లుగా నలుగురిని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను సంఘ రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి, కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అశోక్‌కుమార్, శ్రీధర్‌రాజు తదితరులు అభినందించారు.

ఇంటర్ డ్యూటీల నుంచి ఎస్‌జీటీలు ఔట్

● విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాలు

ఒంగోలు (విద్య), మార్చి 3 : జిల్లాలో ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షల విధుల నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్లను తొలగించారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాలతో ఈమేరకు చర్యలు తీసుకున్నారు. ప్రవీణ్‌ప్రకాష్ శనివారం చీమకుర్తి మండలం గోనేపల్లివారిపాలెం మండల పరిషత్ పాఠశాలను సందర్శించారు. ఆ సమయంలో అక్కడ ఒక టీచర్ విధుల్లో ఉన్నారు. మరో టీచర్ ఇంటర్మీడియేట్ పరీక్షల డ్యూటీకి వెళ్లారు. దీంతో ఎస్‌జీటీలను పరీక్షల విధులకు కేటాయించడాన్ని ఆయన తప్పుపట్టారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి సైమన్ విక్టర్‌ను పిలిచి 'మా టీచర్లను మీరు పరీక్షల విధులకు వినియోగిస్తే పిల్లలకు పాఠాలు ఎవరు చెబుతారు' అని ప్రశ్నించారు. వెంటనే ఇంటర్మీడియేట్ పరీక్షల డ్యూటీలు చేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లను విధుల నుంచి రిలీవ్ చేసి పాఠశాలలకు పంపించాలని ఆదేశించారు. దీంతో ఇంటర్ పరీక్షల డ్యూటీలో ఉన్న 274 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లను రిలీవ్ చేసి వారి స్థానంలో డిగ్రీ కళాశాలలు, ప్రైవేటు పాఠశాలల టీచర్లను ఇన్విజిలేటర్లుగా నియమించినట్లు సైమన్ విక్టర్ తెలిపారు. ఇదిలా ఉండగా ఇలపావులూరు మండల పరిషత్ పాఠశాలలో ఒక టీచర్‌కు విదేశాలకు వెళ్లేందుకు అధికారులు అనుమతి ఇవ్వడంపై ప్రవీణ్‌ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవుకు అనుమతించిన ఎంఈవో వివరణ తీసుకోవాలని ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డిని ఆదేశించారు. ఆ టీచర్ విదేశాలకు వెళ్లేందుకు అనుమతిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల ఫైల్‌ను పంపించాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశించడంతో దాన్ని వాట్సప్ ద్వారా పంపారు. పొదిలి మండలం ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్‌ను ప్రవీణ్ ప్రకాష్ ప్రశంసించారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో తాను సందర్శించిన 72 హైస్కూళ్లలో ఉప్పలపాడులోనే ఐఎఫ్‌పీ అండ్ టీవీ వినియోగంలో చాలా బాగుందని మెచ్చుకున్నారు పాఠశాల విద్యార్థులను, ముగ్గురు టీచర్లను అభినందించారు.

అభివృద్ధి కోసం నన్ను గెలిపించండి

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర
- కొత్తూరులో వైసీపీని వీడిన 26 కుటుంబాలు
- వారితో పాటు డాక్టర్ ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరిన వలంటీర్లు




డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన గుడిపాడు వాసులు

కనిగిరి, మార్చి 3 : కనిగిరి ప్రాంత అభివృద్ధి కోసం తనను గెలిపించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ప్రజలకు సూచించారు. 7వ వార్డు కొత్తూరులో వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో 26 కుటుంబాలతో పాటు, ఇద్దరు వలంటీర్లు టీడీపీలో ఆదివారం చేరారు. వారికి ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొత్తూరు పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉగ్ర మాట్లాడుతూ వైసీపీ పాలనలో కనిగిరి ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తనకు అవకాశం ఇస్తే అభివృద్ధితోపాటు పేదల సమస్యల పరిష్కారానికి నిరంతరాయంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్లుగా మీవెంటే ఉంటూ తనకు చేతనైనంత సాయం చేస్తున్నాని గుర్తు చేశారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నాశనమైందని, ఉద్యోగులు, కార్మికు లు, ప్రజలందరూ ఇబ్బందులకు గురవుతున్నారని ఉగ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అన్నీ చక్కబడాలంటే చంద్రబాబను అందరం ముఖ్యమంత్రిని చేయాలన్నారు. భవిష్యత్ తరాల కోసం టీడీపీకి పట్టంగట్టాలని విజ్ఞప్తి చేశారు. కనిగిరి మున్సిపాల్టీగా మారితే అన్ని వసతులతో పాటు నగరాభివృద్ధి జరుగుతుందన్నారు. కనీసం నగర ప్రజలకు తాగునీరు కూడా వైసీపీ ఎమ్మెల్యే ఇవ్వలేకపోయారన్నారు. కనిగిరి ప్రాంతంలోనే పుట్టానని ఈ ప్రాంతం అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. సొంత చెల్లిని, అమ్మను పట్టించుకోని వారు రాష్ట్ర మహిళలకు న్యాయం ఎలా చేస్తారని ప్రశ్నించారు. బాబాయి చావుకు కారణమై, అతని కుమార్తెకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో అడ్డదారిలో తిరిగి అధికారంలోకి వచ్చేందుకు అనేక వ్యూహాలు పన్నుతున్నారని, రోజులు దగ్గరపడడంతో ప్రజలపై వరాలు కురిపిస్తూ ప్రేమను ఒలకపోస్తున్నారన్నారు.


జగన్‌రెడ్డి అబద్ధపు మాటలు, మడమతిప్పే హాలను ప్రజలు మళ్లీ నమ్మి మోసపోవద్దని ఉగ్ర హితవు చెప్పారు. విజ్ఞతతో ఆలోచించి, అభివృద్ధిని కాంక్షించేవారిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎన్నికలు పూర్తయ్యే వరకూ రోజూ అప్రమత్తంగా ఉంటూ తన విజయానికి కృషి చేయాలని ఉగ్ర విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో తమ్మినేని రవీంద్రరెడ్డి, వెంకటరెడ్డి (వలంటీర్లు), దశరద రామిరెడ్డి, గోపిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, శివరామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రమణారెడ్డిలతో పాటు మరో 20 కుటుంబాలు వారు ఉన్నారు.

నల్లచెరకు అమ్మకాలకు కేరాఫ్ నామ్ రోడ్డు

- కొనుగోలు చేస్తున్న పలురాష్ట్రాల ప్రయాణికులు
- గొర్రెపాడు జంక్షన్ వద్ద విక్రయాల జోరు
- గడ చెరకు రూ.30



నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి సమీపంలో కూకట్లపల్లిలో సాగుచేసిన నల్లచెరకు తోట



నల్లచెరకు గడలను అమ్ముతున్న యువకుడు

బల్లికురవ, మార్చి 3: తీయతీయని నల్ల చెరుకు అమ్మకాలకు కేరాఫ్‌గా నామ్ రోడ్డు మారింది. పలు రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులు వాహనాలను నిలుపుదలచేసి చెరుకు గడలను కొనుగోలు చేస్తున్నారు. కొందరయితే పెద్దమొత్తంలో చెరుకు గడలను కొనుగోలు చేసి తమ ప్రాంతాలకు తీసుకెళుతున్నారు. రోడ్లపై చెరుకు అమ్మకాలతో కొందరికి ఉపాధి కూడా దొరుకుతుంది.

బల్లికురవ మండలం గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాలలో సుమారు వంద ఎకరాల్లో నల్ల చెరుకు తోటలను సాగు చేస్తున్నారు. రైతులకు కూడా చెరుకు పంటపై మంచి లాభాలు వస్తుండటంతో ఏటేటా ఆసక్తిగా సాగు చేస్తున్నారు. ఈ రెండు గ్రామాల్లో ఎన్నోఏళ్ల నుంచి నల్ల చెరుకు సాగుచేస్తూ ఇతర ప్రాంతాలకు అమ్మకాలకు తరలిస్తున్నారు. తిరునాళ్లల్లో చెరుకు అమ్మకాలు పెద్దఎత్తున రైతులు స్వయంగా తీసుకెళ్లి తక్కువ ధరకే అమ్మకాలు చేస్తుంటారు. గత ఏడాది మేనెలలో చెరుకు పంట సాగు చేయగా, జనవరి నుంచి దిగుబడులు వచ్చాయి. నల్ల చెరుకు కోతలకి రావటంతో ఆ రెండు గ్రామాలకు చెందిన కొందరు దగ్గరలో ఉన్న అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి అయిన గొర్రెపాడు జంక్షన్‌లో చెరుకు అమ్మకాలు చేస్తున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నామ్ రోడ్డులో చెరుకు గడలను అమ్ముతున్నారు. కొందరు చిరు వ్యాపారులు రైతుల వద్ద చెరుకు గడ రూ.20 కొనుగోలు చేసి రాష్ట్రీయ రహదారిపై గడ రూ.30 చొప్పున అమ్ముతున్నారు.

గొర్రెపాడు జంక్షన్ వచ్చిందంటే వేగంగా వెళుతున్న వాహనాలకు బ్రేకులు పడుతున్నాయి. తీయని నల్ల చెరుకులను వాహనదారులు కొనుగోలు చేస్తున్నారు. రోజుకి సరాసరిన రెండు వేల చెరుకు గడలను విక్రయిస్తున్నట్టు వ్యాపారులు తెలిపారు. నాలుగు మాసాల పాటు నామ్ రోడ్డుపై చెరుకు అమ్మకాలు బాగుంటాయని వారు తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, రాష్ట్రాలకు చెందిన వారు కొనుగోలు చేసి తీసుకెళుతున్నట్టు చెప్పారు. నామ్ రోడ్డుపై సుమారు పది మంది వరకు చెరుకును అమ్మకాలు చేస్తున్నారు. మే నెల వరకు చెరుకు అమ్మకాలు చేస్తామని వ్యాపారులు తెలిపారు.

చిన్నారులకు పోలియో చుక్కలు

కొండపి, మార్చి 3 : మండలంలోని 36పోలింగ్ కేంద్రాలలో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మండల కార్యాలయాల సముదాయంలోని కేంద్రంలో చిన్నారులకు పెట్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు అనూష, ఎంపీడీవో నాగమణి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మొత్తం 3,748 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

జరుగుమల్లి.. మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులు 2676 మంది ఉండగా, 2547 మందికి పోలియో చుక్కలు వేశామని వైద్య సిబ్బంది తెలిపారు. మిగతా వారికి కూడా సోమ, మంగళవారాల్లో చుక్కలు వేసి వందశాతం పూర్తి చేస్తామన్నారు.



కొండపిలో పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ అనూష



మర్రిపూడిలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి వీరబాబు

మర్రిపూడిలో 2,066 మందికి..

మర్రిపూడి : మర్రిపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఐదేళ్లలోపు 2163 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 2066 మందికి చుక్కలు వేశారు. ప్రాథమిక పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాలలో, బహిరంగా ప్రదేశాలలో ప్రత్యేక పోలీయో కేంద్రాలను ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు వీరబాబు, విద్యాసాగర్‌లు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో కూచిపూడి సర్పంచ్ మాచేపల్లి హనుమంతరావు, సీహెచ్‌వో నాగేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ రమాదేవి, ఏఎన్ఎం పుణ్యవతి, ఆశా కార్యకర్త శైలజ, రజిత, అంగన్‌వాడి కార్యకర్తలు కెజియా, కేపీ హైమావతి, సుదేష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సింగరాయకొండ, మార్చి 3 : నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన 27 మంది లబ్ధిదారులకు స్థానిక వైసీపీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.27.23 లక్షల చెక్కులను ఆదివారం మంత్రి ఆదిమూలపు సురేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి తాను ఇన్‌చార్జిగా వచ్చిన రెండు నెలల్లో మూడు విడతల్లో అనారోగ్యం బారినపడిన 68 మంది బాధితులకు రూ.84 లక్షలు సీఎం సహాయ నిధిని అందజేశామన్నారు. ఈ ఐదేళ్లలో బాధితులు దారఖాస్తు చేసుకొని పెండింగ్‌లో ఉన్న వాటికి కూడా మంజూరు చేయించానని చెప్పారు. వైసీపీ నాయకులు మాట్లాడుతూ గతంలో వైసీపీ తరఫున నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా పనిచేసిన వ్యక్తులు సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను పట్టించుకోలేదన్నారు. ఒక్కదానికి కూడా మంజూరు చేయించలేకపోయారని చెప్పారు. మంత్రి ఇప్పటికే నియోజకవర్గంలోని పాస్టర్లు, విలేకర్లు, వలంటీర్లు, విద్యార్థులకు తాయిలాలు అందజేయగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కూడా ఓట్ల తాయిలాలలోని భాగమేనని ప్రజల్లో చర్చ నడుస్తోంది.

పొగాకు బ్యారన్ దగ్ధం

కొండపి, మార్చి 3 : మండలంలోని నెన్నూరుపాడు గ్రామంలో క్యూరింగ్‌లో ఉన్న రైతు మారెడ్డి పిచ్చిరెడ్డికి చెందిన బ్యారన్ ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదానికి గురైంది. బ్యారన్‌లోని పొగాకు కర్ర జారి మొద్దుగొట్టంపై పడడంతో ఈ ప్రమాదం సంభవించిందని బాధిత రైతు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న కొండపి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది. ఈ ప్రమాదంలో దాదాపు 4 లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయారు.

టీడీపీలోకి వలసల జోరు

● ఎరిక్షన్‌బాబు, ముత్తుముల సమక్షంలో చేరికలు ● ఆ పార్టీ మేనిఫెస్టోపై ఇన్‌చార్జుల ప్రచారం



ఎరిక్షన్‌బాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న మురారిపల్లి నేత లక్ష్మిరెడ్డి

ఎర్రగొండపాలెం, మార్చి 3 : టీడీపీలోకి చేరేందుకు వైసీపీ నాయకులు వరసలు కడుతున్నారు. మండలంలోని మురారిపల్లె వైసీపీ నాయకుడు బాశం లక్ష్మిరెడ్డి ఆదివారం తన అనుచరులతో టీడీపీలో చేరారు. ఆ పార్టీ ఎర్రగొండపాలెం అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్నట్లు తెలిపారు. అయితే అధికారంలో ఉన్నప్పుడు కూడా గ్రామంలో ఒక్కరోడ్డు వేయలేకపోవడంతో మనస్తాపం చెందినట్లు తెలిపారు. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచిగా పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ, గ్రామంలో కీలకంగానే ఉన్నట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టో పేదప్రజలకు ఉపయోగపడే విధంగా ఉందని, చంద్రబాబు విధానాలకు ఆకర్షితుడనై టీడీపీలో చేరినట్లు తెలిపారు. మురారిపల్లె గ్రామంలో త్వరలో వేదిక ఏర్పాటు చేసి తమ అనుచరవర్గ కుటుంబాలను టీడీపీలో చేరతాయన్నారు. ఎరిక్షన్‌బాబు విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ రైతు అధ్యక్షుడు చిట్యాల వెంగలరెడ్డి, ఇటీవల టీడీపీలో చేరారు. టీడీపీ నాయకుడు ఒంగోలు ఆదిరెడ్డి, మురారిపల్లె టీడీపీ నాయకులు మారం నారాయణ రెడ్డి, బొడ్డు చిన్న అంజిరెడ్డి, కైపు వెంకటరెడ్డి, పేరం రమణారెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : వైసీపీ మునిగిపోయే పడవ అని టీడీపీ ఎర్రగొండపాలెం అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. దాని నుంచి కేడర్ బయటకు రావాలన్నారు. టీడీపీతో కలిసి అభివృద్ధి వైపు పయనిద్దామని పిలుపునిచ్చారు. మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు 2వ వార్డు సభ్యులు కొత్తపల్లి ప్రకాశం ఆధ్వర్యంలో పది కుటుంబాలు గూడూరి ఎరిక్షన్ బాబు సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ విధానాలు నచ్చక, టీడీపీతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని భావించి పార్టీలో చేరామన్నారు. అనంతరం గూడూరి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి రాకముందు చెప్పిన హామీలు అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కిందన్నారు. ప్రజల తలపై అప్పుల భారం మోపారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చినవెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ఏడాదికి ఉచితం మూడు సిలెండర్ల అందజేత, కుటుంబంలో ఎంతమంది ఆడబిడ్డలున్నా ప్రతి ఒక్కరికి నెలకు రూ.1,500లు, ఏటా రూ.15,000లు మంజూరు చేసి ఆర్థిక తోడ్పాటు నివ్వనున్నట్లు తెలిపారు. వెలుగొండ పూర్తి చేసి ఈ ప్రాంతం సస్యశ్యామలం చేస్తామన్నారు. మర్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామన్నారు. తాను నియోజకవర్గం అభివృద్ధికి శక్తివంచన లేకుండా శ్రమిస్తానని ఆదరించాలని అన్నారు. సైకిలు గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఏర్వ మల్లికార్జునరెడ్డి, నాయకులు షేక్ మంజూర్ భాష, చల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బేస్తవారపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న గాజుల విశ్వనాథం

బేస్తవారపేట : రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని బేస్తవారపేట మాజీ సర్పంచ్ గాజుల విశ్వనాథం అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటి కార్యక్రమంలో భాగంగా బేస్తవారపేటలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు కలసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. వైసీపీ పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రజలకు మం చి జరగాలంటే టీడీపీని గెలిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో గాజుల విశ్వనాథం దూదెకుల సైదులు, ముప్పూరి రాము, దూదెకుల ఆదాం, సందు రమేష్ పాల్గొన్నారు.



పోతలపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న రోహిత్‌రెడ్డి

తర్లుపాడు : బడుగు, బలహీన వర్గాలకు అండగా టీడీపీ ఉంటుందని టీడీపీ యువనాయకులు కందుల రోహిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోతలపాడులో 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ అరాచకలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కందుల రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడితోనే సాధ్యమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటిస్తారని హామీ ఇచ్చారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాలు, అవినీతిని ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతిఒక్కరూ శాయశక్తుల కృషిచేయాలని కోరారు. మార్కాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఉడుముల చిన్నపురెడ్డి, మాజీ ఎంపీపీ పులివేముల ఏసుదాసు, నాయకులు రామిరెడ్డి, నంబుల లక్ష్మయ్య, గోపినాథ్ చౌదరి, కాశీం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో మైనారిటీ కుటుంబాలు చేరిక

గిద్దలూరు టౌన్ : కంభం పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన 20 మైనారిటీ కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీ గెలుపు కోసం కృషి చేస్తామని పార్టీలో చేరిన షేక్ ఖాజామొహిద్దీన్, షేక్ మున్నా, షేక్ బాబు, షేక్ షంషీర్, షేక్ ఖాదర్‌బాషా, షేక్ కరీముల్లా, షేక్ ముస్తఫా, షేక్ ఖాజాపీరా, షేక్ నాయబ్‌రసూల్, షేక్ బాబు, షేక్ అబ్దుల్ సత్తార్, షేక్ ఫయాజ్ ఉండగా కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తోట శ్రీనివాసులు, ప్రధానకార్యదర్శి ఆరేపల్లి మల్లికార్జున, నూరుల్లాఖాద్రి, జిలాని, గుర్రం రాజు, మురళి, శేఖర్ ఉన్నారు.

అవీ..ఇవీ..

కరాటేతో ఆత్మరక్షణ



కరాటేలో బహుమతులు పొందిన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 2: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు అందె నాసరయ్య అన్నారు. స్థానిక ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులు పాల్గొనగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కరాటే పాఠశాల చీఫ్ ఎగ్జామినర్ శ్రీనివాసరెడ్డి, తోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గణితంతో మేధస్సు పెంపు



గణితంలో ప్రతిభ చూపిన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 3: విద్యార్థులలో గణితం ద్వారా మేధస్సు మరింత పెంపొందుతుందని జీఎంఆర్ పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జునరెడ్డి అన్నారు. స్థానిక జీఎంఆర్ పాఠశాలలో విశ్వాస్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అబాకస్, వేదిక్‌మేథ్స్ జిల్లాస్థాయి పోటీలు ఆదివారం నిర్వహిం చారు. పట్టణంలోని 20 ప్రైవేట్ పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. గణితం ద్వారా విద్యార్థులకు ఏకాగ్రత, సృజనాత్మకత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని మల్లి కార్జునరెడ్డి అన్నారు. విశ్వాస్ సొసైటీ ప్రతినిధులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



మృతిచెందిన వివాహిత

గిద్దలూరు టౌన్, మార్చి 3 : కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. అందిన సమాచారం మేరకు మండలంలోని తిమ్మాపురం గ్రామపరిధిలో నంద్యాల లక్ష్మీదేవి(28), ఆదినారాయణలకు 10 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం ఇంటిలో భార్యాభర్తలిరువురు గొడవపడగా భర్త మందలించాడన్న కోపంతో ఇంటిలో ఉన్న పురుగుమందు గుళికలను మింగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబసభ్యులు వెంటనే గిద్దలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యం వికటించి మృతిచెందినట్లు బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగినట్లు తెలిసింది. సంబంధిత ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు వచ్చి వారికి సర్దిచెప్పి పంపినట్లు సమాచారం.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, మార్చి 3: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని వేములకోట గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన బొప్పరాజు కాశయ్య (50) ఎనామిల్లు పలకల కార్మికుడు. వేములకోట సమీపంలోని గుండ్లకమ్మ నదిలోని గుంతలోకి చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు ఆ గుంతలో పడి ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఒక్కడే చేపల వేట కోసం వెళ్లడంతో ఎవరూ గుర్తించలేదు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో గొర్రెల కాపరులు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో బంధువులు గుండ్లకమ్మకు చేరుకొని మృతదేహన్ని వేములకోటలోని మృతిని స్వగృహానికి తీసుకొని వెళ్లారు. కాశయ్యకు భార్య భూదేవి, కుమారుడు ప్రశాంత్ ఉన్నాడు.

ఆస్తులు భద్రంగా ఉండాలంటే అవకాశం ఇవ్వండి



ప్రజలకు అభివాదం చేస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 3: 'అందరం బాగుండాలి, గ్రామాలు ప్రశాంతంగా ఉండాలి.. పట్టణం ప్రశాంతంగా ఉండాలి.. ఆస్తులన్ని ఎవరికి వారికి జాగ్రత్తగా ఉండాలి. ఇవ్వన్ని ఉండాలంటే నాకు ఒక్క అవకాశం ఇవ్వండి' అని మార్కాపురం వైసీపీ ఇన్‌చార్జ్ గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. పట్టణంలోని 13వ వార్డులో ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. అందరం బాగుండాలి.. అందులో నేను ఒకడిగా ఉండాలి. మీరు నాకు ఒక్క అవకాశం ఇవ్వండి. రానున్న ఐదేళ్లలో మీకు కుటుంబ సభ్యుడిగా ఉంటూ సేవలు చేస్తా. నెత్తిన స్వారీ చేయను అన్నారు. 'సేవ చేసేవారు కావాలా.. నెత్తిన స్వారీ చేసే వారు కావాలా' అని ప్రశ్నించారు. పట్టణం, గ్రామాలు ప్రశాంతంగా ఉండాలి. ఆస్తులన్ని ఎవరికి వారివి జాగ్రత్తగా ఉండాలంటే నాకు అవకాశం ఇవ్వాలని నర్మగర్భంగా చేసిన వ్యాఖ్యలు పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి. మార్కాపురం ఎమ్మెల్యేగా ఉన్నవారిపై ఈ వ్యాఖ్యలు చేశారా అంటూ ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

చెంచుల కడుపుకొడుతున్న ప్రభుత్వం



ఉపాధి పనులు చేస్తున్న చెంచు గిరిజనులు

పెద్ద దోర్నాల, మార్చి 3: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వాలు అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను రద్దు చేసింది. ఈ క్రమంలో చెంచు గిరిజనుల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాల్లోనూ కోత పెట్టింది. దీంతో చెంచులు భారీగా నష్టపోతున్నారు.

ప్రధానంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పలు మార్పులు చేయడం ద్వారా అధిక సొమ్మును కోల్పోయారు. గత ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకంలో చెంచు గిరిజనులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. కుటుంబంలోని ప్రతి సభ్యునికి ఏడాదికి 180 రోజులు పని కల్పించింది. అంతే గాక రక్తహీనతను దృష్టిలో పెట్టుకుని వారికి ముందుగానే యాభై శాతం సొమ్మును అడ్వాన్సు గా అందజేసేవారు. ఉపాధి పని జరిగిన తర్వాత మిగిలిన సొమ్ము చేతికిచ్చేవారు. ఇంకో ముఖ్యమైన అంశం ఏమిటంటే వేసవిలో 70 శాతం పనిచేస్తే 30 శాతం అలవెన్స్ అదనంగా ఇచ్చేవారు. పైగా గ్రామ సంఘం ద్వారా బ్యాంకుల్లో డ్రా చేసి గ్రామంలోనే ఎవరి సొమ్ము వారికి అందజేసే వారు. దీంతో ఆ కూలీ డబ్బు మహిళలు కుటుంబ అవసరాలకు వినియోగించే వారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారికి ప్రోత్సాహకాలు మెరుగు పరచకబోగా, గత ప్రభుత్వానికి భిన్నంగా ఉపాధి పనుల్లో కోత విధించింది. దీంతో చెంచు గిరిజనులు తీవ్రంగా నష్ట పోయారు. ప్రస్తుతం ఏడాదికి ప్రతి కుటుంబా నికి 150రోజులు మాత్రమే ఉపాధి పనులు కల్పిస్తున్నారు. ఈ ప్రకారం కుటుంబంలో ముగ్గురు సభ్యులున్నారనుకుంటే గతంలో 540 పని దినాలు ఉండేవి. ఇప్పుడు ముగ్గిరికి కలిపి 150 దినాలు అంటే ఒక్కొక్కరికి 50 పని దినాలు మాత్రమే ఉంటున్నాయి. ఆ ప్రకారం ఒక్కో గిరిజనుడు ఏడాదికి 430 పని దినాలు కోల్పోతున్నాడు. అంటే రోజుకు రూ.272ల చొప్పున రూ.1,16,960లు నష్టపోతు న్నాడు. ఈ నాలుగేళ్ల సమయంలో లక్షల్లో నష్టపోయారు. ఇక వీరికి ఎలాంటి అడ్వాన్సులు ఇవ్వడం లేదు. వేసవి అలవెన్స్ లేదు. పైగా బ్యాంకుల్లో కూలీ డబ్బులు డ్రా చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మహిళలు చార్జీల రూపంలో కొంతసొమ్ము, తోడుగా భర్త లేదా కొడుకుతో వెంట రావాల్సి ఉంది. అధిక శాతం మంది వచ్చి న సొమ్ములో కొంత దురలవాట్లకు ఖర్చు చేయా ల్సి వస్తోంది. అసలే ఈ ఏడాది వర్షాభావంతో వ్యవసాయ పనులు లేవు. అటవీ ఫల సేకరణ చేద్దామంటే ఉత్పత్తులు లేవు. పనులు లేక, ప్రభుత్వ ప్రోత్సాహం లేక జీవనోపాధులు కరువై కుటుంబ పోషణ భారంగా మారిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ

దొనకొండ, మార్చి 3 : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని వైసీపీ పూర్తిగా విస్మరించిందని సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య విమర్శించారు. వివేకానంద పాఠశాల ఆవరణలో పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని సీపీఎం దర్శి నియోజకవర్గ కార్యదర్శి టీ రంగారావు నేతృత్వంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని, వారి సమస్యలపై పోరాటాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పెయింటింగ్ వర్కర్స్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా షేక్ కరిముల్లా, ప్రధాన కార్యదర్శిగా తప్పెట్ల శేషరావు, కోశాధికారులుగా కాటే బాలాజీ, షేక్ షకీల్, సహయ కార్యదర్శిగా బిల్లా లింగయ్య, మరికొందరు సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. పెయింటర్ల సమస్యల పరిష్కారానికి తమవంతు బాధ్యతగా కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపారు. కార్యక్రమంలో పెయింటర్లు ఏ పాపారావు, అంబడిపూడి వెలుగొండయ్య, నాసర్, రమేష్, ముక్తర్‌ఖాన్ బిల్లా సాయి, రెహమాన్ కోటి, చెన్నయ్య మరికొందరు పెయింటర్లు పాల్గొన్నారు.

టీడీపీ వర్గీయులపై దాడి

● స్థలం వివాదంలో ఈసలగుండం గ్రామంలో ఘటన

కొనకనమిట్ల, మార్చి 3 : ఓ స్థల వివాదంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడి చేశారు. దీంతో ఈ ఘటన మండలంలోని ఈసలగుండం గ్రామంలో ఆదివారం చోటుచేసుకొంది.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఓ ఇంటి ముందు ఉన్న కాలువ విషయమై టీడీపీ నాయకులపై వైసీపీ నాయకులు దాడి చేశారరు. దీంతో ఆ పార్టీకి చెందిన బొజ్జా ఫిలిప్, ఆయన తమ్ముడు బొజ్జా ఎసయ్యలుపై వైసీపీకి చెందిన చంద్రమోహన్, ప్రదీప్, పవన్, రాజమ్మలు దాడి చేశారు. దీంతో బొజ్జా ఎసయ్య చేతికి, రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. ఆదేవిధంగా వైసీపీకి చెందిన చంద్రమోహన్‌కు తలకు బలమైన గాయమైంది. ఘర్షణపై వివరాలు సేకరించి ఇరువర్గాలపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. టీడీపీ ఇన్‌చార్జి నారాయణరెడ్డి పొదిలి ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి బాధితులను పరామర్శించారు.

రెండు గడ్డివాములు దగ్ధం

ముండ్లమూరు, మార్చి 3 : మండలంలోని పులిపాడు పంచాయతీ పరిధిలోని బృందావన ఎస్సీ కాలనీకి చెందిన దాసరి రమేష్, గూడూరి ఆశీర్వాదంకు చెందిన రెండు ఎకరాల వరి గడ్డి వాములు ప్రమాద వశాత్తు ఆదివారం రాత్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఒక్కసారిగా రెండు వరి గడ్డి వాములకు మంటలు అంటుకోవడంతో కాలనీవాసులు హుటాహుటీన అక్కడకు వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేసేలోపే గడ్డి బూడిదయింది. రూ.40వేలు నష్టపోయామని బాధితులు వాపోతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. మంటలను ఆర్పేందుకు సమీపంలోని అగ్నిమాపక దళం వచ్చి అదుపు చేసే లోపే ఆహుతైంది.

పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 3: మార్కాపురం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న బాలిక అస్వస్థతకు గురైంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక జగదీశ్వరీ థియేటర్ సమీపంలో నివాసం ఉండే బాలయ్య, గురవమ్మల కుమార్తె స్థానిక ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. శనివారం పాఠశాలకు వెళ్లిన విద్యార్థిని నిద్ర పోయింది. ఈలోపు ఎవరూ గమనించ లేదు. దీంతో పాఠశాల సిబ్బంది తరగతికి తాళం వేసి వెళ్లిపోయారు. అనంతరం నిద్రలేచిన బాలిక తీవ్ర భయభ్రాంతులకు గురైంది. కేకలు వేస్తుండటంతో స్టడీ అవర్స్‌కు వచ్చిన మరో బాలిక గమనించింది. దీంతో తలుపులు తీసి బాలికను బయటకు తెచ్చారు. అయితే భయాందోళనకు గురైన బాలిక జ్వరం బారిన పడింది. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే తమ బాలిక అస్వస్థతకు గురైందని విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు.

పల్స్ పోలియో విజయవంతం



కంభంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 3: పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి అన్నారు. పల్స్‌పోలియో సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో 40 కేంద్రాల ద్వారా పోలియో చుక్కలు వేశామని 7630 మందికి చుక్కలు వేయించాలని లక్ష్యం గా పెట్టుకోగా 7309మందికి వేశామన్నారు. 96 శాతం పల్స్ పోలియో నిర్వహించామని, సోమ, మంగళవారాలు కూడా చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.

ఎర్రగొండపాలెం : మండలంలో మొదటి విడత 5463 మంది చిన్న పిల్లలను గుర్తించామని తెలిపారు. మండలంలో 44 పల్స్‌పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి 5233 మందికి చుక్కలు వేసినట్లు వెంకటాద్రిపాలెం పీహెచ్‌సీ వైద్యుడు కోటా నాయక్ తెలిపారు. పాలుట్ల డాక్టరు పి చంద్రశేఖర్ పోలియో కేంద్రాలను తనిఖీ చేశారు. హెచ్ ఈసీ పి.వెంకటేశ్వర్లు, టీడీపీ సోషల్‌మీడియా వర్కరు షేక్ అజారుద్దీన్, ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కంభం : పోలియోను అరికట్టేందుకు ప్రజలందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని కంభం ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ తెలిపారు. ఆదివారం కంభం సచివాలయం-1లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. పల్స్‌పోలియో కార్యక్రమం కంభం రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ వైద్యశాల, కందులాపురం పంచాయతీ, కంభం పంచాయతీల పరిధిలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మస్తాన్‌వలి, సర్పంచ్ బోడయ్య, డాక్టర్ అత్తర్ నాయబ్‌రసూల్, పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

దొనకొండ : పోలియో రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి సూ చించారు. దొనకొండలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రంలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం డాక్టర్ కే సునీత, సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి, దేవానంద్, కార్యదర్శి పోటు కృష్ణమూర్తి, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అంగన్వాడీలు, ఆశా, వలంటీర్లు సేవలందించారు.

ముండ్లమూరు : ముండ్లమూరు, మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో చిన్నారుల కు పల్స్ పోలియో చుక్కలు ఆదివారం వేసినట్టు వైద్యాధికారులు జే వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ జాస్మిన్, మధుశంకర్, ప్రవీణ్ కుమార్ తెలిపారు. రెండు పీహెచ్‌సీల పరిధిలో 98.9 శాతం చుక్కలు వేసినట్టు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అంగన్ వాడీ టీచర్లు, ఆషా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు. పామూరు, పీసీపల్లి మండలాల్లోనూ పోలియో చుక్కలు వేశారు.

గిద్దలూరు : మండలంలోని 88 కేంద్రాల ద్వారా చిన్నారులకు చుక్కలను వేసినట్లు సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమయ తెలిపారు. పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో వైసీపీ ఇన్‌చార్జి, మార్కాపురం ఎమ్మెల్యే కె.నాగార్జునరెడ్డి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ భార్గవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు : పోలియో రహిత సమాజాన్ని స్థాపిద్దామని వైద్యాధికారి హరీష్ అన్నారు. మండలంలో 33 బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ ఖచ్చితంగా పోలియో చుక్కలు వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వో తులసీ ప్రసాద్ పాల్గొన్నారు.

త్రిపురాంతకం : ఆదివారం పోలియో కార్యక్రమంలో భాగంగా త్రిపురాంతకం మండలంలో 95 శాతం నమోదు అయినట్లు వైద్యులు తెలిపారు. మరో రెండు రోజుల పాటు ఇళ్ల వద్దకు వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. పోలియో చుక్కలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు బీఎంసీ ప్రథమ వర్ధంతి



పామూరు, మార్చి 3 : టీడీపీ సీనియర్ నాయకుడు, జడ్పీటీసీ సభ్యులు, శ్రీ మహాలక్ష్మి మిల్క్ ప్రొడెక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ బొల్లా మాల్యాద్రిచౌదరి ప్రథమ వర్ధంతి కార్యక్రమాలను స్థానిక మహాలక్ష్మి పాల డెయిరీలో సోమవారం నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొల్లా మహాలక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాలకు కనిగిరి, ఉదయగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, కాకర్ల సురేష్, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయ రామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు టీడీపీ మాజీ ప్రజాప్రతినిధులు ముఖ్యులుగా పాల్గొంటున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, బీఎంసీ అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శివరాత్రి వేడుకలకు ఆహ్వానం

పామూరు, మార్చి 3 : సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రాలైన భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానాల్లో మహా శివరాత్రి వేడుకల ఆహ్వాన పత్రికను దేవస్థాన ఛైర్మన్ కొమ్మినేని ఆదినారాయణ, ఈవో నరసింహబాబు సీఐ ఎం.రామానాయక్, సీఎస్‌పురం ఎస్‌ఐ డీ ప్రేమ్‌కుమార్‌కు ఆదివారం అందజేశారు. వేడుకల విజయవంతానికి బందోబస్తును ఏర్పాటు చేయాలని వారు సీఐని కోరారు. అనంతరం సీఐ, ఎస్‌ఐలను సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు.

అభివృద్ధి కోసం నన్ను గెలిపించండి

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర
- కొత్తూరు, బల్లిపల్లి, గుడిపాడులో వైసీపీని వీడిన కుటుంబాలు
- వారితోపాటు పార్టీలో చేరిన వలంటీర్లు



డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన గుడిపాడుకు చెందిన వైసీపీ మద్దతుదారులు

కనిగిరి, మార్చి 3 : కనిగిరి ప్రాంత అభి వృద్ధి కోసం నన్ను గెలిపించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ప్రజలకు సూచించారు. 7వ వార్డు కొత్తూరులో వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో 26 కుటుంబాలతో పాటు, ఇద్దరు వలంటీర్లు టీడీపీలో ఆదివారం చేరారు. వారికి ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొత్తూరు పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉగ్ర మాట్లాడుతూ వైసీపీ పాలనలో కనిగిరి ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తనకు అవకాశం ఇస్తే అభివృద్ధితో పాటు పేదల సమస్యల పరిష్కారానికి నిరంతరాయంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్లుగా మీ వెంటే ఉంటూ తనకు చేతనైనంత సాయం చేస్తున్నాని గుర్తు చేశారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో నాశనమైందని, ఉద్యోగులు, కార్మికులు, ప్రజలందరూ ఇబ్బందులకు గురవుతున్నారని ఉగ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అన్నీ చక్కబడాలంటే చంద్రబాబును అందరం ముఖ్యమంత్రిని చేయాలన్నారు. భవిష్యత్ తరాల కోసం టీడీపీకి పట్టంగట్టాలని విజ్ఞప్తి చేశారు. కనిగిరి మున్సిపాల్టీగా మారితే అన్ని వసతులతో పాటు నగరాభివృద్ధి జరుగుతుందన్నారు. కనీసం నగర ప్రజలకు తాగునీరు కూడా వైసీపీ ఎమ్మెల్యే ఇవ్వలేకపోయారన్నారు. కనిగిరి ప్రాంతంలోనే పుట్టానని ఈ ప్రాంతం అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. సొంత చెల్లిని, అమ్మను పట్టించుకోని వారు రాష్ట్ర మహిళలకు న్యాయం ఎలా చేస్తారని ప్రశ్నించారు. బాబాయి చావుకు కారణమై, అతని కుమార్తెకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో అడ్డదారిలో తిరిగి అధికారంలోకి వచ్చేందుకు అనేక వ్యూహాలు పన్నుతున్నారని, రోజులు దగ్గరపడడంతో ప్రజలపై వరాలు కురిపిస్తూ ప్రేమను ఒలగపోస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి అబద్ధపు మాటలు, మడమతిప్పే హాలను ప్రజలు మళ్లీ నమ్మి మోసపోవద్దని ఉగ్ర హితవు చెప్పారు. విజ్ఞతతో ఆలోచించి, అభివృద్ధిని కాంక్షించేవారిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎన్నికలు పూర్తయ్యే వరకూ రోజూ అప్రమత్తంగా ఉంటూ తన విజయానికి కృషి చేయాలని ఉగ్ర విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో తమ్మినేని రవీంద్రరెడ్డి, వెంకటరెడ్డి (వలంటీర్లు), దశరదరామిరెడ్డి, గోపిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, శివరామిరెడ్డి, సుధాకర్ రెడ్డి, బ్రహ్మారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రమణారెడ్డిలతో పాటు మరో 20 కుటుంబాలు వారు ఉన్నారు.

అలాగే కనిగిరి మండలం బల్లిపల్లిలో 48, గుడిపాడులో 64 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర సమక్షంలో సైకిల్ ఎక్కారు. వారికి కండువాలు కప్పి ఉగ్ర స్వాగతం పలికారు. అందరూ కలిసి పనిచేయాలని సూచించారు.



వైసీపీని వీడి పార్టీలో చేరిన వారితో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు

ఉగ్ర సమక్షంలో వైసీపీ సర్పంచ్, ఆరుగురు వార్డు సభ్యులతో సహా 65 కుటుంబాలు చేరిక

వెలిగండ్ల, మార్చి 3 : వెలిగండ్ల మండలంలో వైసీపీ పార్టీకి భారీ షాక్ తగిలింది. మండలంలోని రామగోపాలపురం పంచాయతీ సర్పంచ్ బొబ్బా రమణారెడ్డి, ఆరుగురు వార్డు మెంబర్లతో సహా గ్రామానికి వైసీపీ మద్దతుదారులు 65 కుటుంబాలు గుడ్‌బై చెప్పారు. వారంతా ఆదివారం టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర సమక్షంలో సైకిల్ ఎక్కారు. పార్టీ కండువాలు వేసి వారిని ఉగ్ర ఆహ్వానించారు. నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీలోకి వలసలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఇది వైసీపీ పతకానికి నాంది అని ఉగ్ర అన్నారు. కొత్తగా చేరినవారిని కలుపుకొని కష్టపడి పనిచేసి తనను గెలిపించాలని కోరారు. గెలవగానే రామగోపాలపురం పంచాయతీలో నిరుపేదలకు భూముని అందజేస్తామని హామీ ఇచ్చారు. జగన్‌రెడ్డిని నమ్ముకొని సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు అప్పులపాలయ్యారన్నారు. ప్రజలకు ఎలాంటి సేవ చేయలేని దుస్థితిలో ఆవేదనకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గువదకట్ల హరి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు మౌలాలీ, జిల్లా ఎస్సీసెల్ అధికారప్రతినిధి సలోమన్ రాజు, ఎంపీటీసీ సభ్యుడు చిలకల వెంకటేశ్వరెడ్డి, కొండు భాస్కర్‌రెడ్డి కర్నాటి భాస్కర్ రెడ్డి, మీనిగ కాశయ్య, కారంపూడి వెంటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మెటాటి సుబ్బరెడ్డి, ఓబోలు శ్రీను, కేసరి రమణారెడ్డి, రావి అంబయ్య చౌదరి, బొబ్బా నాగభూపాల్ రెడ్డి, బొబ్బా రమణారెడ్డి, గంజి రాజశేఖర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతరం డాక్టర్ ఉగ్ర నియోజకవర్గ టీడీపీ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్యామల కాశిరెడ్డి సహకారంతో బ్యాంక్ ఆవరణంలో శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.

జయహో బీసీ సదస్సుకు తరలిరండి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

దర్శి, మార్చి 3 : రాష్ట్ర స్థాయి జయహో బీసీ సదస్సుకు తరలిరావాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు కోరారు. దర్శిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళగిరి వద్ద నాగార్జున యూనివర్సిటీ సమీపంలో ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం జరిగే టీడీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బీసీ సదస్సులో ముఖ్య అతిథిలుగా టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కే అచ్చెన్నాయుడు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. దర్శి నియోజకవర్గం నుంచి, జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో బీసీ సోదరులు, టీడీ పీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ వైష్ణవ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు టీ లక్ష్మీనారాయణబాబు, టీడీపీ రజక సాధికారిక కమిటీ కన్వీనర్ పూరిమిట్ల యల్లయ్య, జిల్లా మీడియా కోఆర్డినేటర్ పఠాన్‌సుభానీ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

దర్శి, మార్చి 3 : ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. శ్రీకరం కల్యాణ మండపంలో ఆదివారం ఉద్యోగులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. అన్ని ఉద్యోగ కుటుంబాలలో కారుణ్య నియామకాలు చేస్తామన్నారు. ఉద్యోగులకు అన్ని విధాలుగా ప్రభుత్వం ద్వారా, తమ ట్రస్టు ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కె.రఘురామయ్య, రమాదేవి, జడ్పీ పాఠశాలల హెచ్‌ఎంలు ఖాదర్‌మస్తాన్, చంద్రమౌళి, ఏపీటీఎఫ్ నాయకులు వీ జనార్దన్‌రెడ్డి, డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకముందు నగర పంచాయతీలోని 8వ వార్డులో మన ఊరు మన శివన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్‌బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. తమకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం

పామూరు, మార్చి 3 : రాష్ట్ర అభివృద్ధి, పేదలకు సంక్షేమ ఫలాలు అందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ పట్టణ ఎన్నికల కమిటీ ఛైర్మన్, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ అన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, మండల అధ్యక్షుడు పువ్వాడి, ఆదేశాల మేరకు తూర్పువీధి, ఎన్జీవోకాలనీ, సుందరయ్యనగర్, విద్యుత్ సబ్‌స్టేషన్ కాలనీ తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మాయమాటలు, చేతగాని హామీలతో గద్దె నెక్కిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డిని చిత్తుగా ఓడించి రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్నారు. అమరావతి అభివృద్ధి, పేదల బతుకులు బాగుకోసం చంద్రబాబును ముఖ్యమంత్రిగా, ఈ ప్రాంత అభివృద్ధి కోసం డాక్టర్ ఉగ్రను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమాల్లో టీడీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ గౌస్‌బాషా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఇర్రి కోటిరెడ్డి, ముబీనామౌలాలి, దేవరపు మాల్యాద్రి, చిన హజరత్, మండ్ల రమణయ్య, పత్తుమస్తాన్, సయ్య ద్ ఖాదర్‌బాషా, మాచర్ల రహిమాన్, ఎం.రమాదేవి, గుత్తి మహి, షేక్ ఖాజా, మస్తాన్ పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న శ్రేణులు



పథకాలను వివరిస్తున్న నాయకులు


టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

పీసీపల్లి : నాడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగాయని, మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తేనే గ్రామాలు బాగుపడతాయని టీడీపీ నాయకులు ముద్దపాడు మాజీ సర్పంచ్ నల్లపనేని రత్తయ్య అన్నారు. మర్రికుంటపల్లిలో ఆదివారం సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ పథకాల కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టారు. జగన్‌రెడ్డి పాలనలో తాగునీరు కరువైందని, గ్రామాల్లో సీసీ రోడ్లు కూడా వేయలేని దుస్థితి నెలకుందన్నారు. ఉగ్రను ఎమ్మెల్యేగా, చంద్రబాబును సీఎంగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడు నెలకుర్తి మాల్యాద్రి, వీరపనేని నానిబాబు, ముప్పవరపు మాచర్ల, నల్లపనేని సుబ్బారావు, రామయ్య ఉన్నారు.

వైసీపీ పాలనలో నష్టపోయిన రైతులు


తాళ్లూరు, మార్చి 3 : వైసీపీ పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని టీడీపీ జిల్లా లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ తెలిపారు. ప్రతి పల్లెకు టీడీపీ ప్రజాయాత్ర కార్యక్రమాన్ని బొద్దికూరపాడు, చింతలపాలెం గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రైతులకు అండగా ఉంటామని మాటిచ్చిన జగన్‌రెడ్డి వారిని అన్ని విధాలా మోసం చేశారన్నారు. పంటల నష్టపరిహారం చెల్లించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. అప్పులు తీర్చేదారిలేక రైతులు అప్పుల ఊబిలో పడి ఆత్మహత్యలకు పాల్పడినా జగన్‌రెడ్డికి చలనం లేదన్నారు. కనీసం పంటలకు గిట్టుబాటు ధరను కూడా కల్పించడంలో వైసీపీ విఫలమైందన్నారు. చంద్రబాబు పాలనలో రైతుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, రాష్ట్రమంతా సస్యశ్యామలంగా ఉండాలన్న లక్ష్యంతో పోలవరం ప్రాజెక్టును 70శాతం నిర్మాణం పూర్తి చేస్తే జగన్‌రెడ్డి ప్రాజెక్టును పూర్తిచేయకుండా రైతు లోకానికి, ప్రజలకు తీరని ద్రోహం చేశారని సురేష్ ధ్వజమెత్తారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు లేళ్ల కోటేశ్వరరావు,సుబ్బారావు, నాగేశ్వరరావు, రామచంద్రయ్య, వెంకటేశ్వర్లు, హరిబాబు, హరీష్, వెంకట్రావు పాల్గొన్నారు.





- ఉద్యాన రైతులకు అందని ప్రభుత్వ ప్రోత్సాహం

రాయితీకి.. రాం..రాం



- కాలయాపనతోనే సరి
- ఏళ్లు గడుస్తున్నా దక్కని మోక్షం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.14 కోట్లు పెండింగ్
- మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారిపోతోన్న రైతులు

బాపట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల సంక్షేమమే మా ధ్యేయం.. మాది రైతుల ప్రభుత్వం.. అంటూ పాలకులు తరచూ ప్రకటించుకుంటారు. కానీ చేతల్లో మాత్రం అమలు చేయడంలేదు. రాయితీల విషయంలో ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మి సంప్రదాయ పద్ధతులను విడనాడి కొత్త రకం సాగు, పంటలు వైపు పెద్దసంఖ్యలో మళ్లారు. అయితే వారి మాటలు నమ్మి సంప్రదాయ పద్ధతులను విడనాడిన రైతులు తరచూ వంచనకు గురవుతున్నారు. ఈ కోవలోనే ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు నిలువునా మునిగిపోయారు. సంప్రదాయ పద్ధతులను విడనాడితే అందుకు కావాల్సిన ప్రోత్సాహకాలను అందిస్తుందని పాలకులు నమ్మబలికి మూడేళ్లు గడుస్తోంది. కానీ రైతులకు చెల్లించాల్సిన బకాయిలకు మాత్రం మోక్షం కలగడం లేదు. కార్యాలయాల చుట్టూ తిరిగి రైతులు వేసారిపోతున్నారు తప్పితే బకాయిల విషయంలో ప్రభుత్వం వైపు నుంచి చలనం కరువైంది. చెల్లించాల్సిన వాటి ఊసెత్తని ప్రభుత్వం కొత్త పథకాలు అంటూ ఊదరగొడుతూ ఉద్యాన రైతులను మరోమారు వంచించే కార్యక్రమానికి పాలకులు తెరతీశారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని ఉద్యాన రైతులు తమకు చెల్లించాల్సిన రాయితీ సొమ్ము కోసం దాదాపు మూడేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారు. మాటలతో కాలక్షేపం చేస్తున్నారే తప్పితే పాలకులు రూపాయి విదిల్చకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. మూడు జిల్లాల్లో కలిపి దాదాపు రూ.14 కోట్ల వరకు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. ఇందులో ఒక్క బాపట్ల జిల్లా వాటానే దాదాపు రూ.6.50 కోట్లు వరకు ఉన్నట్లు తెలుస్తోంది. బకాయిలకు సంబంధించి త్వరలోనే విడుదల చేయడంతో పాటు ఉద్యాన రైతులకు అందించే ప్రోత్సాహకాల విషయంలో సరికొత్త పాలసీ తెస్తామని గతేడాది ప్రభుత్వ పెద్దలు చెప్పారు. ఆ బకాయిలకు మోక్షం లభించకపోగా కొత్త పాలసీ అంటూ ఉద్యాన రైతులను మభ్యపెట్టే కార్యక్రమానికి ప్రభుత్వం తెరతీయడం గమనార్హం. మిగిలిన పంటలతో పోలిస్తే ఉద్యాన సాగుకు కొంచెం పెట్టుబడి అదనంగా పెట్టాలి. మేలైన విత్త నాల కోసం షేడ్‌నెట్, పాలీహౌస్ వంటివి రైతులకు అవసరం. దీంతో ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందు బాటులోకి తెచ్చింది. వీటితో పాటు మల్చింగ్ షీట్లు కూడా అవసరం అవుతాయి. ఈ పరిస్థితుల్లో టీడీపీ హయాంలో రాయితీలను సకాలంలోనే అందించడంతో పెట్టుబడి భారం రైతులకు తెలిసేది కాదు. దీనితో ఏటికేడు ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం గతంలో పెరుగుతూ వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంతో మొత్తం పడకేసింది. గడచిన ఆర్థిక సంవత్సరంలో బాపట్ల జిల్లాకు రూ.25 కోట్లతో ప్రత్యేక రాయితీలు ఉద్యాన రైతులకు అందిస్తామని పాలకులు చెప్పిన మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి.

68,000 హెక్టార్లలో సాగు..

ఉద్యాన పంటల సాగు విషయానికొస్తే ఒక్క బాపట్ల జిల్లాలోనే 29,500 హెక్టార్ల వరకు సాగవుతుందనేది అంచనా. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అయితే ఈ సంఖ్య 68,000 హెక్టార్లుగా ఉంటుంది. ఈ మొత్తంలో 19,000 హెక్టార్ల వరకు మిరప సాగవుతుండగా మిగిలిన దానిలో అత్యధిక భాగం కూరగాయలు, పండ్ల తోటలు ఉన్నాయి. గడచిన టీడీపీ ప్రభుత్వంలో ఉద్యాన పంటల సాగుకు అందించే రాయితీలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాయితీ సొమ్మును సకాలంలో చెల్లించేవారు. దీంతో 2014–2019 మధ్య కాలంలో ఉద్యాన పంటల సాగు విషయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా భారీగా వృద్ధి నమోదైంది. ఇదే ఒరవడి కొనసాగి ఉంటే ఉద్యాన పంటల సాగు లక్ష హెక్టార్లకు చేరుకుని ఉండేది. అయితే ప్రభుత్వం శీతకన్ను వేయడంతో ఉద్యాన సాగు తిరోగమనం వైపు పయనిస్తోంది.

మ్యాచింగ్ గ్రాంటు విషయంలోనూ అంతే...

రైతులకు అందించే రాయితీల విషయంలో కేంద్రం వాటాకు రాష్ట్ర ప్రభుత్వం వాటా జమ చేయాలి. కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్రం 40 శాతం. అయితే కేంద్రం అందించే నిధులను వేరే అవసరాలకు దారి మళ్లించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కింది. ఇది గమనించిన కేంద్రం గతేడాది నుంచి ఆ రాయితీను ప్రత్యేక ఖాతాలకు జమ చేయడం ప్రారంభించింది. దీని మూలంగానే కొద్దిమేర చెల్లింపులు జరిగాయి. లేకుంటే ఈ బకాయిల మొత్తం మరింతగా ఉండేదని అన్నదాతలు చెబుతున్నారు.





రొయ్యల చెరువులో నీటిని శుద్ధి చేస్తున్న ఏరేటర్

రొయ్య ధర.. ఏదయా?

- వాతావరణ మార్పుతో రొయ్యకు వైరస్
- భారీగా తగ్గిన ధరలు
- మందులు సూచించే వారే లేరాయె?
- లబోదిబోమంటున్న రైతులు

రేపల్లె, మార్చి 3 : రొయ్య సాగు రైతులు కష్టాలకు ఎదురీదుతున్నారు. వాతావరణ మార్పుల కారణంగా వైరస్ సోకి పంట పండక దిగుబడి లేక తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి రేయింబవళ్ళు చెమటోడ్చి సాగు చేస్తే తీరా చేతికి వచ్చే సమయంలో దిగుబడి రాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గంలో రేపల్లె, నిజాంపట్నం మండలాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో వనామి, టైగర్ రొయ్యల సాగు చేస్తున్నారు. ఎకరాకు నాలుగు లక్షల రూపాయల పై చిలుకు ఖర్చు చేస్తున్నారు. ఇటీవల కాలంలో భారీ వర్షాలు కురవటంతో వాతావరణంలోని గాలిమార్పు కారణంగా చెరువుల్లోని రొయ్యలు వైరస్ సోకి మృతి చెందుతున్నాయి. ఎన్ని మందులు వాడినా ఫలితం కనపడటం లేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. వైట్ స్పాట్ వైరస్ సోకిందని రైతులు గుర్తించారు. సరైన మందులు వాడదామంటే పరిసర ప్రాంతాల్లో రొయ్యలసాగుపై సరైన వైద్యులు, హ్యాచరీలు లేవు. ఒంగోలు, భీమవరం, బాపట్ల, కాకినాడ, నెల్లూరు నుంచి వైద్యులను పిలిపించుకుని పంటను పరిశీలించి మందులు వాడినా మూడు టన్నులు అవ్వాల్సిన పంట ఒకటి నుంచి రెండు టన్నులు మాత్రమే దిగుబడి వస్తోంది. ఎన్నిసార్లు మత్స్యశాఖ అధికారులకు విన్నవించుకున్నా తమ గోడు పట్టించుకున్ననాథుడే లేరంటూ రైతులు విమర్శిస్తున్నారు.

విపరీతంగా తగ్గిన రొయ్యల ధరలు..

వనామి రొయ్యలు 30 కౌంట్ రూ.380, 40 రూ.300, 50 రూ.260, 60 రూ.240, 100 రూ.200, టైగర్ రొయ్యలు 20 కౌంట్ రూ.700, 30 రూ.490, 40 రూ.400 ధరలు పలుకుతున్నాయి. గతంలో వనామి రొయ్యలు 30 కౌంట్ రొయ్యల రూ.500 పై చిలుకు, టైగర్ 20 కౌంట్ రొయ్యలు రూ.900 నుంచి వెయ్యి రూపాయలు పలికేది. ఒక్కసారిగా 200పై చిలుకు తగ్గిపోయాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి రొయ్యలను కొనుగోలు చేసేవారు సిండికేట్‌గా ఏర్పడటంతో వారు చెప్పిన ధరలకే రొయ్యల అమ్మకాలు జరుగుతున్నాయి. పరిశోధన కేంద్రాలు లేకపోవడం, పంటను నిల్వ చేసుకునే వసతి లేకపోవటంతో పండించిన పంట తక్కువ ధరకైనా విక్రయించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం దృష్టిసారించి ఆక్వారైతుల సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని కోరుతున్నారు.



రొయ్యలను గ్రేడింగ్ చేస్తున్న ఆక్వా రైతులు

కుళాయి.. కష్టం

నత్తనడకన జల్‌జీవన్

- ఇంటింటికీ రక్షిత నీరు కరువు
- పల్లెల్లో తీరని తాగునీటి వెతలు
- నిధుల కొరతతో సాగని పనులు

నిధుల లేమి.. పనులు నత్తనడకతో జల్‌జీవన్ మిషన్ జాప్యం జరుగుతోంది. కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీటిని ప్రతిఒక్కరికీ అందించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం కష్టంగా మారింది. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైనా రాష్ట్ర ప్రభుత్వం వాటిని మంజూరు చేయడంలేదు. దీంతో జల్‌జీవన్ మిషన్ పనులు చాలాదగ్గర్ల ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రోజులు.. నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడంలేదు. నిధుల కొరత వెంటాడుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ప్రతిఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని సీఎం జగన్ ఆర్భాటంగా ప్రకటించినా క్షేత్ర స్థాయిలో అది అమలు కాలేదు. 2019లో ఈ పథకాన్ని అమలుల్లోకి తీసుకొచ్చినా ఇప్పటికీ పూర్తి స్థాయిలో పనులు జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జల్‌జీవన్ పథకం ఉమ్మడి గుంటూరు జిల్లాలో నత్తనడకన సాగుతుంది. 2024 మార్చి కల్లా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే లక్ష్యాల మేర పనులు జరుగుతున్న పరిస్థితులు కానరాడంలేదు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

స్వచ్ఛమైన.. సురక్షితమైన.. తాగునీటిని ప్రతి ఒక్కరికీ అందించాలి. ప్రధానంగా ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల ప్రజలు అనారోగ్యం భారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో తాగునీటి పథకాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి కుళాయిల ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను చేపట్టింది. దీంతో కేంద్ర ప్రభుత్వ లక్ష్యమైన కుళాయిల ద్వారా తాగునీరు అందివ్వడం కష్టంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేరి సగం నిధులతో జల్‌జీవన్ మిషన్ పనులు చేపట్టే విధంగా 2019లో ప్రణాళికను రూపొందించారు. ఇందుకు రూ.1021.38 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. కేంద్రం తన వాటా నిధులను విడుదల చేయగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేయలేదు. దీంతో జల్‌జీవన్ మిషన్ అమలులో జాప్యం జరుగుతోంది. జల్‌జీవన్ మిషన్‌లో ఇప్పటికే ఉన్న పథకాలను విస్తరించడం, పునరుద్ధరించడంతో పాటు, పైపులైన్లు, నీటి నిల్వ చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాలి. ఆర్‌డబ్ల్యూఎస్ అధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు. అయితే వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించ లేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 10,30,653 గృహాలకు ఇప్పటి వరకు 4,47,735 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. 43.44 శాతమే గృహాలకు కుళాయిలు ఉన్నాయి. ఇంకా 5,82,918 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. అనేక గ్రామాలలో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. కుళాయిలు కూడా నామమాత్రంగానే ఉన్నాయి. ఇలానే పనులు సాగితే నిర్ణీత కాలంలో పనులు పూర్తయ్యే పరిస్థితి అనుమానమే.



పెదతురకపాలెంలో ఓవర్ హెడ్ ట్యాంక్ దుస్థితి

చిట్టచివరన పల్నాడు జిల్లా

రక్షిత నీటి సరఫరాకు సంబంధించి పల్నాడు జిల్లాలో 33.03 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నాయి. గ్రామాలలో 4,32,148 గృహాలు ఉండగా పథకం ప్రారంభించే నాటికి 58,166 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం ప్రారంభించిన తర్వాత 84,570 కుళాయిలను ఇచ్చారు. 2,89,412 గృహాలకు ఇంకా కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. జల్‌జీవన్ మిషన్ అమలులో పల్నాడు జిల్లా చిట్టచివరన ఉంది. ఈ పథకం కింద జిల్లాలో 1055 పనులుగుర్తించి రూ.508.16 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. చేపట్టిన పనుల్లో 209 పనులు మాత్రమే పూర్తయ్యాయి. మూడో వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు.

చివరి నుంచి రెండో స్థానంలో బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలోని గ్రామాల్లో 3,64,788 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 72,292 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 75,622 గృహాలకు కొత్తగా కుళాయిలు ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,47,914 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఇంకా 2,16,874 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. కుళాయి కనెక్షన్లలో చివరి నుంచి రెండో స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టారు. రూ 205.22 కోట్లు వ్యయం అంచనాతో చేపట్టిన పనుల్లో 223 పనులు పూర్తయ్యాయి.



కోటప్పకొండలో తాగునీటి చెరువు

15వ స్థానంలో గుంటూరు జిల్లా

గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 1,24,676 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన తర్వాత 32,409 గృహాల కు కొత్తగా కుళాయిలు ఇచ్చారు. ఇప్పటి వర కు జిల్లాల్లో 1,57,085 గృహాలకు మాత్రమే కనెక్షన్లు ఉన్నాయి. ఇంకా 87,431 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. కుళాయి కనెక్షన్లలో రాష్ట్రంలో 15వ స్థానంలో ఉంది. జలజీవన్ మిషన్ పథకం కింద 308 పనులు చేపట్టగా 161 పనులు మాత్రమే పూర్తయ్యాయి.

నాసిరకం.. అవినీతి

గుంటూరు సిటీ: జల్‌జీవన్ మిషన్ లక్ష్యం ఇంటింటికి సురక్షితమైన తాగునీరు అందించడం.. అయితే ఆ నిధుల లేమితో పనులు అరకొరగా జరుగుతుండగా అందులోనూ అవినీతి నిండి పోయింది. పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. ఇప్పటికే జరిగిన పనులు.. అక్కడక్కడ జరుగుతున్న పనులు చూస్తే నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలకు ఏవిధంగా తిలోదకాలు ఇచ్చారో కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. జలజీవన్ మిషన్ గ్రామీణ నీటి పారుదలశాఖలోని కొందరి పాలిట వరప్రదాయిని గా మారిందన్న విమర్శలున్నాయి. జల్‌జీవన్ పనులకు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లాకు రూ.400 కోట్ల నిధులు కేంద్రం విడుదల చేయగా అందినకాడికి దండుకో అన్న రీతిలో కొందరు పంచేసుకుంటున్నా రన్న ఆరోపణలున్నాయి. ఫలితంగా ప్రారంభించిన 1264 పనులు లోపభూయిష్టంగా మారాయి. స్థాయిని బట్టి పర్సంటేజీ నిర్ణయించి మరీ పంపకాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గుంటూరులోని గ్రామీణ నీటి పారుదల శాఖ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఏసీబీ దాడులే ఇందుకు నిదర్శనంగా అర్థమవుతోంది. పెదకాకానికిలో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులకు సంబంధించి రూ.42 లక్షల పనులకు కాంట్రాక్టర్ నుంచి రూ.1.68 లక్షలు లంచం తీసుకుంటూ ఏఈ శివరామకృష్ణ ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఇలా పనుల మాటేమో కాని ఆ పేరుతో అధికారులు లంచాలు వసూలు చేస్తూ జల్‌జీవన్ మిషన్ నిధులను బొక్కేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నీటి పథకాలను విస్తరించి, పైపులైన్‌లు నిర్మించే పనుల్లో అధికారులు భారీగా డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు పూర్తిగా మామూళ్ల మత్తులో మునగడంతో కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు.

ముఖ్య నేత కనుసన్నల్లో పనులు..

జలజీవన్ మిషన్ పనులు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓ ముఖ్య నేత కనుసన్నల్లోనే ఎక్కువగా జరుగుతు న్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ ముఖ్య అధికారి పనులన్నీ ఒక వర్గానికి చెందేలా పావులు కదిపారని సమాచారం. వారి ప్రాబల్యంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పనులు నాణ్యతపై ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు.



పిడుగురాళ్లలో ఇసుక పోయకుండానే పైపులైన్ నిర్మిస్తున్న జలజీవన్ మిషన్ పనులు

సిద్ధమవుతున్న ప్రభలు

- రూ.5 కోట్లతో 16 ప్రభల నిర్మాణం
- కోటప్పకొండ తిరునాళ్లకు 14 గ్రామాల నుంచి రాక



- సిద్ధం చేస్తున్న కోమిటినేనివారి పాలెం ప్రభ

చిలకలూరిపేట, మార్చి 3: మహాశివరాత్రి.. ప్రభల పండుగ.. కోటయ్య తిరునాళ్లకు.. భారీ విద్యుత్ ప్రభలు సిద్ధమవుతున్నాయి. తిరునాళ్ల సందర్భంగా కోటప్పకొండకు ప్రభలతో భక్తులు రావడం ఆనవాయితీగా వస్తోంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎవరిస్థాయిలో వారు ప్రభలను రూపొందించుకుని కోటప్పకొండకు వస్తుంటారు. గ్రామాలకు గ్రామాలు కూడా భారీ విద్యుత్ ప్రభలను రూపొందించి తిరునాళ్లకు రావడం ఇక్కడ ప్రత్యేకత. 90 అడుగుల ఎత్తు ఉండేలా ప్రభలను రూపొందిస్తుంటారు. ఆయా గ్రామాల్లో ప్రభల నిర్మాణానికి సంబంధించి ఏర్పాట్లు ఒక కొలిక్కి వచ్చాయి. ప్రభలను నిలబెట్టి గ్రామస్తులు పెద్దఎత్తున పండుగను చేసుకుని కొండకు బయల్దేరతారు. చిలకలూ రిపేట నియోజకవర్గ పరిధిలో 14 గ్రామాల నుంచి 16 విద్యుత్ ప్రభలు సిద్ధమవుతున్నాయి. ఒక్కొక్క ప్రభకు సుమారు రూ.30 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని అంచనా. చాలా ప్రభలు 90 అడుగుల ఎత్తు ఉండే విధంగా నిర్మిస్తున్నారు. పురుషోత్తమపట్నం గ్రామం నుంచి ఆరు పెద్ద ప్రభలు, నాలుగు చిన్న ప్రభలు సిద్ధమవుతున్నాయి. కమ్మవారిపాలెం, మద్దిరాల, యడవల్లి, గోవిందాపురం, అమీన్‌సాహెబ్‌పాలెం, కోమటినేనివారి పాలెం, అప్పాపురం, కావూరు గ్రామాల్లో ఒక్కొక్కటి, బొప్పూడి గ్రామంలో రెండు విద్యుత్ ప్రభల నిర్మాణం చివరి దశకు చేరింది. కావూరు గ్రామ ప్రభను 78 సంవత్సరాలుగా వంతుల వారీగా నిర్మిస్తున్నారు. ఈ ఏడాది నాయుడు ఇంటి పేరు గల వారు రూ.40 లక్షలతో ప్రభను నిర్మిస్తున్నారు. కోమటినేనివారిపాలెం ప్రభ నిర్మాణం కోసం ప్రతి రోజు 40 మంది వరకు గ్రామ స్తులు పని చేస్తున్నారు. గోవిందాపురం గ్రామ ప్రభను ఇరవై ఏళ్లుగా నిర్మిస్తున్నారు. కమ్మవారిపాలెం ప్రభ 15వ వార్షికోత్సవం చేసుకుంటున్నారు. పురుషోత్తపట్నం నుంచి గ్రామ ప్రభ, బైరావారి ప్రభ, విడదలవారి ప్రభ, యాదవ రాజుల ప్రభ, తోట పుల్లప్పగారి ప్రభ, చిన్నతోట గారి ప్రభ నిర్మాణంలో ఉన్నాయి. నరసరావుపేట మండం నుంచి నాలుగు భారీ విద్యుత్ ప్రభలను నిర్మిస్తున్నారు. కాకాని గ్రామంలో రెండు, గురవాయపాలెంలో ఒకటి, ఉప్పలపాడు గ్రామంలో ఒక భారీ విద్యుత్ ప్రభను నిర్మిస్తున్నారు.



తిరునాళ్ళకు సిద్ధం చేస్తున్న అప్పాపురం గ్రామ ప్రభ

గ్రిడ్ విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆయా గ్రామాల నుంచి కోటప్పకొండకు ప్రభలు 7వ తేదీ తరలివెళ్లనున్నాయి. కోటప్పకొండకు దగ్గరలో ఉన్న యూటీ అనే ప్రదేశం మీదగా ప్రభలు తరలివెళ్లే మార్గం. ఈ పరిస్థితుల్లో ఆ ప్రాంతంలోని ఇతర రాష్ట్ర విద్యుత్ గ్రిడ్ అనుసందానంగా ఉన్న 400 కేవీ విద్యుత్ లైన్లలో సరఫరాను నిలిపి వేస్తారు. ఆ ప్రాంతాన్ని ప్రభలు దాటిన తర్వాత తిరిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో కూడా ఇదే విధంగా విద్యుత్ సరఫరా సుమారు గంట పాటు ఆపేస్తారు.


సూపర్ సిక్స్ పథకాల ప్రచారంలో కొండయ్య, టీడీపీ శ్రేణులు

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్

చీరాల, మార్చి 3: వైసీపీ పాలనలో రాష్ట్ర భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించుకుని చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుంటేనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. మండలంలోని రామకృష్ణాపురంలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ, సూపర్ సిక్స్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని అన్నారు. అలాంటి నాయకత్వం ప్రస్తుతం రాష్ట్రానికి అవసరమన్నారు. అన్నివర్గాలు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నాయన్నారు. రాష్ట్ర సచివాలయాన్ని తాకట్టు పెట్టి రూ.370 కోట్లు అప్పు తేవటం సీఎం జగన్ వికృత పాలనకు పరాకాష్టని మండిపడ్డారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నాతాని ఉమామహేశ్వర రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈనెల 5న మంగళగిరిలో జరగనున్న జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కొండయ్య పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జయహో బీసీ సభ విజయవంతం కోసం పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు కౌతవరపు జనార్దనరావు, నాసిక వీరభద్రయ్య కావేటి వేణుగోపాల్, గుత్తి వీరప్రసాదరావు, అవ్వారు సాంబయ్య, కారంపూడి పద్మిని, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

» తప్పిన పెనుప్రమాదం


చిన్ననందిపాడు వద్ద రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయిన బస్సు

చిన్ననందిపాడు(పర్చూరు), మార్చి 3: ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయిన సంఘటన పర్చూరు - గుంటూరు అర్‌అండ్ బీ రోడ్డులోని చిన్ననందిపాడు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ప్రయాణికులు, స్థానికుల సమాచారం మేరకు.. పర్చూరు నుంచి గుంటూరు వెళుతున్న బస్సు చిన్ననందిపాడు సమీపంలోకి వచ్చేసరికి రోడ్డును దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయింది. ప్రమాద సమయంలో బస్సులో 22 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈప్రమాదంలో ఇద్దరు మహిళలకు స్వల్పగాయాలయ్యాయి. రోడ్డు పక్కనే కాలువ ఉండటంతో పెనుప్రమాదం తప్పిందని ప్రయాణికులు పేర్కొన్నారు. బస్సు కాలువలో బోల్తాపడితే పెను ప్రయాదం జరిగేదని భావిస్తున్నారు.

ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం బలరాం

వేటపాలెం(చీరాల), మార్చి 3: దీర్ఘకాలిక సమస్యలన్నీ ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తున్నట్టు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. వేటపాలెం మండలం కఠారివారిపాలెంలో రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలు, లైటింగ్ వ్యవస్థను ఆదివారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇంకా గ్రామంలో ఏమన్నా సమస్యలు ఉంటే వాటిని కూడా సమిష్టిగా పరిష్కరించుకుందామన్నారు. కార్యక్రమంలో కఠారి రామయ్య, లక్ష్మయ్య, తిరుపతయ్య, ఏడుకొండలు, రాములు, బాబులు, పెద్ద మారయ్య, సాంబయ్య, రమేష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పూర్తి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 3: ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పూర్తయిందని ఆర్డీవో విశ్వేశ్వ రరావు తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆది వారం రాజకీయ పార్టీల ప్ర తినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తపట్నం మండలం ఆల్లూరు మండల పరిషత్ పాఠశాలలో ఉన్న 234, 235 పోలింగ్ కేంద్రాలను అక్కడి సచివాలయం-2కు మార్చినట్లు చెప్పారు. ఒంగోలు నగరం, మండలంలో 10 పోలింగ్ కేంద్రాల గదు ల నెంబర్లను మార్పు చేశామన్నారు. ఓట్ల చేర్పులు, మార్పుల కోసం వచ్చిన దరఖాస్తుల ప్రక్రియ చివరి దశకు చేరిందన్నారు. అనంతరం అంశాల వారీగా వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సృజన్‌కుమార్, డీటీలు అజయ్‌కుమార్, ర ఫీ, కొత్తపట్నం డీటీ అర్జున్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు డీఎస్‌క్రాంతి కుమార్, రసూల్, గుర్రం సత్యనారాయణ, స్వరూప్, కట్టా శ్రీదేవి పాల్గొన్నారు.

'జూనియర్ ఎన్టీఆర్ స్ఫూర్తితో మిషన్ 2029'

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 3 : సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ ఇచ్చిన స్ఫూర్తితో మిషన్ 2029 పేరుతో పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు రా ఎన్టీఆర్ ఫౌండర్ నల్లూరి సాయిరూప్ తెలిపారు. ఒంగోలులోని కేవీ కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో నిత్యాన్నదాన కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. మిషన్ 2029 పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను చేపట్టనున్నట్లు చెప్పారు. భావితరానికి బాట, యువతరానికి తోడు, యుద్ధానికి ఆయుధం, చేసే వ్యవసానికి తీసే కలుపు అనే నినాదంతో ఫౌండేషన్ ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో దుర్గా ప్రసాద్, శివ, కిషోర్, మణి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

1,590 మందికి వైద్య సేవలు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 3 : దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వ ర్యంలో ఆదివారం ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలు ఆవరణ లో జరిగిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. గత ఎనిమిదేళ్ళ నుంచి ప్రతి రెండు నెలలకు ఒకసారి ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వైద్యులు గోపాళం శివన్నారాయణ, బి.హరిబాబు, జి.చైతన్య, ఎం.శరత్, రవితేజ, చాపల వంశీకృష్ణ, ఎస్.ధీరజ్‌బాబు పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారని క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు తెలిపారు. మెడికల్ క్యాంపు నిర్వహణ కోసం చీమకుర్తికి చెందిన డాక్టర్ జవహర్ రూ.10వేలు, ఢాకా సుబ్బారెడ్డి రూ.20 వేలు అందించారన్నారు. 1590మందికి వైద్య సేవలు అందించినట్లు పేర్కొన్నారు.

ఐడల్ గంధర్వలో జిల్లా గాయిని

ఒంగోలు(కల్చరల్), మార్చి 3: ప్రఖ్యాత గాయకుడు డాక్టర్ శ్రీశ రత్‌చంద్ర రెండు తెలుగు రా ష్ట్రాలలో గాయకుల ఎంపిక కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఐడల్ గంధర్వలో జిల్లాకు చెందిన గాయిన దావల ఉషారాణి పాల్గొని తన గానంతో న్యాయ నిర్ణేతల అభినందనలు అందుకున్నారు. ఒంగోలు జిల్లా న్యాయస్థానంలో ఉద్యోగిని అయిన ఉషారాణి అనేక సంగీత విభావరిలలో తన గానంతో ప్రేక్షకుల మన్ననలు పొందారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాలలో జరుగుతున్న ఎంపిక ప్రక్రియలో భాగంగా ఆదివారం వైజాగ్ అల్లూరి విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన పోటీలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐడల్ గంధర్వ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం రావటం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు.

నేడు ఓటర్ల చైతన్య కళాయాత్ర

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 3: సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవా రం ఉదయం పదిన్నర గంటలకు స్థానిక రంగా భవన్‌లో ఓటు వేద్దాం ప్రజా స్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అనే అంశంపై కళాయాత్రను నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ జిల్లా కన్వీనర్ కొల్లా మధు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, రిటైర్డ్ ఏఎస్పీ సుంకర సాయిబాబు, ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర కోఆ ర్డినేటర్ మాగులూరి నాగేశ్వరరావు, సుపరిపాలన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు అళ్ల వెంకటేశ్వరరావు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా ప్రజా సాంస్కృతిక వేదిక కళాబృందం ఆటాపాటలతో ఓటర్ల చైతన్య గీతాలను, నృత్య నాటికలను, జానపదాలను నిర్వహిస్తారని పేర్కొన్నారు.

లాడ్జిలలో పోలీసుల తనిఖీలు

ఒంగోల క్రైం, మార్చి 2: ఒంగోలు నగరంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆదివారం డీఎస్పీ కిషోర్‌బాబు నేతృత్వంలో లాడ్జిలలో విస్తృతమైన తనిఖీలు చేశారు. అనుమానా స్పద వ్యక్తుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరకు అమ్మకాలకు కేరాఫ్ నామ్ రోడ్డు

» కొనుగోలు చేస్తున్న పలురాష్ట్రాల ప్రయాణికులు
» గొర్రెపాడు జంక్షన్ వద్ద విక్రయాల జోరు
» గడ చెరకు రూ.30


నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి సమీపంలో కూకట్లపల్లిలో సాగుచేసిన నల్లచెరకు తోట


నల్లచెరకు గడలను అమ్ముతున్న యువకుడు

బల్లికురవ, మార్చి 3: తీయతీయని నల్ల చెరకు అమ్మకాలకు కేరాఫ్‌గా నామ్ రోడ్డు మారింది. పలు రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులు వాహనాలను నిలుపుదలచేసి చెరకు గడలను కొనుగోలు చేస్తున్నారు. కొందరయితే పెద్దమొత్తంలో చెరకు గడలను కొనుగోలు చేసి తమ ప్రాంతాలకు తీసుకెళుతున్నారు. రోడ్లపై చెరకు అమ్మకాలతో కొందరికి ఉపాధి కూడా దొరుకుతుంది.

బల్లికురవ మండలం గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాలలో సుమారు వంద ఎకరాల్లో నల్ల చెరకు తోటలను సాగు చేస్తున్నారు. రైతులకు కూడా చెరకు పంటపై మంచి లాభాలు వస్తుండటంతో ఏటేటేడు ఆసక్తిగా సాగు చేస్తున్నారు. ఈ రెండు గ్రామాల్లో ఎన్నోఏళ్ల నుంచి నల్ల చెరకు సాగుచేస్తూ ఇతర ప్రాంతాలకు అమ్మకాలకు తరలిస్తున్నారు. తిరునాళ్లల్లో చెరకు అమ్మకాలు పెద్దఎత్తున రైతులు స్వయంగా తీసుకెళ్లి తక్కువ ధరకే అమ్మకాలు చేస్తుంటారు. గత ఏడాది మేనెలలో చెరకు పంట సాగు చేయగా, జనవరి నుంచి దిగుబడులు వచ్చాయి. నల్ల చెరకు కోతలకి రావటంతో ఆ రెండు గ్రామాలకు చెందిన కొందరు దగ్గరలో ఉన్న అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి అయిన గొర్రెపాడు జంక్షన్‌లో చెరకు అమ్మకాలు చేస్తున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నామ్ రోడ్డులో చెరకు గడలను అమ్ముతున్నారు. కొందరు చిరు వ్యాపారులు రైతుల వద్ద చెరకు గడ రూ.20 కొనుగోలు చేసి రాష్ట్రీయ రహదారిపై గడ రూ.30 చొప్పున అమ్ముతున్నారు.

గొర్రెపాడు జంక్షన్ వచ్చిందంటే వేగంగా వెళుతున్న వాహనాలకు బ్రేకులు పడుతున్నాయి. తీయని నల్ల చెరకులను వాహనదారులు కొనుగోలు చేస్తున్నారు. రోజుకి సరాసరిన రెండు వేల చెరకు గడలను విక్రయిస్తున్నట్టు వ్యాపారులు తెలిపారు. నాలుగు మాసాల పాటు నామ్ రోడ్డుపై చెరకు అమ్మకాలు బాగుంటాయని వారు తెలిపారు. అంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, రాష్ట్రాలకు చెందిన వారు కొనుగోలు చేసి తీసుకెళుతున్నట్టు చెప్పారు. నామ్ రోడ్డుపై సుమారు పది మంది వరకు చెరకును అమ్మకాలు చేస్తున్నారు. మే నెల వరకు చెరకు అమ్మకాలు చేస్తామని వ్యాపారులు తెలిపారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

» చుక్కల మందుకు చక్కటి స్పందన


అద్దంకి: ఇటుక బట్టీల వద్ద వలస కూలీల పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ నవ్యారెడ్డి


చినగంజాం: పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ అంకమ్మరెడ్డి

పర్చూరు, మార్చి 3: పోలియో రహిత సమాజమే లక్ష్యంగా వైద్య శాఖతోపాటు, స్వచ్ఛంద సంస్థలు కృషిచేస్తున్నాయని పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక బొమ్మల సెంటర్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటుచేసిన పోలియో కేంద్రాన్ని రోటరీ ప్రతినిధులు ప్రారంభించి చిన్నారులకు చుక్కలు వేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ 5 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న చిన్నారులకు తప్పక పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు ప్రసాద్, దండా శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, కోడూరి శేషబ్రహ్మచారి, తేళ్ళ రమేష్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చినగంజాంలో.. చినగంజాం, మార్చి 3: పోలియో రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి, ఎంపీడీవో యూబీ వర ప్రసాద్ అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా పెదగంజాం ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు ఆదివారం చుక్కలు వేశారు. 2702 మంది ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎస్వీ గోపాలకృష్ణమూర్తి, కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మరెడ్డి. పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సాయిశ్రీచరణ్, సీహెచ్‌వో ఝాన్సీరాణి, చిరంజీవి, ఉల్లరాణి, పొదిలి రాఘవ, బేబి, తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో.. అద్దంకిటౌన్, మార్చి 3: మోదేపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం 5 సంవత్సరాలలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్టు డాక్టర్ నవ్యారెడ్డి తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో 22 బూత్‌లలో, ఇటుక బట్టీలు, క్లాం స్పిన్నింగ్ మిల్ ప్రాంతాలలో పోలియో చుక్కలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 4,015 మంది చిన్నారులకు గాను 3,549 మందికి చుక్కలు వేసి 98.2శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీహర్ష, సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో స్థానిక క్రాంతి నర్సింగ్ హోంలో పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమాన్ని నర్సింగ్ హోం వైద్యులు డాక్టర్ సీహెచ్ ఫణీంద్రబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ, అద్దంకి లేవి ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, నర్రా శ్రీలక్ష్మి పాల్గొన్నారు.


పర్చూరులో పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

బల్లికురవలో.. బల్లికురవ, మార్చి 3: మండలంలోని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ఆదివారం అన్ని గ్రామాల్లో అయిదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండలంలోని 44 కేంద్రాల ద్వారా అయిదేళ్లలోపు ఉన్న 5898 మంది చిన్నారులకు వైద్య సిబ్బంది చుక్కల మందు వేశారు. మరో రెండు రోజుల పాటు ఇంకా మిగిలిపోయిన వారికి ఇంటింటికి తిరిగి చుక్కలు వేస్తామని వైద్య సిబ్బంది తెలిపారు.

ఇంకొల్లులో.. ఇంకొల్లు, మార్చి 3: పోలియో రహిత సమాజానికి కృషి చేద్దామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ అంజలి అన్నారు. ఆదివారం ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పలుచోట్ల పోలియో చుక్కలు వేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండులో, పీహెచ్‌సీలో చిన్నారులకు చుక్కలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణమూర్తి, కోటేశ్వరరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు, జెట్టి వెంకటేశ్వర్లు, చుండి సాంబశివరావు, మద్దినేని హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడిలో.. మార్టూరు, మార్చి 3: యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలో ఆదివారం పల్స్ పోలియో చుక్కలను వేశారు. ఈ కేంద్రం పరిదిలో 4654 మంది చిన్నారులకుగాను 4562 మందికి చుక్కలు వేశారు. దాంతో 98 శాతం చిన్నారులకు చుక్కలు వేసినట్లు డాక్టర్లు హర్ష, డాక్టరు నీహారిక తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్లు ఎస్‌కోటేశ్వరరావు, బి.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మార్టూరు మండలం ద్రోణాదుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలో 3584 మంది చిన్నారులకుగాను 3484 మందికి చుక్కలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ దివ్య లహరి, డాక్టర్ రేష్మా, సీహెచ్‌వో ఝాన్సీ లక్ష్మి, ప్రసన్నాంజనేయరావు, తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో.. చీరాల టౌన్, మార్చి 3: చీరాల పరిధిలో ఆదివారం సుమారు 5830 మంది పిల్లలకు చుక్కలు వేశారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి డా.జాకబ్, డా.స్వాతికిరణ్, డా.మనీష్, డా.ప్రణయ్, డా.శిరీష , తదితరులు పాల్గొన్నారు.

పంగులూరులో.. పంగులూరు, మార్చి 3: మండలంలో 5026 మంది చిన్నారులకు గాను 4858 మందికి పోలియో చుక్కలు వేసినట్టు డాక్టర్ శివచెన్నయ్య తెలిపారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటికి తిరిగి చుక్కలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బాల రాజేశ్వరి, సీహెచ్‌వో భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపేందుకు కంకణబద్ధులు కావాలి

» నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తా
» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


ఆత్మీయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మార్చి 3: రాష్ట్రాన్ని వైసీపీ కబంధ హస్తాల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న పర్చూరు నియోజకవర్గ ఓటర్లు, ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రాన్ని నాశనం చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలని పిలుపు నిచ్చారు.

పర్చూరు నియో జకవర్గంలో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలిగించేందుకు వైసీపీ చేసిన కుట్రలు పటాపంచలయ్యాయని ఏలూరి పేర్కొన్నారు. ఓట్లు తొలగించేందుకు వైసీపీ చేసిన కుట్రలను తిప్పికొట్టి ప్రతి ఓటరు ఓటును కాపాడుకునేం దుకు సుదూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలకోర్చి చూసిన తెగువ, ధైర్యాన్ని అభినందించారు. తాడేపల్లి, అనంతపురంలో చేసిన కుట్రలు పర్చూరులో పనిచేయలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దీన్ని అమలు చేయాలని చూసినా జగన్‌కు చమటలు పట్టాయన్నారు. పర్చూరు ప్రజల చైతన్యం ముందు జగన్ కుట్రలన్నీ ఫెయిల్ అయ్యాయన్నారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్‌కు ఓటే వజ్రాయుధంగా పనిచేస్తుందని చెప్పారు. వైసీపీ పాలనలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించాలన్నారు.

నవ్యాంధ్ర రాష్ట్ర భవిష్యత్‌కు బాబు విజన్, అనుభవం అవసరమని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. ఆనాడు బాబు విజన్, అనుభవంతోనే హైదరాబాద్‌లో వేసిన బాటలే నేడు ప్రగతి ఫలాలను అందిస్తున్నాయన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

వీరన్నపాలెంలో చోరీ

» బంగారం, వెండి ఆభరణాలతోపాటు పట్టుచీరలు అపహరణ
» ఆలస్యంగా వెలుగులోకి


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

పర్చూరు, మార్చి 3: తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ జరిగిన పర్చూరు మండలం వీరన్నపాలెం గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బంధువుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన ప్రత్తిపాటి రవీంద్ర దంపతులు అమెరికాలో ఉన్న కుమారుల వద్దకు డిసెంబర్ నెలలో వెళ్ళారు. తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగులకొట్టి బంగారు, వెండి ఆభరణాలతో పాటు విలువైన పట్టు చీరలను అపహరించారు. తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగులకొట్టి ఉండటాన్ని బంధువులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతోపాటు అమెరికాలో ఉన్న బాధితులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న పర్చూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాపట్ల జిల్లా క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. ఎంత మొత్తంలో బంగారం, వెండి అభరణాలతోపాటు, విలువైన వస్తువులు చోరీ జరిగాయన్న విషయం పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

జూదరుల అరెస్టు

పర్చూరు, మార్చి 3: పర్చూరులో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.21 వేలు స్వాధీనం చేసుకున్నారు.

ఈపంట నమోదు వివరాలు పరిశీలించాలి

బల్లికురవ, మార్చి 3: రబీ సీజన్‌లో పంటలు వేసిన రైతుల ఈ పంట నమోదు పూర్తయిందని ఏవో కుమారి తెలిపారు. వీటి వివరాలను గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో ఉంచినట్టు చెప్పారు. వీటిని రైతులు పరిశీలించి పొరపాట్లు ఉంటే వెంటనే తెలియజేయాలని పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కొప్పెరపాడు రైతు భరోసా కేంద్రంలో పంట నమోదు రైతుల జాబితాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీల్లో రైతులు రబీ సీజన్‌లో 2950 హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నట్టు చెప్పారు. ఇందుకుసంబంధించి పంట నమోదు చేసి ఈకేవైసీ కూడా పూర్తి చేశామన్నారు. రైతులు జాబితాలను పరిశీలించుకొని తమ పేర్లు లేకుంటే తెలియజేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

352 మద్యం బాటిళ్లు స్వాధీనం

పంగులూరు, మార్చి 3: ప్రభుత్వ మద్యం షాపులో సేల్స్‌మెన్‌లుగా పనిచేస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్రమంగా అమ్ముకోవడానికి తరలిస్తున్న 352 క్వార్టర్ల మద్యం సీసాలను ఆదివారం వేకువజామున రేణంగివరం వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తిరుపతిరావు తెలిపారు. రేణంగివరంకు చెందిన బి.జనార్దన్‌రెడ్డి, మార్టూరు మండలం వలపర్లకు చెందిన పి.నరేష్ ఇతర ప్రాంతాలలో విక్రయించడానికి తరలిస్తున్నారు. ఈక్రమంలో పోలీసుల తనిఖీలో పట్టుబడ్డారు. మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకొని, ఇద్దరు యువకులను అద్దంకి కోర్టులో హాజరుపరచారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ కె.రవి, కానిస్టేబుళ్లు కె.విజయ్ కుమార్, జె.ముత్తయ్య కట్టా లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన కోలలపూడి వాసులు

మార్టూరు, మార్చి 3: మండలంలోని కోలలపూడి ఎస్సీ కాలనీవాసులు టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో శనివారం రాత్రి పార్టీలో చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ గాలి అర్జియా, గాలి యోహాను, గొర్రెపాటి దాసు, గొర్రెపాటి జీవయ్య, జొన్నలగడ్డ పౌలు, గాలి ఆదాం, గాలి రామయ్య, గాలి కోటి నాగులు, తదితరులు పార్టీలో చేరారు. వారందరికి ఏలూరి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

టీడీపీ, జనసేన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

వేటపాలెం(చీరాల), మార్చి 3: వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవటమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని జనసేన పార్టీ చీరాల నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి స్వాములు(శ్రీనివాసరావు) పిలుపునిచ్చారు. ఆదివారం పందిళ్లపల్లిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసేనాని పవన్‌కల్యాణ్ 24 స్థానాలకు అంగీకరించటం సరికాదనే వాదన సరికాదన్నారు. కాపులలో కొందరు చేస్తున్న వ్యాఖ్యల్లో నిజం లేదన్నారు. తాను జనసేనపార్టీ చీరాల నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్టు చెప్పారు. గిద్దలూరు సీటును ఆశిస్తున్నానన్నారు. అయితే, అంతిమంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తీసుకునే నిర్ణయమే శిరోధార్యమన్నారు.

చెన్నుపాటి మృతి క్రీడాకారులకు తీరనిలోటు

చీరాల, మార్చి 3: స్థానిక, జిల్లా, రాష్ట్ర స్థాయిలో బ్యాడ్మింటన్ అసోసియేషన్లలో వివిధ స్థాయిల్లో బాధ్యతలు నిర్వర్తించిన చెన్నుపాటి నాగేశ్వరరావు మృతి క్రీడాకారులకు తీరనిలోటని పలువురు పేర్కొన్నారు.. నాగేశ్వరరావు ఇటీవల మరణించగా ఆదివారం స్థానిక రోటరీ ఇండోర్ స్టేడియంలో సంస్మరణ సభ నిర్వహించారు. నాగేశ్వరరావు బ్యాడ్మింటన్ క్రీడకు అందించిన సేవలను మననం చేశారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్, కరణం పున్నయ్యచౌదరి, డాక్టర్ రామకృష్ణహనుమాన్, కోఆప్షన్ సభ్యుడు షేక్ హుమాయూన్ కబీర్, పి.సురేష్‌కుమార్, పురషోత్తమ్, మూర్తి, నాంచారయ్య, కృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

వివేక స్కూల్ విద్యార్థుల ప్రతిభ

వేటపాలెం(చీరాల), మార్చి 3: చిలకలూరిపేటలోని వాసవి గార్డెన్ షాపింగ్ మాల్‌లో ఆదివారం జరిగిన కరాటే పోటీలలో స్థానిక వివేక స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారు. ఈసందర్భంగా పోటీలలో గెలుపొందిన వారిని స్కూల్ యాజమాన్య ప్రతినిధులు, శిక్షకుడు నరేంద్రరెడ్డి అభినందించారు.: షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి.

లారీ ఢీకొని యువకుడు మృతి

అద్దంకి, మార్చి 3: లారీ ఢీకొనటంతో ప్రయివేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న తంగా విజయ్(28) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని గాజులపాలెంకు చెందిన విజయ్ ఒంగోలు సమీపంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం మోటారుసైకిల్‌పై అద్దంకి పట్టణంలో ఇంటి వద్ద నుంచి భవాని సెంటర్ వైపు వెళ్ళేక్రమంలో ఆర్టీసీ బస్టాండ్ దాటిన తరువాత పాత పెట్రోల్ బంక్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. తలపైగా లారీ వెళ్ళటంతో నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

అద్దంకి, ఫిబ్రవరి 3: పురుగు మందు తాగిన మహిళ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా తాళ్ళూరు మండలం శివరామపురంకు చెందిన గుంజి నాగవేణి(38) గత నెల 28న అద్దంకి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ రేస్‌ను అడ్డుకున్న పోలీసులు

వేటపాలెం(చీరాల), మార్చి 3: తీరప్రాంతం రోడ్డులో బైక్ రేస్ జరుగుతున్న సమాచారంతో వేటపాలెం ఎస్సై సురేష్ ఆదివారం సిబ్బందితో కలసి రామాపురం తీరంలో తనిఖీలు నిర్వహించారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బైక్ రేస్‌లో పాల్గొన్న యువకులు తమ మోటారు సైకిళ్లను వదలి పారిపోయారు. దీంతో ఆరు బైకులను వేటపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

6న కలెక్టరేట్ ఎదుట సర్పంచ్‌ల ధర్నా

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 3: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేస్తూ ఆర్థిక సంఘం నిధులను దోపిడీ చేస్తున్న తీరుకు నిరసనగా ఈనెల 6వతే దీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి తెలిపారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండేళ్ళుగా సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణంగా ఉందన్నారు. వేలాది కోట్లు ఆర్థిక సంఘం నిధులను దారిమళ్ళించడమే కాకుండా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పంచాయతీలకు సమాంతర వ్యవస్థలను ఏర్పాటు చేసి పంచాయతీలను నిర్జీవం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా చేస్తున్న ఈ ధర్నాలో జిల్లాలోని సర్పంచ్‌లందరూ పాల్గొని విజయవంతం చే యాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పగడాల రమేష్, రావెళ్ళ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

9న దివ్యాంగుల మహాగర్జనకు తరలిరావాలి

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 3: దివ్యాంగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ నాయకులు ఆనాల సురేష్ కోరారు. ఆదివారం ఒంగోలులోని సమితి కార్యాలయంలో జరిగిన సమావేశలో ఆయన మాట్లాడుతూ గడచిన కొన్నేళ్ళుగా దివ్యాంగుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 9 చలో అమరావతి, మహా గర్జనకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గ్రౌండ్‌లో మధ్యాహ్నం 12 గంటలకు జరిగే గర్జనకు ముఖ్యఅతిధిగా వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. ఈ గర్జనకు జిల్లావ్యాప్తంగా దివ్యాంగులు పెద్దసంఖ్యలో తరలి రావాలని కోరారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు అన్నెం చినసుబ్బయ్యయాదవ్, అందె రాంబాబు పాల్గొన్నారు.

వేగం కన్నా ప్రాణం మిన్న

మద్దిపాడు, మార్చి 3: వాహన చోదకులు వేగం కన్నా ప్రాణం మిన్న అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఎస్‌ఐ మహేష్ పేర్కొన్నారు. ఆదివారం గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ వద్ద వాహనాలను తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై నిబంధనలు తప్పక పాటించాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని ఆయన సూచించారు.



పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చుక్కల మందుకు చక్కని స్పందన

● 99.01శాతం పల్స్ పోలియో

● ఒంగోలులో ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 3 : జిల్లావ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. 0-5 సంవత్సరాలలోపు ఉన్న 2,40,958 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా తొలిరోజైన ఆదివారం 2,38,580 (99.01శాతం) మందికి వేశారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేయనున్నారు. ఒంగోలులోని మంగమూరు రోడ్డులో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో మహమ్మారిని సమాజం నుంచి తరిమివేసే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లావ్యాప్తంగా 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో మూడు రోజులపాటు పల్స్ పోలియో కొనసాగుతుందని తెలిపారు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లందరికీ తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, వైద్యశాఖ జేడీ డాక్టర్ కామేశ్వరప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజ్యలక్ష్మి, డీఐవో డాక్టర్ పద్మజ, డీపీఎంవో డాక్టర్ వాణిశ్రీ, ఏవో డాక్టర్ హిమబిందు, డెమో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ డ్యూటీల నుంచి ఎస్‌జీటీలు ఔట్

● విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాలు

ఒంగోలు (విద్య), మార్చి 3 : జిల్లాలో ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షల విధుల నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్లను తొలగించారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాలతో ఈమేరకు చర్యలు తీసుకున్నారు.. ప్రవీణ్‌ప్రకాష్ శనివారం చీమకుర్తి మండలం గోనేపల్లివారిపాలెం మండల పరిషత్ పాఠశాలను సందర్శించారు. ఆ సమయంలో అక్కడ ఒక టీచర్ విధుల్లో ఉన్నారు. మరో టీచర్ ఇంటర్మీడియేట్ పరీక్షల డ్యూటీకి వెళ్లారు. దీంతో ఎస్‌జీటీలను పరీక్షల విధులకు కేటాయించడాన్ని ఆయన తప్పుపట్టారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి సైమన్ విక్టర్‌ను పిలిచి 'మా టీచర్లను మీరు పరీక్షల విధులకు వినియోగిస్తే పిల్లలకు పాఠాలు ఎవరు చెబుతారు' అని ప్రశ్నించారు. వెంటనే ఇంటర్మీడియేట్ పరీక్షల డ్యూటీలు చేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లను విధుల నుంచి రిలీవ్ చేసి పాఠశాలలకు పంపించాలని ఆదేశించారు. దీంతో ఇంటర్ పరీక్షల డ్యూటీలో ఉన్న 274 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లను రిలీవ్ చేసి వారి స్థానంలో డిగ్రీ కళాశాలలు, ప్రైవేటు పాఠశాలల టీచర్లను ఇన్విజిలేటర్లుగా నియమించినట్లు సైమన్ విక్టర్ తెలిపారు. ఇదిలా ఉండగా ఇలపావులూరు మండల పరిషత్ పాఠశాలలో ఒక టీచర్‌కు విదేశాలకు వెళ్లేందుకు అధికారులు అనుమతి ఇవ్వడంపై ప్రవీణ్‌ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవుకు అనుమతించిన ఎంఈవో వివరణ తీసుకోవాలని ఆర్జేడీ లింగేశ్వరరెడ్డిని ఆదేశించారు. ఆ టీచర్ విదేశాలకు వెళ్లేందుకు అనుమతిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల ఫైల్‌ను పంపించాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశించడంతో దాన్ని వాట్సాప్ ద్వారా పంపారు. పొదిలి మండలం ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్‌ను ప్రవీణ్ ప్రకాష్ ప్రశంసించారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో తాను సందర్శించిన 72 హైస్కూళ్లలో ఉప్పలపాడులోనే ఐఎఫ్‌పీ అండ్ టీవీ వినియోగంలో చాలా బాగుందని మెచ్చుకున్నారు పాఠశాల విద్యార్థులను, ముగ్గురు టీచర్లను అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న
డీఎస్పీ కిషోర్‌బాబు, పక్కన సీఐ రంగనాథ్, ఎస్సై నాగేశ్వరరావు

గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టు

● రూ.34 లక్షల విలువైన 56 కేజీలు స్వాధీనం

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ కిషోర్‌బాబు

సింగరాయకొండ, మార్చి 3 : గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను వేర్వేరు సమయాల్లో పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ.34 లక్షల విలువైన 56 కేజీల గంజాయిను పట్టుకొని సీజ్ చేశారు. ఈ సంఘటనలు శనివారం టంగుటూరు జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద చోటుచేసుకున్నాయి. వివరాలు ఒంగోలు డీఎస్పీ కిషోర్‌కుమార్ ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. ఒడిస్సా నుంచి కర్ణాటక రాష్ట్రానికి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఒంగోలు జేడీ టీం సీఐ కె. వంశీధర్ టంగుటూరు జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో జూనో బేకరీ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో బెంగళూరుకు చెందిన ముబారక్ గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు తేలింది. ఇతనితోపాటు నరేంద్రనాయక్, లక్ష్మణ్‌నాయక్, భరత్‌సాహుల ద్వారా ఒడిస్సా నుంచి బెంగళూరుకు బస్సుల్లో గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో సీఐ రంగనాథ్, జేడీ టీం సీఐ వంశీధర్, టంగుటూరు ఎస్సై నాగేశ్వరరావులు టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద కాపు కాశారు. బస్సులను, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్సులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నరేంద్రనాయక్, లక్ష్మణ్‌నాయక్‌ను పట్టుకున్నారు. వారి వద్ద 48 కేజీల గంజాయిను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. శనివారం మరో సంఘటనలో టంగుటూరు టోల్‌ప్లాజ్ సమీపంలోని బాపూజీ కాలనీ రిక్వెస్ట్ బస్సు స్టాప్ సమీపంలో ఓ వ్యక్తి వద్ద గంజాయి ఉందనే సమాచారంతో అతడిని జేడీ టీం సీఐ వంశీధర్ అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ విచారణలో సలీం, కుట్టప్పన్ అనే వ్యక్తులు రాజమండ్రి నుంచి కేరళకు అక్రమంగా గంజాయి సరఫరా చేస్తున్నట్లు చెప్పాడు. దీంతో పోలీసులు టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న కుట్టప్పన్‌ను సీఐ రంగ్‌నాథ్ అరెస్ట్ చేశారు. అతని వద్ద 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరుకు చెందిన ముబారక్, కేరళకు చెందిన సలీం కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. పక్క రాష్ట్రాల నుంచి గంజాయిను అక్రమ రవాణా చేస్తున్న ముఠాను పట్టుకున్న సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై వంశీధర్, నాగేశ్వరరావులను ఎస్పీ పరమేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారని డీఎస్పీ వెల్లడించారు.

పది రోజుల తర్వాతే లోకేష్ పర్యటన

● చంద్రబాబు కార్యక్రమం కూడా వాయిదా పడే అవకాశం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లాలోని ఆయా నియోజకవర్గాల టీడీపీ నేతలు వ్యక్తం చేసిన అభిప్రాయాలకు అనుగుణంగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ జిల్లా పర్యటన వాయిదా పడింది. ఈనెల 7వ తేదీ నుంచే ఆయన జిల్లాలో శంఖారావం కార్యక్రమం ప్రారంభించాలనుకున్న విషయం విదితమే. అయితే 8వ తేదీ శివరాత్రి కావడంతో పదో తేదీ తర్వాత జిల్లాకు రావాలని టీడీపీ నేతలు సూచించారు. దీంతో జిల్లాలో 7వ తేదీ నుంచి పర్యటించాలనుకున్న తన పర్యటనను లోకేష్ మార్చుకున్నారు. తదనుగుణంగా రాయలసీమ నుంచి శంఖారావం సభను ప్రారంభించి ఆ వరుస క్రమంలో జిల్లాకు వస్తారని సమాచారం. దీంతో లోకేష్ శంఖారావం సభలు జిల్లాలో పది రోజుల తర్వాతే జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అలాగే ఈనెల 10వ తేదీన మార్కాపురంలో నిర్వహించాల్సిన చంద్రబాబు సభ కూడా వాయిదా పడే అవకాశం ఉంది. ఒంగోలు ఎంపీమాగుంట, అయన కుమారుడు, ఇతర అనుచరులు పార్టీలో చేరేందుకు చంద్రబాబును జిల్లాకు రావాలని మాగుంట ఆహ్వానించారు. అయితే అందుకు తేదీ ఖరారు కాకపోవడంతో మార్కాపురం కార్యక్రమం కూడా పదో తేదీ కాకుండా ఆ తర్వాత నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిసింది.

బాబ్బాబ్బాబు... మీరే దిక్కు!

వలంటీర్ల చుట్టూ వైసీపీ రాజకీయం

ఇటు తాయిలాలు.. అటు హామీలు

ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున పంపిణీ

ఆరోగ్య బీమా పాలసీలు..

ఎమ్మెల్యే అయితే వచ్చే జీతం మీకేనంటూ మరో నేత హామీ

వారికి ఇవ్వండంటూ నియోజకవర్గానికి రూ.కోటి ప్రకారం పంపిన ఎంపీ అభ్యర్థి

వైసీపీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి

కిందిస్థాయి నాయకుల్లో తిరుగుబాటు





అధికార వైసీపీ ఎన్నికల రాజకీయం అంతా వలంటీర్ల చుట్టూ తిరుగుతోంది. వారికి ప్రోత్సాహక బహుమతుల పేరుతో ప్రభుత్వం ఇచ్చే నగదు పారితోషికంతోపాటు వైసీపీ తరపున పోటీ చేయబోతున్న అభ్యర్థులు భారీ తాయిలాలు ప్రకటిస్తున్నారు. కొందరు ఇప్పటికే డబ్బులు పంపిణీ చేయగా మరికొందరు అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకొందరైతే మీ కుటుంబాలకు ఆరోగ్య బీమా పాలసీలు చేయిస్తామని, ఎమ్మెల్యే అయిన తర్వాత తమకు వచ్చే జీతం అంతా మీకే ఇస్తామంటూ ఆశలు చూపుతున్నారు. ప్రధానంగా ఒంగోలు లోక్‌సభ పరిధిలో ఈ వ్యవహారం అధికంగా సాగుతోంది. ఎంపీ స్థానం నుంచి పోటీ చేసేందుకు సిద్ధమైన వైసీపీ నేత సహకారం, ప్రోత్సాహం ఇందుకు ముఖ్య కారణంగా చెబుతున్నారు. అయితే ఈ వ్యవహారం ఆరంభంలోనే వికటిస్తున్నట్లు కనిపిస్తోంది. 'పార్టీ కోసం కష్టపడిన తమను పట్టించుకోకుండా వలంటీర్లపైనే ఆధారపడతారా! కానీయండి చూస్తాం!' అంటూ ఆ పార్టీ శ్రేణులు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలను నమ్ముకొని ముందుకు సాగడం గతం నుంచి జరుగుతోంది. అయితే ప్రస్తుతం అధికార వైసీపీ అందుకు భిన్నంగా వలంటీర్లను నమ్ముకుంది. నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎన్నికల్లో పోటీ చేయబోతున్న అభ్యర్థులు వలంటీర్లను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో ఏనియోజకవర్గంలో చూసినా వారితో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమ కోసం పనిచేసేలా తాయిలాల ఎరచూపుతున్నారు.

ఎక్కువ మంది అభ్యర్థులు స్థానికేతరులే!

జిల్లాలోని ఎక్కువ నియోజకవర్గాల్లో స్థానికేతర అభ్యర్థులు వైసీపీ రంగంలోకి దింపింది. దీంతో వారు తూతూ మంత్రంగా స్థానిక వైసీపీ శ్రేణులతో పరిచయ కార్యక్రమాలు నిర్వహించి వెంటనే వలంటీర్ల వైపు దృష్టి సారించారు. గతంలో ఒక ఊరికి వెళ్లాలన్నా, ఒక వార్డుకు వెళ్లాలన్నా ముందుగా ఆ ప్రాంతం నాయకులతో సంప్రదించే అభ్యర్థులు ఇప్పుడు ముందుగా వలంటీర్లను కలుస్తున్నారు. ముఖ్యమంత్రి జగనే ఈ విధానాన్ని ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వపరంగా అధికారికంగా వలంటీర్లతో సమావేశాలు ఏర్పాటు చేయించి వారిని సన్మానించడం, అవార్డుల పేరుతో నగదు బహుమతులు ఇవ్వడం చేయించారు. అంతటితో ఆగకుండా రాజకీయ పరమైన సమావేశాలకు కూడా శ్రీకారం పలికారు. వలంటీర్లు వారి పరిధిలోని ఓటర్ల సమాచారం తెలుసుకునేందుకే పరిమితం కాకుండా మీరే అంతా చూడాలంటూ వారిపై భారం మోపడం ప్రారంభించారు. అందుకు అనుగుణంగా వారికి తాయిలాలు కూడా పంచుతున్నారు.

ఒక్కో వలంటీర్‌కు రూ.5వేలు

వైసీపీ తరపున పోటీలోకి దిగనున్న పార్టీ ఇన్‌చార్జిలు ప్రతి వలంటీర్‌కు రూ.5వేల ప్రకారం పంపిణీకి శ్రీకారం పలికారు. ఈ వ్యవహారం ఒంగోలు లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇప్పటికే కొండపి, మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో పంపిణీ పూర్తయ్యింది. కొండపిలో ఒక వలంటీర్‌కు రూ.5వేల ప్రకారం ఇవ్వడంతోపాటు ఇదే తరహాలో సచివాలయ ఉద్యోగులను కూడా గౌరవిస్తామంటూ సంకేతం పంపినట్లు తెలిసింది. ఒకట్రెండు గ్రామాల్లో వారికి కూడా నగదు అందించినట్లు కూడా తెలిసింది. మార్కాపురంలో అయితే పోటీ చేయబోతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు బొమ్మతో ఇచ్చిన గిఫ్ట్ ప్యాకెట్‌లో స్వీట్‌తో పాటు డబ్బులు పంపిణీ చేశారు. ఈ తంతు మిగిలిన నియోజకవర్గాల్లో దాదాపు పూర్తయ్యింది. దర్శి నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రతి వలంటీర్ కుటుంబానికి ఆరోగ్య బీమా పథకం అమలుకు అవసరమైన ప్రీమియంను తానే చెల్లిస్తానని బహిరంగంగానే ప్రకటించారు. అంతేకాక తాను ఎమ్మెల్యే అయిన తర్వాత ప్రభుత్వం నుంచి వచ్చే జీతాన్ని నెలకు ఒక మండలంలోని వలంటీర్లకు కేటాయిస్తానని ప్రకటించినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఒంగోలులో అయితే వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డ్వాక్రా మహిళలకు చీరలు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. కాగా ఆదివారం జరిగిన వలంటీర్ల సమావేశంలో ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థల పట్టాతోపాటు శుభసూచికంగా ఒక చీర, ప్యాంటు, షర్టు ఇస్తానని ప్రకటించారు. కొంతకాలం క్రితం ఆయన వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు వార్డుల వారీ విందు కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు కూడా ఇచ్చారు. ఇప్పుడు వైసీపీ అభ్యర్థులుగా మంత్రి సురేష్, ఎమ్మెల్యేలు నాగార్జునరెడ్డి, రాంబాబు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో వలంటీర్లకు డబ్బుల పంపిణీ పూర్తయ్యింది. కనిగిరి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల్లో రంగంలో కొచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థులు వలంటీర్లతో సమావేశాలు నిర్వహిస్తూ తాము చేయబోయే సహకారం గురించి వారికి చెప్పి తదనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది.

నియోజకవర్గానికి రూ.75 లక్షలు పైమాటే

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కేవలం వలంటీర్లకు ఇస్తున్న నగదే సరాసరి రూ.75 లక్షల వరకూ ఉంటుందని అంచనా. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్ చెప్పున ప్రతి నియోజకవర్గంలో 1,500 నుంచి 2వేల మంది వరకు వలంటీర్లు ఉన్నారు. సరాసరిన 1,500 మందికి ఒక్కొక్కరికి రూ.5వేల ప్రకారం ఇచ్చినా రూ.75 లక్షలు అందుకోసమే వినియోగిస్తున్నారు. ఒంగోలు లోక్‌సభ పరిధిలో ఈ వ్యవహారం అధికంగా జరగడానికి పార్టీ తరఫున ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థి ఆర్థిక ప్రోత్సాహమే కారణంగా భావిస్తున్నారు. ఇప్పటికే రెండు నియోజకవర్గాలు మినహా ఐదు నియోజకవర్గాల అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.కోటి ప్రకారం ఆయన పంపినట్లు తెలుస్తోంది.

రగిలిపోతున్న వైసీపీ శ్రేణులు

అనునిత్యం పార్టీ జెండా మోయడమే కాక పోలింగ్ సమయంలో కీలకపాత్ర పోషించే మమ్మల్ని పట్టించుకోకుండా వలంటీర్ల చుట్టూ తిరగడాన్ని చూసి వైసీపీలోని కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు రగిలిపోతున్నారు. 'వారికి నెలవారీ ఎంతో కొంత జీతం ఇస్తున్నారు. అన్నింటికీ మించి వలంటీర్లకు ఉద్యోగాలు మా సిఫార్సు మేరకే ఇచ్చారు. ఇప్పటికీ వారు మా పరిధిలోనే, మా అడుగుజాడల్లోనే ఉంటారు. అలాంటి వారికి మాతో సంబంధం లేకుండా తాయిలాలు అందజేయడం, అతిథి మర్యాదలు ఇవ్వడం, ఎన్నికల్లో మీరే బాధ్యులంటూ నాయకులు మాట్లాడటం మేము జీర్ణించుకోలేకపోతున్నాం' అని గ్రామస్థాయిలోని వైసీపీ నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. 'గత నాలుగున్నర సంవత్సరాలుగా మా బాగోగులు పట్టించుకోని నాయకులు వస్తే నిలదీద్దామనుకున్నాం. కానీ జగన్ తెలివిగా వేరే వారిని పంపారు. అయినా వారితో మా సంగతేంటి చెప్పండని కోరాలనుకున్నాం. కానీ మమ్మల్ని కాదని వారు నేరుగా వలంటీర్లతో కలిసిపోయారు. రేపు మాసత్తా చూపిస్తాం' అని కిందిస్థాయి నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

జయహో బీసీ సదస్సుకు తరలిరండి

దర్శి, మార్చి 3 : రాష్ట్ర స్థాయి జయ హో బీసీ సదస్సుకు తరలిరాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు కోరారు. దర్శిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళగిరి వద్ద నాగార్జున యూనివర్సిటీ సమీపంలో ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం జరిగే టీడీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బీసీ సదస్సులో ముఖ్య అతిథిలుగా టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కే అచ్చెన్నాయుడు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. దర్శి నియోజకవర్గం నుంచి, జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో బీసీ సోదరులు, టీడీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ వైష్ణవ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు టీ లక్ష్మీనారాయణబాబు, టీడీపీ రజక సాధికారిక కమిటీ కన్వీనర్ పూరిమిట్ల యల్లయ్య, జిల్లా మీడియా కోఆర్డినేటర్ పఠాన్‌సుభానీ పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసల వెల్లువ

వైసీపీని వీడి సైకిలెక్కుతున్న వివిధవర్గాలు

జిల్లావ్యాప్తంగా భారీగా చేరికలు

సాదరంగా ఆహ్వానిస్తున్న నేతలు

పార్టీ అభ్యర్థులు, ఇన్‌చార్జిల నివాసాలు, కార్యాలయాల వద్ద సందడి



ఒంగోలు నగరంలోని నాల్గో డివిజన్ నుంచి టీడీపీలోకి చేరిన ఆర్యవైశ్యులు

ఒంగోలు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తెలుగుదేశం పార్టీలోకి వలసలు వెల్లువలా కొనసాగుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా అన్నిచోట్లా వివిధ వర్గాల వారు వైసీపీని వీడి పెద్దసంఖ్యలో సైకిలెక్కుతున్నారు. దీన్నిబట్టి వైసీపీ ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత ఆయా వర్గాల ప్రజల్లో ఉన్నదన్న విషయం స్పష్టమవుతోంది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో ఇప్పటికే ఐదింటిలో టీడీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. దీంతో ఆయా నియోజకవర్గాలలో అభ్యర్థిత్వం ఖరారైన వారి సమక్షంలో పార్టీలో చేరేందుకు వివిధ వర్గాల వారు ఉత్సాహం చూపుతున్నారు. ఇతర నియోజకవర్గాల్లోనూ అక్కడి ఇన్‌చార్జిల సమక్షంలో వలసలు భారీగా జరుగుతున్నాయి. వీరిలో ప్రధానంగా ఎస్సీ,ఎస్టీ, మైనారిటీలతోపాటు ఆర్యవైశ్యులు, బీసీల్లోని వివిధ వర్గాలకు చెందిన వారు ఎక్కువగా ఉంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం ఇలాంటి చేరికలు అధికంగా కనిపించాయి. దీంతో ఆయా ప్రాంతాల్లోని టీడీపీ అభ్యర్థులు, ఇన్‌చార్జిల నివాసాలు, కార్యాలయాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

వివిధ ప్రాంతాల్లో వైసీపీని వీడి..

ఆయా ప్రాంతాల్లో ఆదివారం చేరికలను పరిశీలిస్తే ఒంగోలులోని టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నివాసంలో ఉదయం కేశవరాజుకుంట ప్రాంతానికి చెందిన పలు కుటుంబాల వారితోపాటు 47, 57 డివిజన్లకు చెందిన వారు చేరారు. నగరంలోని రిక్షాల బజారులో ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన దాదాపు వంద కుటుంబాల వారు ప్రత్యేకంగా ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని దామచర్లను అక్కడికి ఆహ్వానించి టీడీపీ తీర్థంపుచ్చుకున్నారు. కొండపి నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి వద్ద సింగరాయకొండ మండలం సోమరాజుపల్లికి చెందిన పలు కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సమక్షంలో సంతనూతలపాడు మండలం వేములపాడుకు చెందిన పలు కుటుంబాల వారు వైసీపీని వీడి సైకిలెక్కారు. కనిగిరి నియోజకవర్గంలో చేరికల జోరు కొనసాగుతోంది. మునిసిపాలిటీ పరిధిలోని పలు కుటుంబాల వారు ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు సమక్షంలో దోర్నాల మండలం యడవల్లిలో వైసీపీకి చెందిన వార్డు సభ్యుడు, పలు దళిత కుటుంబాలతోపాటు వై.పాలెం మండలం మురారిపల్లికి చెందిన వైసీపీ సీనియర్ నేత లక్ష్మీరెడ్డి టీడీపీలో చేరారు. మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి సమక్షంలో పొదిలి మండలంలోని మూగచింతల ఎస్సీ కాలనీకి చెందిన సుమారు 70 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి సమక్షంలో కంభం ప్రాంతానికి చెందిన పలువురు మైనారిటీలు పార్టీలో చేరారు.



దోర్నాల మండలం యడవల్లిలో టీడీపీలో చేరిన కుటుంబాలు



మాజీ ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన పలుకుటుంబాలు

డీసీఎంఎస్ కుంభకోణంపై బిగుస్తున్న ఉచ్చు

రంగంలోకి పొగాకు బోర్డు ఈడీ

నివేదిక కోరిన కమిషనర్

ఒంగోలు (విద్య), మార్చి 3 : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో జరిగిన ఎరువుల నిధుల గోల్‌మాల్‌పై ఉచ్చుబిగుస్తోంది. ఈ కుంభకోణంపై జిల్లా సహకారాధికారి రాజశేఖర్ ఇప్పటికే విచారణకు ఆదేశించారు. తాజాగా పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు విషయాన్ని సీరియస్‌గా తీసుకొని రాష్ట్ర మార్కెటింగ్, సహకారశాఖల ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరికి ఫిర్యాదు చేశారు. 'డీసీఎంఎస్'లో భారీ కుంభకోణం శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్త క్లిప్పింగ్‌ను కూడా ఆయనకు పంపించారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని సహకారశాఖ రాష్ట్ర కమిషనర్ అహ్మద్‌బాబును చిరంజీవిచౌదరి ఆదేశించారు. దీంతో అహ్మద్‌బాబు డీసీవోకు ఫోన్ చేసి నిధుల గోల్‌మాల్‌పై ఆరా తీశారు. ఆయన ఆదేశాల మేరకు డీసీవో ప్రాథమిక నివేదికను పంపారు. సమగ్రంగా విచారణ చేసి 4వతేదీకి నివేదిక సమర్పించాలని డీసీవోను కమిషనర్ ఆదేశించారు.

పొగాకు బోర్డు ఈడీ ఫిర్యాదు

డీసీఎంఎస్‌లో ఎరువుల నిధుల గోల్‌మాల్‌పై పొగాకు బోర్డు ఎగ్జిక్యూటి డైరెక్టర్ (ఈడీ) అద్దంకి శ్రీధర్‌బాబు ప్రభుత్వ మార్కెటింగ్, సహకారశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరికి ఫిర్యాదు చేశారు. పొగాకు రైతులకు ఎరువులు సరఫరా చేసేందుకు ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్), రైతుల కమిటీ, డీసీఎంఎస్‌లు త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నాయి. డీసీఎంఎస్‌కు ఐపీఎల్ ఎరువులు సరఫరా చేస్తుంది. వాటిని పొగాకు బోర్డు ద్వారా డీసీఎంఎస్ రైతులకు ఇస్తుంది. బోర్డు రైతుల నుంచి ఆ మొత్తాలు వసూలు చేసి డీసీఎంఎస్‌కు జమ చేస్తోంది. డీసీఎంఎస్ ఆ మొత్తాలను ఒకట్రెండురోజుల్లోనే ఐపీఎల్ బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాల్సి ఉంటుంది. అయితే పొగాకు బోర్డు రైతులు చెల్లించాల్సిన మొత్తం నిధులు డీసీఎంఎస్‌కు జమ చేసి రెండు నెలలవుతున్నా ఇప్పటికీ ఇంకా రూ.72 లక్షలు ఐపీఎల్‌కు చేరలేదు. ఈ మొత్తం గోల్‌మాల్ అయిందని ఈడీ అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంలో జోక్యం చేసుకొని ఐపీఎల్‌కు రూ.72 లక్షలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని శ్రీధర్‌బాబు తన ఫిర్యాదులో చిరంజీవి చౌదరిని కోరారు.



ప్రారంభమైన విచారణ

డీసీఎంఎస్‌లో ఎరువుల నిధుల గోల్‌మాల్‌పై డీసీవో నియమించిన విచారణాధికారి అయిన ఒంగోలు సబ్ డివిజన్ సహకారాధికారి జె.రామచంద్రనాథ్ విచారణ ప్రారంభించారు. సొసైటీ రికార్డులు స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు. సొసైటీ బ్యాంకు ఖాతాల నుంచి భారీ మొత్తంలో నగదు అకౌంటెంట్ వ్యక్తిగత ఖాతాకు బదిలీ కావడాన్ని విచారణాధికారి గుర్తించారు. ఈ విషయంలో సొసైటీ బిజినెస్ మేనేజర్, అకౌంటెంట్, గుమస్తా, పాలకవర్గాన్ని విచారణాధికారి విచారించనున్నారు.

సోమశిలలో 15.838 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, మార్చి 3: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి జలాశయంలో 16.438 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

వామ్మో.. ఆ ఫైళ్లా!?

- రెవెన్యూ వ్యవహారాలకు దూరంగా కొత్త తహసీల్దార్లు
- భూసమస్యల పరిష్కారానికి వెనుకడుగు
- ఎన్నికల విధులపైనే మొగ్గు

గతంలో జరిగిన భూకుంభకోణాలే కారణం

ఏంచేస్తే ఎక్కడ ఇరుక్కుంటామోనన్న భయం

ప్రజల సమస్యలనూ పట్టించుకోని వైనం

నెల్లూరు, మార్చి3 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ నేతల ధనదాహనం ప్రజలకు శాపంగా మారింది. నాలుగన్నరేళ్లపాటు విచ్చలవిడిగా రెవెన్యూ రికార్డులను మార్చేయడం, తద్వారా భూసమస్యలు తలెత్తడం ఫలితంగా కోర్టు కేసులు, సస్పెన్షన్లు ఎక్కువయ్యాయి. జిల్లాలోని రెవెన్యూ సిబ్బంది పనితీరు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఇప్పుడు ఎన్నికల నేపథ్యంలో గతంలో పనిచేసిన తహసీల్దార్లంతా ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు బదిలీ అయ్యారు. అక్కడున్న వాళ్లు జిల్లాకు వచ్చారు. గత అనుభవాల నేపథ్యంలో కొత్తగా వచ్చిన తహసీల్దార్లు రెవెన్యూ వ్యవహారాల జోలికి వెళ్లేందుకు జంకుతున్నారు. ఏ ఫైల్ ముట్టుకుంటే ఏం జరుగుతుందోనన్న భయం వారిలో కనిపిస్తోంది. ఎన్నికల కోసం జిల్లాకు వచ్చి, అధికార పార్టీ నేతలు చెప్పిందల్లా చేస్తే జీవితాంతం ఆ పాపాలను మోయాల్సి వస్తుందని కొందరు తహసీల్దార్లు అంతరంగిక సమావేశాల్లో వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో సాధారణ సమస్యలను కూడా వారు పట్టించుకోవడం లేదు. గతంలో జరిగిన కుంభకోణాలు ఇతర జిల్లాల తహసీల్దార్లను ఆందోళనకు గురి చేస్తున్నాయి. 'మేము పనిచేసే మండలంలోని పరిస్థితులు మాకు తెలియవు కదా.. మేము ఎన్నికల పనుల్లో హడావిడిగా ఉన్నప్పుడు, స్థానికంగా ఉండే వీఆర్వోనో లేదా ఆర్‌ఐనో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి తప్పుడు నివేదికలు ఇస్తే ఆ తర్వాత మేము ఇబ్బంది పడాల్సి ఉంటుంది. ఎన్నికల తర్వాత మేము మాజిల్లాలకు వెళ్లిపోయినా విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది. గతంలో జరిగిన వ్యవహారాలను చూశాం కదా.. మళ్లీ ఆ ఊబిలోకి దిగడం ఎందుకు..? ఏదో ఎన్నికలకు వచ్చాం.. ప్రశాంతంగా ఎన్నికలు పూర్తి చేసుకొని వెళ్లి పోతాం' అంటూ ఓ తహసీల్దార్ వ్యాఖ్యానించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఇతర జిల్లాల తహసీల్దార్లు అతి జాగ్రత్తతో వ్యవహరిస్తుండడంతో సాధారణ రెవెన్యూ సమస్యలకూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మ్యుటేషన్లు, కన్వర్షన్లు, భూసేకరణ.. ఇలా రెగ్యులర్‌గా నడిచే పనులు కూడా అలస్యమవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ఈ విషయాలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. అయినా ఫలితం ఉండడం లేదు. ఇటీవల ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లందరినీ ఉన్నతాధికారులు కలెక్టరేట్‌కు పిలిచి దిశానిర్దేశం చేయడం గమనార్హం. కొత్త తహసీల్దార్ల రాకముందు వరకు అనేక ఫైళ్లు తహసీల్దార్ కార్యాలయాల్లో సిద్ధమయ్యాయి. వీటిల్లో రెవెన్యూ రికార్డుల కరెక్షన్లు, అసైన్డ్ భూముల క్లియరెన్స్, నిషేధిత జాబితా నుంచి తొలగింపు వంటి పలు క్లిష్టమైన సమస్యల ఫైళ్లు ఉన్నాయి. వీటిని క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంది.





దీంతో గత తహసీల్దార్లు తయారు చేసిన ఫైళ్లను కొత్త తహసీల్దార్లు పక్కన పెడుతున్నారు. కొన్ని మండలాల్లో ప్రస్తుత తహసీల్దార్లపైనా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు ఎక్కువవుతుండటంతో వారు అక్కడి నుంచి తమను వేరే చోటకు పంపాలని ఉన్నతాధికారులను కోరుతున్నట్లు తెలుస్తోంది. ఈ కోవలోనే పలువురికి స్థాన చలనం కూడా కల్పించారు. మరి కొంత మంది తహసీల్దార్లను జిల్లాకు కేటాయించినా వారు విధుల్లో చేరుందుకు వెనకడుగు వేస్తున్నారు.

● అన్నీ ఇన్నీ కాదు

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో భూసమస్యలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల పేర్లపైకి మార్చడం, వివాదంలో ఉన్న భూములను ఒకరికి అనుకూలంగా మార్చడం, ఒకరి భూమిని మరొకరి పేర్లపైకి రికార్డులు ఎక్కించడం.. ఇలా అనేక భూ కుంభకోణాలు జిల్లాలో వెలుగుచూశాయి. మొదట్లో పొదలకూరు, వెంకటాచలం, నెల్లూరు రూరల్, కావలి, చిల్లకూరు, సైదాపురం, రాపూరు, కలువాయి వంటి మండలాల్లో అనేక భూఅక్రమాలు వెలుగు చూడగా, ఇటీవల ఆత్మకూరు, ఉదయగిరి, మర్రిపాడు, దుత్తలూరు, వింజమూరు తదితర మండలాల్లో భూ అక్రమాలు ఎక్కువయ్యాయి. అందుకు ప్రధాన కారణం ఆ ప్రాంతాల్లో జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతుండడంతో భూములకు విలువ పెరగడమేనని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. రెవెన్యూ సిబ్బంది రికార్డులు మార్చేసిన ఫలితంగా ఇరువర్గాల మధ్య తగాదాలు ఎక్కువైపోయాయి. అదే సమయంలో కోర్టు కేసులు కూడా విపరీతమయ్యాయి. గడిచిన నాలుగన్నరేళ్లలో జిల్లాలో 50 మందికిపైగా రెవెన్యూ సిబ్బందిపై వేటు పడింది. అందులో తహసీల్దార్లే ఎక్కువ. పలువురు రెవెన్యూ సిబ్బంది జైలుకు కూడా వెళ్లారు. ఈ పరిస్థితుల్లో కొత్తగా జిల్లాకు వచ్చిన తహసీల్దార్లు భూ వ్యవహారాలను ముట్టుకునేందుకు భయపడుతున్నారని రెవెన్యూ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

టీడీపీ సీనియర్ నేత రామానాయుడు కన్నుమూత

- వింజమూరు సమితి అధ్యక్షుడిగా సేవలు
- జొన్నలగడ్డ మృతికి పలువురి సంతాపం

కలిగిరి, మార్చి 3: టీడీపీ సీనియర్ నాయకుడు, వింజమూరు సమితి మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ రామానాయుడు(78) అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి కన్నుమూశారు. కాగా ఆయన స్వగ్రామమైన కలిగిరి మండలం సిద్ధనకొండూరుకు ఆదివారం ఉదయం మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకటరామారావు, కంభం విజయరామిరెడ్డి, ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్, కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, దమ్ము దర్గాబాబు, కొప్పర్తి నాగరాజు తదితరులు చేరుకుని రామానాయుడు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండలంలో అందరితో పెద్దాయన అనిపించుకుంటూ, టీడీపీకి పెద్దదిక్కు అయిన రామానాయుడు మృతి తెలుగుదేశంపార్టీకి తీరని లోటని వారు పేర్కొన్నారు.



రామానాయుడు (ఫైల్)

● రామానాయుడు మరణం దిగ్భ్రాంతికరం

నెల్లూరు (వైద్యం) : వింజమూరు మాజీ సమితి అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నేత జొన్నలగడ్డ రామానాయుడు అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మృతి ఉదయగిరి మెట్టప్రాంతానికి తీరని లోటన్నారు. 1981 - 87 వరకు వింజమూరు సమితి అధ్యక్షుడిగా ఆయన సేవలు అందించారని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నామన్నారు.

మహీధర్ మార్గమెటు ?

వైసీపీ ఫ్లెక్సీల్లో ఎమ్మెల్యే ఫొటో

అయోమయంలో అభిమానులు

కందుకూరు, మార్చి 3: వచ్చే ఎన్నికల్లో కందుకూరు సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పోటీలో ఉంటారా.. లేక ఆయన రాజకీయాల నుంచి తప్పుకుంటారా ? అన్న ప్రశ్నలకు సమాధానం దొరక్క నియోజకవర్గ ప్రజలు, ఆయన అభిమానులు అయోమయానికి గురవుతున్నారు. 'వైసీపీ ఫ్లెక్సీల్లో నా ఫొటో ఉండటానికి వీల్లేదు, జగన్ ఫొటోనే పెద్దది వేసుకోండి' అని వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌కు సుతిమెత్తగా మహీధరరెడ్డి చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఆపార్టీ కీలకనేత విజయసాయిరెడ్డి వచ్చి కలిశాక ఆదివారం తెల్లవారేసరికి కందుకూరులో నిలువెత్తు మహీధర రెడ్డి ఫొటోలతో వైసీపీ ఫ్లెక్సీలు కనిపించడం చర్చనీయాంశమైంది. విజయసాయిరెడ్డితో మహీధరరెడ్డికి ఉన్న సత్సంబంధాల వల్ల కాదనలేక ఆయన అడిగేసరికి సరే అన్నాడా.. లేక వ్యూహాత్మకంగానే తన ఫొటో వేసుకోనిచ్చాడా..? అని ఆయన అనుచరులు తర్జనభర్జన పడుతున్నారు. వైసీపీతో సర్దుకుపోయేధోరణితో ఎమ్మెల్యే ఉన్నాడా..? అనే అనుమానాలు కూడా రేకెత్తించాయి. అయితే ఆదివారం తనను కలిసి అభిమానులతో మహీధర్ మాట్లాడుతూ ' రెండురోజులు ఓపిక పట్టండి, ఏమి జరుగుతుందో చూడండి. నా నిర్ణయం కోసం ఎదురుచూసేవారే నావారు. ఓపికలేకుండా వెళ్లేవారు వెళ్లనివ్వండి' అని అన్నారు. అయితే సిటింగ్ ఎమ్మెల్యే తప్పక పోటీలో ఉంటారని, అది ఏపార్టీ అనేది నిర్ణయం జరగాల్సి ఉందని ఆయన అనుచరులు చెబుతున్నారు. అయితే మహీధరరెడ్డి ఆ సస్పెన్స్‌కు త్వరగా తెరదించితే బాగుంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

చిన్నారులకు చుక్కల మందు తప్పనిసరి : కలెక్టర్

- మూడురోజులపాటు కార్యక్రమం నిర్వహణ
- 98.02 శాతం విజయవంతం



నెల్లూరు జేవీఆర్ కాలనీ ఆరోగ్య కేంద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ హరినారాయణన్, పక్కన డీఎంహెచ్‌వో పెంచలయ్య

నెల్లూరు (వైద్యం)మార్చి 3: చిన్నారులందరూ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఆదివారం నెల్లూరు నగరంలోని జేవీఆర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం నుంచి పోలియో మహమ్మారిని పూర్తిగా తరిమి కొట్టాలన్నారు. తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలను శిబిరాలకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలన్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పోలియో బూత్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. జిల్లాలో 3 లక్షల మందికిపైగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈనెల 4,5,6 తేదీల్లో కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సెలీనాకుమారి, డాక్టర్ మౌనిక, డాక్టర్ రమేష్, డాక్టర్ కుసుమ, డెమో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● 98.02 శాతం పల్స్‌పోలియో విజయవంతం

జిల్లా వ్యాప్తంగా 98.02 శాతం మందికి పోలియో చుక్కలు వేశారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 2,93,536 మంది ఉండగా, 2,87,772 మందికి పోలియో చుక్కలు వేశారు. మొత్తం 2,396 బూత్‌లతోపాటు 65 మొబైల్ బూత్‌లు, 85 ట్రాన్సిట్ బూత్‌ల ద్వారా వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది పోలియో చుక్కలు వేశారు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతోపాటు వైద్య విధాన పరిషత్ వైద్యాధికారులు కూడా పాల్గొని పల్స్‌పోలియో తీరును పరిశీలించారు.



మహిమలూరు ఆరోగ్య కేంద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కేంద్ర రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి

హరిత రాయబారుల ఆకలి కేకలు

- వేతనాలు అందక ఇక్కట్లు
- పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం
- నిరుపయోగంగా చెత్త సంపద తయారీ కేంద్రాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

వరికుంటపాడు, మార్చి 3: సంపూర్ణ పారిశుధ్య కోసం నియమించిన హరిత రాయబారులు ఆకలి కేకలతో అల్లాడుతున్నారు. పంచాయతీలను బట్టి ఒక్కొక్కరికి ఏడెనిమిది నెలలుగా వేతన బకాయిలు ఉన్నాయి. దీంతో పూట గడవడం లేదని వారు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో చేసేదేమిక లేక కొంతమంది ఇతర పనులతో జీవనం సాగిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు.

● పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

2018 అక్టోబరు 2న టీడీపీ ప్రభుత్వం చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకు వచ్చింది. వాటి పరిధిలో హరితరాయబారులను నియమించింది. వారు నివాసాల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను కేంద్రాలకు తరలించేవారు. ప్రతి నిత్యం గ్రామాలను శుభ్రంగా ఉంచే తమను ప్రస్తుత ప్రభుత్వం చిన్నచూపు చూడడం దారుణమని వారు మండిపడుతున్నారు. మురికి కూపాల్లో పనిచేస్తు అనారోగ్యాల బారిన పడుతున్నా, వైద్య ఖర్చులకు కూడా నగదు లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలుత స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా జిల్లాలో సుమారు 1,700 పైబడిన హరిత రాయబారులను నియమించింది. వారికి ఒక్కొక్కరికి నెలకు రూ. 6వేలు వంతున వేతనాన్ని వారి ఖాతాల్లో జమ చేసేది. 2022 ఏప్రిల్ నుంచి ప్రభుత్వం ఆ బాధ్యతలను పంచాయతీలకు అప్పగించంది. పంచాయతీలకు మంజూరు అయ్యే నిధులు కాస్తా విద్యుత్ బకాయిలు, అభివృద్ధి పనులకే సరిపోతుండడంతో వీరికి వేతనాలు అందించడం లేదు.



చెత్త సేకరిస్తున్న హరిత రాయబారులు(ఫైల్)

● బతుకు భారమై..

నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో అప్పులు తెచ్చుకుంటూ జీవనం సాగిస్తున్నామని వారు పేర్కొన్నారు. ప్రతి మండలంలోనూ ఇదే పరిస్థితి. కాగా పంచాయతీల్లో రూ. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ట్రాలీలు, రిక్షాలు, ఇతరత్రా వాహనాలు, యంత్రాలు ఎందుకు పనికి రాకుండా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వేతనాలు అందకపోవడంతో అంతంతమాత్రంగానే విధులు నిర్వహిస్తున్న హరిత రాయబారుల పుణ్యమా...అని వాటిని వినియోగించే పరిస్థితి లేకపోయింది.

● విధులకు ఎగనామం

నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక మధ్యలోనే విధులకు ఎగనామం పెడుతున్నారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో పాటు చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు సైతం నిరుపయోగంగా మారాయి. పల్లెలో చెత్తను ఎత్తకపోవడంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. సకాలంలో వేతనాలు అందించాలని వేడుకొంటున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని వారు జిల్లా అధికారులను కోరుతున్నారు.

అప్పులపాలయ్యాం...



నెలల తరబడి వేతనాలు అందకపోడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో కుటుంబాన్ని పోషించడం భారంగా మారడంతో అప్పులపాలయ్యాం. వేతనం వస్తుందనే ఆశతో చేసిన అప్పులు తలకు మించిన భారంగా మారాయి.

- ముంగర ఏసు, పెద్దిరెడ్డిపల్లి

సర్వం.. ప్లాస్టిక్ మయం !

- ఎక్కడా కానరాని నిషేధం
- గ్రామాలు, పట్టణాల్లో విచ్చలవిడిగా వ్యర్థాలే...
- అరికట్టడంలో ప్రభుత్వం విఫలం
- వాడకం కొనసాగితే భవిష్యత్ తరాలకు ముప్పు
- హెచ్చరిస్తున్న పర్యావరణ నిపుణులు



నదీ తీరంలో చేరిన ప్లాస్టిక్ వ్యర్థాలు

అల్లూరు, మార్చి 3 : ప్లాస్టిక్ వినియోగం మానవ జీవనశైలిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ప్రకృతిలోని జీవరాశులను అంతమొందించేది ఏ ప్రళయమో.. భూకంపమో.. అనుకుంటే పొరపాటు. మానవుడు విచ్చలవిడిగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువులే అతని వినాశానికి కారణమవుతున్నాయి. గత పదేళ్లుగా ప్లాస్టిక్ మానవ జీవితంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నది. ఈ క్రమంలో ప్లాసిక్ వినియోగాన్ని నిషేధిస్తామని ప్రభుత్వం చెప్పే మాటలు ప్రకటనలే పరిమితమయ్యాయి. నేడు గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తాయి. వాడకాన్ని ఇలానే కొనసాగిస్తే భవిష్యత్తు తరాలకు ముప్పు వాటిల్లుతుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● ప్లాస్టిక్‌దే పైచేయి..

గతంలో కాటన్, లెదర్ సంచులు, వెదురు బుట్టలు తదితర వాటిని వినియోగించేవారు. కానీ ప్రస్తుతం ప్లాస్టిక్ వినియోగానికి పైచేయిగా ఉంది. మానవుడి జీవన సరళికి అనుగుణంగా విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. వీటిలో గృహాల్లో ఏర్పడే వ్యర్థాలను అందులో నింపి మళ్లీ రోడ్డుపైనే పడేస్తున్నారు. ఆ ఆహార వ్యర్థాలను పశువులు కవర్లతోసహా తినడంతో వాటి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపి మరణానికి దారి తీస్తున్నాయి. అంతేకాక భూమిలో, నీటిలో ప్లాస్టిక్ సంచులు చేరి ప్రాణులకు, చెట్లకు హాని చేస్తున్నాయి.



చెత్తలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న ఆవులు, పందులు

దీంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలను నాశనం చేయలేమని తెలిసి కూడా కొంతమంది వాటిని కాల్చేస్తుంటారు. వీటి నుంచి వెలువడే పొగలో పలు విషపూరితమైన వాయువులు గాలిలో కలిసి జీవరాశికి ముప్పు తెచ్చిపెడుతున్నాయి. వీటిలో ముఖ్యంగా నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, వోలటైన్ ఆర్గానిక్ కెమికల్స్ కాల్చగా మిగిలిన పదార్థాన్ని పాలిసైక్లిక్ ఆర్గానిక్ మ్యాటర్ అంటారు. అంతేకాకుండా హెవీమెటల్స్, డై ఆక్సిన్ అనే విషపూరిత వాయువులు వెలువడుతాయి. వీటి వల్ల శ్వాసకోశ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

● ప్లాస్టిక్‌లో రకాలు

ప్లాస్టిక్‌లో ఐదు రకాలను వర్గీకరించవచ్చు. మొదటిది పాలిథిలిన్. దీన్ని షాపింగ్ బ్యాగ్స్, ధాన్యం నిల్వ చేసే సంచుల తయారీకి ఉపయోగిస్తారు. రెండోది పాలివినైల్ క్లోరైడ్ (పీవీసీ) దీన్ని బాటిల్స్, కంటైనర్స్ తయారీలో వినియోగిస్తారు. మూడోది పాలిథిలిన్ టెరిథాలేట్ (పీఈటీఈ) దీన్ని బేవరేజ్ బాటిళ్ల తయారీలో వినియోగిస్తారు. నాలుగోది పాలిస్టెరిన్ (పీఎస్) లైట్ స్పాంజ్ మెటీరియల్, మాంసం, గుడ్లు పెట్టుకునే ట్రేల తయారీకి వినియోగిస్తుంటారు. ఐదవది పాలి ప్రొపిలిన్ (పీపీ) స్ట్రాలు, పెరుగు, మజ్జిగ నిల్వ చేసుకునే ప్రత్యేక బ్యాగ్‌లను తయారీకి వినియోగిస్తారు. ఇవన్నీ కూడా ఒకసారి వినియోగించి పక్కన పడేసేలా ఉంటాయి.

● ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి

ప్లాస్టిక్ వినియోగం తగ్గించి సమాజాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దాలి. వ్యాధులు రావడానికి ప్లాస్టిక్ వ్యర్థాలే 50 శాతం కారణమనే విషయాన్ని మనం ఎందుకు గ్రహించడం లేదు. ప్లాస్టిక్ కవర్లు వాడకాన్ని 0 శాతానికి చేర్చినప్పుడే కొంతవరకు కాలుష్యాన్ని నిలువరించగలుగుతాం. చెట్లను కాపాడడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గినపుడే స్వచ్ఛమైన ప్రకృతిని సాధించగలమని నిపుణులు పేర్కొంటున్నారు.

● నిషేధంలో ప్రభుత్వం విఫలం

ప్లాస్టిక్ వినియోగం ప్రస్తుత మానవాళితోపాటు భావితరాల వారికి పెనుముప్పును తీసుకొస్తుందని పరిశోధకులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఈ దిశగా ప్లాస్టిక్‌ను నియంత్రించడం, నిషేధించడం ప్రభుత్వం బాధ్యత. అయితే రాష్ట్రంలో ప్లాస్టిక్ పూర్తిగా నిషేధిస్తామని చెప్పిన ప్రజా ప్రతినిధులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలతో తీవ్ర ప్రమాదం ఉన్నప్పటికీ వాటిని నిషేధిస్తామని ప్రకటనలు చేసిన ప్రభుత్వం ఆచరణలో ఎ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. క్షేత్రస్థాయిలో అధికారులు దుకాణదారులపై దాడులు చేసి, జరిమానా విధిస్తున్నారేతప్ప ఇతర చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మళ్లీ యథా విధిగా ప్లాస్టిక్ వినియోగం కొనసాగుతోంది.

పరోక్ష విషం



ప్లాస్టిక్ సంచులు, వస్తువులు జీవరాశులకు పరోక్ష విషంగా భావించవచ్చు. వీటిని వాడడం వల్ల భావితరాలకు ముప్పు పొంచి ఉంది. ప్లాస్టిక్‌ను నివారించకుంటే భవిష్యత్‌లో జీవనం కష్టమే.

- అల్లూరు వెంకట సుకుమార్‌రెడ్డి, అల్లూరు

పర్యావరణానికి ముప్పు



ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుంది. ప్రతి వస్తువు మట్టిలో కలిసిపోతోంది. అయితే ప్లాస్టిక్ మాత్రం ఎట్టిపరిస్థితుల్లో మట్టిలో కరగదు. దీని వాడకాన్ని నిలువరించగలిగితే ప్రకృతిని కాపాడుకోవచ్చు.

- కొప్పు శ్రీనివాసులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, అల్లూరు

సమష్టి కృషితో పోలియో నివారణ


కావలిటౌన్ : పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత


ఉలవపాడులో..

కావలిటౌన్, మార్చి 3: సమష్టికృషితో పోలియో నివారణ సాధ్యమని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత పేర్కొన్నారు. ఆదివారం ఏరియా వైద్యశాల ప్రాంగణంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కావలి డివిజన్‌లో 520 బూతులలో, బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రధాన కూడళ్లలో, మొబైల్ వాహనం ద్వారా పిల్లలకు చుక్కలు వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సహాయ అధికారి శివకుమార్, డాక్టర్ రజిని, ఎస్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కందుకూరు: పట్టణ పరిధిలో 35కేంద్రాలు, మొబైల్ వాహనం ద్వారా 5457మంది చిన్నారులకు పోలియోచుక్కలు


కందుకూరులో...

వేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రియంవద, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ శకుంతల కార్యక్రమాన్ని ప్రారంభించగా వైద్యాధికారులు బ్యూలాగ్రేస్, జువేరియాభాను, రాకేష్, సీహెచ్ఎన్ పద్మావతి, శోభ, సుధాకర్ పర్యవేక్షించారు.

లింగసముద్రం : 16 గ్రామ పంచాయతీలలో 3014 మంది చిన్నారుల్లో 2894 మందికి చుక్కలు వేసి 97.64 శాతం పూర్తిచేసినట్లు లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి పీ.రమేష్ తెలిపారు. మిగిలిన 120మందికి సోమ, మంగళ వారాల్లో ఇంటింటికి తిరిగి వేస్తారని చెప్పారు.

ఉలవపాడు : మండలంలో 97 శాతం పూర్తి చేసినట్లు కరేడు, చాకిచర్ల సెక్టార్ల వైద్యాధికారులు తెలిపారు. కరేడు పీహెచ్‌సీ పరిధిలో 3251మందికి 23బూత్‌లలో 2980మందికి డాక్టర్ కే శ్రీనివాసరావు పర్యేక్షణలో పోలీయో చుక్కలు వేశారు. చాకిచర్ల పీహెచ్ పరిధిలో డాక్టర్ సింధుప్రియ పర్యేక్షణలో 2876మంది పిల్లలకు 22 పోలియో బూత్‌ల్లో 2798 మందికి చుక్కలు వేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

బిట్రగుంట: కోవూరుపల్లి పీహెచ్‌సీ, జువ్వలదిన్నె పరిధిలో 98శాతం పోలియో చుక్కలు పూర్తి చేసినట్లు వైద్యులు పి.జిహారిక, రాజశేఖర్ తెలిపారు. మండలంలో 5178 మంది చిన్నారులకు 53పల్స్‌పోలియో కేంద్రాలతో 5106 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సులోచన, ఎఫ్ఎస్‌మేరీ, విక్టోరియారాణి, కృష్ణమూర్తి, వసంత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలేటివారిపాలెం: 15 గ్రామ సచివాలయాల పరిధిలో


లింగసముద్రంలో...

3963మంది పిల్లలుండగా 3935 మందికి చుక్కలు వేసి 96.72 శాతం పూర్తి చేసినట్లు వైద్యాధికారి మణిదీపిక తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాసులు, శివ, మణిదీపిక, సీహెచ్‌వో శివరామయ్య, సర్పంచులు అనుమోల అమరేశ్వరి, ఇరపని సతీష్, డేగా వెంకటేశ్వర్లు, ఉప సర్పంచు గురిజాల క్రిష్ణయ్య, పరిటాల వీరాస్వామి పాల్గొన్నారు.

ఆత్మకూరు: మహిమలూరు ప్రాథమిక పాఠశాలలో కేంద్ర రక్షణశాఖ సాంకేతిక సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి వైద్యాధికారులతో కలిసి పల్స్ పోలియోను ప్రాంభించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో షేక్ ఖాదర్‌వలి, డివిజన్ ప్రోగాం ఆఫీసరు డాక్టర్ సుధీర్‌కుమార్, మహిమ లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అనూష, సర్పంచ్ చంద్రశేఖర్ రావు, ప్రధానోపాధ్యాయులు షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు. ఆత్మకూరులో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్బన్ ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి షేక్ అస్మా, ఎంపీహెచ్‌వో సిద్ధం సుధాకర్ పాల్గొన్నారు.

సంగం: పల్స్ పోలియో 97 శాతం విజయవంతమైనట్లు వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. 3,543 మంది చిన్నారుల్లో 3,443మందికి చుక్కలు వేశామన్నారు.

మర్రిపాడు: బ్రాంహ్మణపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైద్యుడు గోపినాథ్ ఉన్నారు.

అనంతసాగరం: వైద్యులు శ్రీకాంత్ రెడ్డి, శ్రావణి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

సీతారామపురం: మండలంలో 98.7 శాతం పోలియో చుక్కలు వేసినట్లు వైద్యురాలు స్వప్న తెలిపారు. బస్టాండ్ సెంటర్‌లో ఒక బూత్, మొబైల్ కింద బూత్ ఉపయోగించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భవ్యశ్రీ, ఎంపీహెచ్ ఈవో అబ్దుల్ మజీద్, ఎంపిహెచ్ఎస్ రియాజ్ పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): 98.4శాతం మంది చిన్నారులకు చుక్కలు వేసినట్లు వైద్యాధికారి అయూబ్‌అప్సర్ తెలిపారు. మండల కేంద్రం లో ఎస్ఐ ఉమాశంకర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. సీహెచ్‌వో ఒంకారయ్య, హెచ్ఈ బీబీజాన్, ఖాజామొహిద్దీన్ పాల్గొన్నారు.

ఏఎస్ పేట: పల్స్‌పోలియోను 100శాతం పూర్తి చేయాలని పల్స్ పోలియో రాష్ట్ర అబ్జర్వర్, డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్ బాబు తెలిపారు. చిరమణ పీహెచ్‌సీలోని హసనపురంలో పోలియో కార్యక్రమన్ని పరిశీలించి, ట్యాలీ షీట్స్ తనిఖీ చేశారు. 97శాతం పూరైనట్లు వైద్యులు తెలిపారు.

ఉదయగిరి: గండిపాళెం ప్రాథమిక కేంద్రం, ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో గండిపాళెం వైద్యాధికారిణి శివకల్పన చిన్నారులకు చుక్కలు వేశారు.

వరికుంటపాడు: మండలంలో 97శాతం పోలియో చుక్కలు వేసినట్లు వైద్యులు కరిష్మా, ఆయేషా తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజశేఖరరాజు, పీహెచ్ఎన్ సుశీలమ్మ, సూపర్‌వైజర్ వెంకటయ్య, హెల్త్ అసిస్టెంట్ యనమల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: మండలకేంద్రంతో పాటు జర్ల, చిత్తలూరు పరిధిలో కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు వైద్యాధికారులు మెహబత్, నవీన్, జ్యోతి తెలిపారు.

వింజమూరు: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని డాక్టర్ మురళీధర్‌రావు ప్రారంభించారు. 96శాతం పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు.


పలేటివారిపాలెంలో...


దుత్తలూరులో..ఎస్ఐ ఉమాశంకర్


సీతారామపురం:చుక్కలు వేస్తున్న డాక్టర్ స్వప్న


బిట్రగుంటలో...


ఆత్మకూరులో కమిషనర్ షేక్ ఫజులుల్లా


అనంతసాగరంలో...


చేజర్ల : చిత్తలూరులో..


మర్రిపాడులో..


ఏఎస్ పేట : హసనాపురం కేంద్రాన్ని పరిశీలిస్తున్న పల్స్ పోలియో డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్ బాబు


వరికుంటపాడులో...

వలస వాసుల ఆత్మీయ సమావేశం

ఉదయగిరి రూరల్: బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లోని నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో ఆదివారం నియోజకవర్గం నుంచి వలస వెళ్లిన వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేక పాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని కోరారు. అనంతరం ఆయన్ను, ఇతర నేతలను వలసవాసులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ భైరెడ్డి సిద్ధార్థరెడ్డి, యువ నాయకుడు మేకపాటి అభినయ్‌రెడ్డి, జీ.ఓబులరెడ్డి, సీహెచ్ సుబ్బారెడ్డి, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, అలీఅహ్మద్ పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ఉదయగిరి రూరల్, మార్చి 3: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక దుత్తలూరు సభ్యులు ఆదివారం పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేసి విస్తృత ప్రచారం నిర్వహించారు. శివరాత్రి అనగా కర్మ నాశనం జరిగితే కలిగే మోక్షంకు గుర్తుఅని, అందుకే శివరాత్రిని మోక్షరాత్రి అని అంటారన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ప్రసాద్, కమిటీ సభ్యులు సుధాకర్, వెంకటేశ్వర్లు, నరసింహులు, నాగమ్మ, రమణమ్మ, భరత్‌కుమార్, రమణయ్య, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణపై చర్యలు తీసుకుంటారా..?


మరుగుదొడ్లు తొలగించిన తర్వాత ఖాళీస్థలం

చేజర్ల, మార్చి 3: కొలపనాయుడు పల్లిలో ఎస్ఎస్ఏ నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను శనివారం స్థానిక వైసీపీ నాయకుడు తొలగించి, ఆ స్థలాన్ని ఆక్రమించిన నేపథ్యంలో సదరువ్యక్తిపై చర్యలు తీసుకుంటారో లేదో అని గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ స్థలం ఆక్రమణలపై ఫిర్యాదు చేశామని అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే ఈ సంఘటన జరిగి ఉండేదికాదని అధికారులపై స్థానికులు మండి పడుతున్నారు. అసలు ప్రభుత్వ స్థలాల్లో కట్టడాలు తొలగించాలంటే పంచాయతీ, మండల తీర్మానాలు తప్పనిసరిగా ఉండాలని తెలియదా అని చర్చించుకుంటున్నారు. ఆదివారం అందుబాటులో లేని అధికారులు సోమవారం ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలంటున్నారు.

భీమేశ్వరాలయంలో శివరాత్రి వేడుకలు


భీమేశ్వరాలయంలో ధ్వజారోహణ నిర్వహిస్తున్న పూజారులు

సంగం, మార్చి 3: వంగల్లులో వెలసిన కామాక్షిదేవి సమేత భీమేశ్వరాలయంలో శనివారం అర్ధరాత్రి ధ్వజారోహణ చేపట్టడంతో మహాశివరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య నడుమ ధ్వజారోహణ నిర్వహించారు. ఉత్సావాలు ఈ నెల 10వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ వేడుకల్లో కామాక్షిదేవి, భీమేశ్వరస్వామి రోజుకోక వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. అందులో భాగంగా ఆదిరాత్రి శేషవాహనం దర్శనమిచ్చారు.

నేటి నుంచి..

జ్ఞాన త్రిపురసుందరీదేవి సమేత చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు సోమ వారం నుంచి 8వ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నాగారపమ్మదేవికి ప్రత్యేక పూజలు

సంగం, మార్చి 3: కోలగట్లలో వెలసిన నాగారపమ్మదేవికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించి, పొంగళ్లు పొంగి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

పడమటిపాళెం షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు చేసి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పూజలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే సోదరుడు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం భక్తులు అన్నదానం చేశారు. .

దుర్గంపై యువకుల శ్రమదానం


దుర్గంపై గల తొట్టిని శుభ్రం చేస్తున్న యువకులు

ఉదయగిరి, మార్చి 3: ఐడియల్ యూత్ మూమెంట్ ఆధ్వర్యంలో ఉదయగిరి దిలావర్‌భాయ్‌వీధి యువకులు ఆదివారం ఉదయగిరి దుర్గంపై ఉన్న కోన నీటితొట్టిని శుభ్రం చేశారు. పట్టణంలోని 50 శాతం మంది తాగే కోన నీటితొట్టి కాలువ అపరిశుభ్రంగా మారింది. దీన్ని గుర్తించిన యువకులు అందులో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయడంతో పట్టణ వాసులు యువకులను అభినందించారు. కార్యక్రమంలో ఐడియల్ యూత్ మూమెంట్ ఉదయగిరి శాఖ అధ్యక్షుడు షేక్ అబ్దుల్, మునాఫ్, కార్యదర్శి సాజిత్, మసూద్, ఇమ్రాన్, అజరుల్లా, సమత్, లతీఫ్, నస్రుల్లా, హుమాయిన్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

ఉదయగిరి రూరల్, మార్చి 3: శకునాలపల్లి పంచాయతీలోని కుర్రపల్లి బీసీ కాలనీకి చెందిన తిరుపతి రాజా అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉప సర్పంచ్ రేకలగుంట పద్మ ఆదివారం వారి కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్నాళ్లకు దళితులు గుర్తొచ్చారా..?

చేజర్ల, మార్చి 3: మండలంలోని వైసీపీ నాయకులకు నాలుగేళ్ల పది నెలలు గుర్తురాని దళితులు ఎన్నికలు సమీపిస్తున్న వేళ మీకు ఏమి పనికావాలన్నా చేసిపెడతామంటూ సంప్రదింపులు చేయడం ఆశ్చర్యంగా ఉందని టీడీపీ మండల దళిత నాయకుడు సోమవరపు హజరత్తయ్య ప్రశ్నించారు. ఆదివారం చేజర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో దళిత కాలనీల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు కాళ్లు అరిగేలా తిరిగినా పట్టించుకోలేదని, ప్రస్తుతం వచ్చి హడావుడి చేయడం విచారకరం అన్నారు. కార్యక్రమంలో జయరామయ్య, అంజినేయులు, తిరపతయ్య పాల్గొన్నారు.

నూతన పాలసీలను సద్వినియోగం చేసుకోండి

ఉదయగిరి రూరల్, మార్చి 3: భారతీయ జీవిత బీమా సంస్థ ఆధ్వర్యంలో వినియోగ దారుల సౌకర్యార్థం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆరు నూతన పాలసీలు ప్రవేశపెట్టిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ ఆర్‌కే రవికుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆల్‌ఖైర్ ఫంక్షన్ హాల్‌లో ఆయన ఏజెంట్లతో సమావేశమై పాలసీలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.


మాట్లాడుతున్న ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్

చంద్రబాబు రావాలి.. రాష్ట్రం బాగుపడాలి

● 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'లో ఇంటూరి

కందుకూరు, మార్చి 3: చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలందరూ కోరుకుంటున్నారని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని 31వ వార్డు సాయినగర్‌లో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు నరకం చూయించిన జగన్మోహనరెడ్డిని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముచ్చు శ్రీను, అత్తంటి శివకృష్ణ, చుంచు వేణు, గుమ్మళ్ల మాల్యాద్రి, బత్తిన ఆదెమ్మ, రావి సరిత, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంచుతున్న ఇంటూరి నాగేశ్వరరావు, నాయకులు

అలాగే పట్టణంలోని 9వ వార్డు పరిధిలో ఉన్న ఆదిఆంధ్ర కాలనీలో ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు.

మాజీ కౌన్సిలర్, వైసీపీ నేతలు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన వైసీపీ మాజీ కౌన్సిలర్ శేషమ్మ

కావలి, మార్చి 3: కావలి పట్టణంలోని 11వ వార్డుకు చెందిన వైసీపీ మాజీ కౌన్సిలర్ మొలతాటి శేషమ్మతో పాటు 10, 11 వార్డులకు చెందిన పలువురు వైసీపీ నేతలు ఆదివారం టీడీపీలో చేరారు. వారికి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, ఎస్సీ ఫిషర్‌మ్యాన్ సొసైటీ చైర్మన్ యల్లంటి వెంకటేశ్వర్లు, టీడీపీ నేతలు జ్యోతి బాబురావు, ఆత్మకూరు నాగరాజు, మేడికొండ సుకుమార్, వల్లేరి వెంకటకిరణ్‌కుమార్ సమక్షంలో వైసీపీ నేతలు బొడ్డు వెంకటనారాయణ, మొలతాటి మనోహర్, మార్పుడి మాచర్ల, పీసీ రామారావు తదితరులు వారి అనుచరులతో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ నన్ను నమ్మి టీడీపీని గెలిపించేందుకు పార్టీలో చేరే వారికి సముచిత స్థానం కల్పిస్తానన్నారు. వారికి ఎప్పుడు ఎలాంటా కష్టం వచ్చినా వారి వెన్నంటే ఉంటూ వారి రుణం తీర్చు కుంటానన్నారు.

ప్రతిపక్షాలను విమర్శించే రాజకీయాలు చేయను

కందుకూరు, మార్చి 3: ప్రతిపక్ష నాయకులను విమర్శించడం, ప్రత్యర్థులపై బురదజల్లి లబ్ధి పొందడం లాంటి రాజకీయాలు చేయబోనని, అకారణంగా చంద్రబాబునో మరొకరినో విమర్శించమంటే విమర్శించేది లేదని కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ పేర్కొన్నారు. కందుకూరులో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధర్మబద్ధంగా వ్యవహరిస్తానని, న్యాయం పక్షానే నిలుస్తానని పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే మహీధరరెడ్డి గ్రామగ్రామాన ఎంతో అభివృద్ధి చేశారని, ఆ ఒరవడిని కొనసాగించాలనే ఇక్కడకు వచ్చానన్నారు. తన వెంట నడిచేవారికి అన్నివిధాలుగా అండగా నిలుస్తానన్నారు. ఈ సమావేశంలో షేక్ రఫి, గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, మార్చి 3 : మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొన్నారు. ముందుగా అందిన సమాచారంతో ఆదివారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఏ మల్లికార్జునరావు, సిబ్బంది మన్నేరు నుంచి ఇసుక అక్రమంగా తీసుకొని వెళుతున్న ట్రాక్టర్‌ను స్థానిక రైస్‌మిల్లు వద్ద పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వైసీపీలో చేరిన మాలమహానాడు నేత శివాజీ

కావలిటౌన్, మార్చి 3: మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శివాజీ ఆదివారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. కార్యకర్తలతో ర్యాలీగా ముసునూరులోని ఎమ్మెల్యే నివాసానికి వచ్చి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యేని, శివాజీలను కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేముల చెన్నకేశవులనాయుడు, షాహల్, కుందుర్తి కామయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కందుకూరులో విజయ్‌కుమార్ పర్యటన

కందుకూరు, మార్చి 3: లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ ఈనెల 5న కందుకూరు నియోజకవర్గంలో పర్యటిస్తారని పార్టీ సమన్వయకర్త బుద్ధకోటి, చవలం కొండయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు పామూరు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో పార్టీ ఆత్మీయుల సమావేశం జరుగుతుందని తెలిపారు. ఏపీ యునైటెడ్ ఫ్రంట్‌లో భాగస్వామిగా ఉన్న లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించనుందని తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాస్వామిక వాదులు, పేదల అభ్యున్నతి కోరుకునేవారంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బహుజనుల అభివృద్ధికి బీఎస్పీ పోరాటం

లింగసముద్రం, మార్చి 3 : బహుజనుల అభివృద్ధికి బీఎస్పీ పోరాడుతోందని కందుకూరు బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి పేరం సత్యనారాయణ చెప్పారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక నాయకులతో కలిసి లింగసముద్రంలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదానం


రక్తదానం చేస్తున్న మహిళలు

కావలి, మార్చి 3: సేవియర్స్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దిన వారోత్సవాలలో భాగంగా ఆదివారం రెడ్‌క్రాస్‌లో యువతులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువతులు, మోటివేటర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సేవియర్స్ మహిళా విభాగం సభ్యులు సౌందర్య దీపిక, దివ్య, శ్రావ్య, నవ్య, స్రవంతి, పూజిత, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘికాలకు అడ్డాగా చెత్త నుంచి సంపద కేంద్రం

కొండాపురం, మార్చి 3: స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారి అసాంఘికాలకు నిలయమైంది. వివరాలకు మేరకు.. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న ఈ కేంద్రం గత ప్రభుత్వంలో నిర్మించినప్పటికీ చెత్త నుంచి సంపద తయారీ లక్ష్యం నెరవేరడంలేదు. మొక్కుబడిగా అడపాదడపా మాత్రమే గ్రామం నుంచి చెత్త తరలించి సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో రేయింబవళ్లు తేడా లేకుండా మందుబాబులు అక్కడే తాగి సీసాలను పగులకొడుతున్నారు. దీనికితోడు రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వీరి ఆగడాలకు అంతేలేకుండా పోతుందని, ఇప్పటికైనా పోలీసు శాఖ స్పందించి మందుబాబుల ఆగడాలను అరికట్టి ఇబ్బందులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


చెల్లాచెదురుగా పడిఉన్న ఖాళీ సీసాలు